మంగళవారం 5-3-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 344



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


సిద్ధం!
జయహో జగనన్నా...
నిరుపేదల పాలిట దైవం నీవన్నా..!
జనం కోసం జగనన్న సిద్ధం
జగనన్న సైనికుడిగా నేను సిద్ధం
మన ఎన్నికల గుర్తు
నిత్య శ్రామికునికి వందనం
ప్రజా సేవకునికి అభివందనం
గా॥ శ్రీ వై.వి. సుబ్బారెడ్డి గారు
రాజ్యసభ సభ్యులు
వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్
ప్రజా ప్రతినిధిగా పేదల అభ్యున్నతి కోసం
అహర్నిశలు కృషి చేసి...
టీటీడి ఛైర్మన్‌గా దేవదేవుని సేవలో తరించి...
వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ గా
పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ...
ఏ పదవిని అలంకరించినా ఆ పదవికే వన్నె తెస్తూ...
రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన
నాన్నకు వందనం..
అభినందనం...
జనం మెచ్చిన జగన్
జగం మెచ్చిన జగన్
మా నమ్మకం నువ్వే జగన్...
వై.విక్రాంత్‌రెడ్డి
వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 344

మంగళవారం 5-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చరిత్ర సృష్టించిన భారత జట్లు

టేబుల్ టెన్నిస్ టీమ్ విభాగంలో తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత - స్పోర్ట్స్‌లో



2 కంపెనీలుగా టాటా మోటార్స్


ప్యాసింజర్ వాహనాలతో ఒకటి.. వాణిజ్య వాహనాలతో మరో యూనిట్ - బిజినెస్‌లో



12 తర్వాత హాజరవుతా

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ విచారణకు ఈనెల 12 తర్వాత వర్చువల్‌గా హాజరవుతానని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు.

వివరాలు 6లో ▸



ఆ రోజే క్యాన్సర్ బయటపడింది

ఆదిత్య ఎల్-1 ప్రయోగం రోజు తన కడుపులో క్యాన్సర్ బయటపడిందని.. చికిత్సతో కోలుకున్నానని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ చెప్పారు.

వివరాలు 6లో ▸



కర్ణాటకలో యాసిడ్ దాడి

ప్రేమించలేదన్న కారణంతో కర్ణాటకలో ఒక యువకుడు యాసిడ్ దాడికి పాల్పడగా ముగ్గురు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



మారిన గుండెతో 4 దశాబ్దాలు

గుండె మార్పిడి చేయించుకున్న తర్వాత ఎక్కువ కాలం జీవించి ఉన్న వ్యక్తిగా నెదర్లాండ్స్‌వాసి గిన్నిస్‌కెక్కారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

సిగ్గు 'ఈడీ'సి రాతలా?

- తమిళనాడులో ఈడీ విచారణకు ఏపీలో ఇసుక పాలసీకి సంబంధం ఏమిటీ?
- ఇసుక తవ్వకాలను అక్కడితో పోల్చడం దిగజారుడుతనమే
- రోజురోజుకీ రామోజీకి పెరిగిపోతున్న అక్కసు
- పారదర్శక ఇసుక విధానంపై ఈడీ దృష్టి సారించాలనుకోవడం సిగ్గుచేటు
- ఈడీ విచారణ జరగాల్సింది మార్గదర్శి అక్రమాలపైనే

12 లో



బీసీ డిక్లరేషన్ కంటే మిన్నగా మేలు చేస్తున్న సీఎం జగన్

కేబినెట్ నుంచి స్థానిక సంస్థల దాకా సింహభాగం పదవులు వారికే

₹1.73 లక్షల కోట్ల మేర డీబీటీ, నాన్ డీబీటీతో బీసీలకు లబ్ధి

- సామాజిక న్యాయంతోపాటు చదువుల్లోనూ బీసీ బిడ్డలకు ప్రోత్సాహం
- విద్యా దీవెనతో పూర్తి ఫీజులు చెల్లిస్తూ ఉన్నత విద్యకు సంపూర్ణ తోడ్పాటు
- భోజన ఖర్చుల కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా 'వసతి దీవెన'
- నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియంతో తీర్చిదిద్దిన స్కూళ్లతో బీసీల విద్యా సాధికారతకు బాటలు.. సమాజానికి వెన్నెముకగా తీర్చిదిద్దుతున్నారంటూ సామాజికవేత్తల ప్రశంసలు
- బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి మరోసారి చంద్రబాబు అదే పాట.. బీసీల కంచుకోటలు కుప్పం, మంగళగిరిలో తిష్ట వేసి ఆ వర్గాలకు వెన్నుపోటు

సాక్షి, అమరావతి: బీసీ డిక్లరేషన్ పేరుతో ఆ వర్గాలకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి అవహేళన చేస్తే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ చెప్పిన దాని కంటే మిన్నగా మేలు చేస్తూ సామాజిక, రాజకీయ, విద్యా సాధికారతతో బలహీన వర్గాలను సమాజానికి వెన్నెముకగా తీర్చిదిద్ది సమున్నత గౌరవం కల్పిస్తున్నారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు బీసీలను దారుణంగా వంచించిన చంద్రబాబు-పవన్ కళ్యాణ్ ద్వయం ఎన్నికల భయంతో మరోసారి బీసీ డిక్లరేషన్ అంటూ నాటకాలకు తెర తీసిందని స్పష్టం చేస్తున్నారు. బలహీన వర్గాలకు

మిగతా 4వ పేజీలో ▶

చట్టసభల్లో అవినీతీ.. విచారణార్హమే

సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు

1998 నాటి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు కొట్టివేత



జస్టిస్ పి.వి.సంజయ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్, ఎ.ఎస్.బోపన్న, సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా

- చట్టసభల్లో మాట్లాడడానికి, ఓటేయడానికి లంచాలా?!
- ఆర్టికల్ 105(2), 194(2) కల్పించే రక్షణ వాటికి వర్తించదు.. వాటి వర్తింపునకు రెండు నిబంధనలు విధించిన ధర్మాసనం
- ప్రజాప్రతినిధుల అవినీతి ప్రజాస్వామ్యానికే ముప్పంటూ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతికి పాల్పడే ప్రజాప్రతినిధులు రాజ్యాంగ రక్షణ మాటున దాక్కోలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టసభల్లో ఓటేయడానికి, మాట్లాడడానికి లంచం తీసుకొనే ఎంపీలు, ఎమ్మెల్యేలు విచారణ నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేసింది. ఇలాంటి కేసుల్లో వారికి విచారణ నుంచి రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందంటూ 1998లో జేఎంఎం లంచం కేసులో ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పును కొట్టేసింది! ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని

మిగతా 2వ పేజీలో ▶



సచివాలయంపై తా'కట్టు కథ'

- తనఖా పెట్టుకుని రుణం ఇచ్చినట్లు వచ్చిన వార్తలను ఖండించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు
- ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ వార్త సృష్టించారని వెల్లడి

4 లో

నారాయణ 'నల్ల' పుట్ట!

నల్లధనం చేరవేతకు ఓ డొల్ల సంస్థ.. నెల్లూరు కేంద్రంగా 'ఎన్‌స్పైరా' ఏర్పాటు

- నల్ల కంపెనీ డైరెక్టర్లుగా కుమార్తె, అల్లుడు
- విద్యాసంస్థ పేరుతో అక్రమంగా పన్ను రాయితీలు
- ఇటు పన్నులు ఎగవేత.. అటు నల్లధనం తరలింపు
- అదే సంస్థ ద్వారా అమరావతి భూ దందా





నారాయణ విద్యా సంస్థలో తనిఖీల్లో పట్టుబడిన నగదును చూపిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో) టీడీపీ నేత నారాయణ


సాక్షి, అమరావతి: ఒక్క దెబ్బకు రెండు పిట్టలు..! ఇటు పన్నుల ఎగవేత అటు నల్లధనం చేరవేత! ఇవన్నీ నారాయణ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ అవినీతి పొంగులు! అవినీతికి తెగబడి పోగేసిన నల్లధనాన్ని తరలించేందుకు ఆయన ఏకంగా 'ఎన్‌స్పైరా' అనే కంపెనీనే ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. తన కుమార్తె పొంగూరు సింధూర, అల్లుడు పునీత్ కొత్తప్ప డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న 'ఎన్‌స్పైరా' ద్వారా టీడీపీ హయాంలో నారాయణ భూ దోపిడీకి పాల్పడ్డారు. మరోవైపు ఎన్‌స్పైరా ద్వారా కొనుగోలు చేసిన స్కూలు బస్సులను నారాయణ విద్యా సంస్థలు కొనుగోలు చేసినట్లు రవాణా శాఖకు తప్పుడు లెక్కలు చూపించి పన్ను రాయితీలు పొందారు. నారాయణ విద్యా సంస్థల ద్వారా నల్లధనం తరలింపు, అక్రమ రాయితీలకు ఎన్‌స్పైరాను వాడుకున్నట్లు సోమవారం నెల్లూరులో ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఏపీఎస్ డీఆర్ఐ) నిర్వహించిన సోదాల్లో వెల్లడైంది. ఎన్‌స్పైరా నిర్వాకాలు ఇవిగో..

నిధులు మళ్లించేందుకే..

నారాయణ విద్యా సంస్థలకు మౌలిక వసతుల కల్పన, ఉద్యోగులకు జీతాల చెల్లింపు పేరుతో

మిగతా 2వ పేజీలో ▶

స్ఫూర్తిని రగిలించేలా అంబేడ్కర్ విగ్రహం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందనీయులు
- అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు అభినందన సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ కితాబు
- చరిత్ర ఉన్నంతకాలం జనానికి జగన్ గుర్తుంటారు :మంత్రి జోగి రమేష్
- జగన్ ధీశాలి: జూపూడి ప్రభాకర్
- దళిత వ్యతిరేకి బాబుకు బుద్ధి చెప్పాలి :జేబీ రాజు

11 లో

పరి'వార్'



ప్రధానికి సంతానం, కుటుంబమే లేదంటూ ఆర్జేడీ నేత లాలూ చేసిన వ్యాఖ్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు దేశమంతా కుటుంబమేనంటూ బదులిచ్చారు. మతి చెడి తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు ప్రధానికి మద్దతుగా బీజేపీ నేతలు ఏకమయ్యారు. తామంతా మోదీ కుటుంబమేనంటూ నినదించారు. సోషల్ మీడియా ప్రొఫైల్స్‌లో తమ పేర్ల పక్కన 'మోదీ కా పరివార్' అని జోడించారు.

6 లో

వివేకా హత్య.. సునీత దంపతుల కుట్రే!

వారిద్దరితోపాటు శివప్రకాశ్‌రెడ్డిల తీరు సందేహాస్పదం

- వివేకా రెండో పెళ్లితోనే ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు
- రెండో భార్య షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇవ్వాలని భావించిన వివేకా
- వివేకా లెటర్‌ను దాచిపెట్టమని అల్లుడు రాజశేఖర్‌రెడ్డి చెప్పారు
- అబద్ధం చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి నన్ను వేధించారు
- ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని ఒత్తిడి
- పోలీసులు, సీబీఐ అధికారులు చిత్రహింసలకు గురిచేశారు
- నేను అబద్ధం చెప్పకపోతే నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి వస్తుందని సునీత అన్నారు
- దస్తగిరి అప్రూవర్‌గా మారడం వెనుక పక్కా కుట్ర
- అవినాశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించడం కోసం చివరి వరకూ వివేకా కృషిచేశారు

4 లో



'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్ వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి

ఇదండీ మాట



వద్దు సార్! ఆ తృణమూల్‌తో పొత్తు మనకు ఉపయోగం ఉండదు!



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సమస్యల నుంచి గట్టెక్కించారు



మాది చిన్నకారు రైతు కుటుంబం. మా ఆయన, నేను కుటుంబ పోషణ కోసం చాలా కష్టపడేవాళ్లం. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం అత్తికొత్తూరు గ్రామంలో భూమిని కౌలుకు తీసుకుని అందులో వ్యవసాయం చేసుకుంటూ ఎలాగోలా కాలం వెళ్లదీస్తున్నాం. ప్రతి ఏటా నష్టాలు చవిచూసేవాళ్లం. కానీ ఏ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోలేదు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక మహిళలకు అందించే సంక్షేమ పథకాలతో కుటుంబం ఆర్థికంగా స్థిరపడింది. నేను నేర్చుకొన్న టైలరింగ్ మమ్ములను ఆదుకుంది. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి 10 వేల రూపాయల వంతున సాయం అందింది. ఆ మొత్తంతో ఖాలేరు సెంటర్‌లో టైలరింగ్ షాపు, బట్టల వ్యాపారం పెట్టుకొన్నా. నాకు వైఎస్సార్ ఆసరా కింద నాలుగేళ్లకు రూ. 18 వేలు, మా అత్త నెయ్యిగాపుల వెంకటమ్మకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 వంతున అందడంతో ఆ మొత్తాన్ని బట్టల వ్యాపారానికి పెట్టుబడిగా పెట్టాం. మా పిల్లలు ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియంలో చదువుకుంటున్నారు. ఒకరికి అమ్మ ఒడి కింద ఏడాదికి రూ. 15 వేలు వంతున వస్తోంది. మమ్మల్ని కష్టాల నుంచి గట్టెక్కించిన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– నెయ్యిగాపుల రమణమ్మ, అత్తికొత్తూరు
(టంకాల మోహనరావు, విలేకరి, భామిని)

మా బిడ్డకు ప్రాణం పోశారు



మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు. మా ఇంటాయన వెంకటేష్ నాయక్ తాపీ పనులు చేస్తుంటారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన మాకు రాజునాయక్(14), ప్రణీత బాయి(8) అనే ఇద్దరు పిల్లలున్నారు. మా అబ్బాయి పుట్టిన ఆరు నెలలకే అస్వస్థతకు గురవ్వడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రతి 20 రోజులకోసారి రక్తం ఎక్కించాలన్నారు. పూట గడవటమే కష్టంగా ఉన్న మాకు వైద్యం చేయించడం కత్తిమీద సాములా మారింది. ఒక్కసారి రక్తం ఎక్కించడానికి రూ.6 వేలు, టాబ్లెట్స్‌కి మరో రూ.4 వేలు ఖర్చయ్యేది. బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేయాల్సి వచ్చేది. ఒక్కోసారి వారు ముఖం చాటేసేవారు. గత ప్రభుత్వం స్పందించకపోవడంతో దాతల సాయంతో హైదరాబాద్, గుంటూరులో తొమ్మిదేళ్ల వైద్యం చేయించాం. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తలసేమియాతో బాధపడుతున్న మా అబ్బాయికి నెలకు రూ.10 వేలు పింఛను మంజూరు చేశారు. గుంటూరు, నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యం చేయించడంతో పాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 వేలు విలువ చేసే మందులు కూడా ఇస్తున్నారు. దీంతో అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. మా అబ్బాయికి బోన్‌మ్యారో శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు చెప్పారు. దీనికి రూ.25 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రభుత్వంలోనే ఆ చికిత్స కూడా జరుగుతుందని ఆశిస్తున్నా. మా అబ్బాయిని ఆదుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– భూలక్ష్మీబాయి, శ్రీనగర్
(వినుకొండ అజయ్‌కుమార్, విలేకరి, దాచేపల్లి)

చింత తీరి హాయిగా జీవిస్తున్నాం



మాది చేనేత కుటుంబం. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఉంటున్న మేము ఇంటిల్లిపాదీ కష్టపడినా రోజువారీ జీవనమే కష్టమయ్యేది. ఏ ప్రభుత్వం కూడా మమ్ములను ఆదుకోలేదు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా బతుకుల్లో మార్పులు వచ్చాయి. మా వృత్తికి సరైన గుర్తింపు లభించడంతోపాటు సంక్షేమ పథకాలతో పరిస్థితి మారిపోయింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న మా ఇద్దరు కుమారుల్లో ఒకరికి అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు చొప్పున అందుతోంది. నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం అందింది. మా అమ్మ పద్మావతికి నెలకు రూ.3 వేల పింఛన్‌తో పాటు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 చొప్పున లబ్ధి చేకూరింది. జగనన్న లే అవుట్‌లో రూ.5 లక్షల విలువ చేసే స్థలంతో పాటు పక్కా గృహం కూడా మంజూరైంది. ఇటీవలే నా భార్య చూపు మందగించింది. ఆమెను జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. మమ్ములను ఇంత గొప్పగా ఆదుకుంటున్న జగనన్నకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం.

– నున్నా సురేష్, ఉరవకొండ
(బళ్లారి సాదిక్, విలేకరి, ఉరవకొండ)

నేడు 'విజన్ విశాఖ'

- సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి జగన్
- 2,000 మందికి పైగా పారిశ్రామికవేత్తలతో సమావేశం
- అనంతరం యువతతో భేటీ కానున్న సీఎం
- వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చేపట్టిన 'భవిత' కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం
- నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇందుకోసం మంగళవారం ఉదయం 9.10 గంటలకు సీఎం జగన్ తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటారు. రాడిసన్ బ్లూలో నిర్వహిస్తున్న 'విజన్..విశాఖ' సదస్సులో పాల్గొని వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలతో సీఎం సమావేశమవుతారు. మధ్యాహ్నం 12.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో సమావేశమవుతారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్ర యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు 'భవిత' పేరుతో చేపట్టిన సరికొత్త కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం విశాఖ నుంచి బయలుదేరి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు.

రాష్ట్ర భవిష్యత్తు.. విశాఖ

మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ విశాఖ నగరమేనని చెప్పారు. రాష్ట్రానికి విశాఖ గ్రోత్ ఇంజిన్ వంటిదన్నారు. విశాఖను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనేది సీఎం జగన్ ఆలోచన అని పేర్కొన్నారు. మంగళవారం రాడిసన్ బ్లూలో నిర్వహిస్తున్న 'విజన్..విశాఖ' సదస్సులో సీఎం జగన్ పాల్గొని దాదాపు 2 వేల మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమవుతారని తెలిపారు. గతంలో విశాఖ వేదికగా జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఒప్పందాల మేరకు అనేక పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చాయని వివరించారు. వాటిలో పలు పరిశ్రమలు ఇప్పటికే పనులు ప్రారంభించాయని పేర్కొన్నారు. ఎన్టీపీసీ రూ.లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. అలాగే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుతో పాటు ఫార్మా రంగంలో ఈ ప్రాంతానికి వస్తున్న పెట్టుబడుల గురించి పారిశ్రామికవేత్తలకు సీఎం జగన్ వివరిస్తారని తెలిపారు. ఇప్పటికే పలు ఐటీ కంపెనీలు విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించాయని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను సీఎం జగన్ సదస్సులో వివరిస్తారని తెలిపారు. అలాగే గ్రేటర్ విశాఖ పరిధిలోని రూ.1,500 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. ముడసర్లోవలో జీవీఎంసీ నూతన భవన నిర్మాణానికి, రూ.10 కోట్లతో టర్టిల్ బీచ్ ఏర్పాటుకు, వెంకోజీపాలెం నుంచి మారియట్ హోటల్ వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డుకు, మధురవాడకు కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేయనున్న వాటర్ సప్లై ప్రాజెక్టుకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.98 కోట్లతో అభివృద్ధి చేసిన ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు.

సచివాలయంపైనా తప్పుడు రాతలు

సచివాలయ భవనాన్ని తాకట్టు పెట్టారంటూ కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాశాయని మంత్రి అమర్‌నాథ్ మండిపడ్డారు. ఈ తప్పుడు వార్తలపై ప్రభుత్వం ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో సీఆర్‌డీఏ తీసుకున్న అప్పు తప్ప.. ఈ ప్రభుత్వం కొత్తగా అప్పు తీసుకోలేదని స్పష్టం చేశారు. విశాఖ అభివృద్ధి చెందకూడదనే దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు కేసులు పెట్టాయని మండిపడ్డారు. అయినా ముఖ్యమంత్రి జగన్ విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారన్నారు.

చట్టసభల్లో అవినీతీ.. విచారణార్హమే

▶ మొదటి పేజీ తరువాయి

ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం సోమవారం ఏకగ్రీవంగా చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. చట్టసభల్లోపల ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక అధికారాలను కట్టబెడుతున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 105(2), ఆర్టికల్ 194(2) ఇలాంటి ఆరోపణలకు వర్తించబోవని స్పష్టం చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయంటూ ధర్మాసనం స్పష్టత ఇవ్వడం విశేషం. ''పార్లమెంటులోనూ, శాసనమండలి, శాసనసభల్లోనూ, సంబంధిత కమిటీల్లోనూ ఏ అంశం మీదైనా సభ్యులు ఒత్తిళ్లకు అతీతంగా స్వేచ్ఛగా చర్చించగలిగే వాతావరణం నెలకొల్పడమే ఆర్టికల్ 105, 194 ఉద్దేశం. అంతే తప్ప ఓటేయడానికి, సభలో ప్రసంగించడానికి లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై విచారణ నుంచి కాపాడటం కాదు. లేదంటే వాటి అసలు ఉద్దేశమే నెరవేరకుండా పోతుంది. లంచం తీసుకునే ప్రజా ప్రతినిధి నేరానికి పాల్పడ్డట్టే. వారికి ఎలాంటి రక్షణా కల్పించలేం'' అంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాప్రతినిధుల అవినీతి దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదులనే పెకిలించి వేస్తుందంటూ ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగ ఆకాంక్షలను, ఆదర్శాలతో పాటు ప్రజా జీవితంలో విశ్వసనీయతను కూడా దెబ్బ తీస్తుందని ఆవేదన వెలిబుచ్చింది. ''ఆర్టికల్ 105(2), 194(2) కింద సభ్యుడు కోరే రక్షణ సదరు అంశంపై సభ సమష్టి పనితీరుకు, సభ్యునిగా తాను నెరవేర్చాల్సిన విధులకు పూర్తిగా అనుగుణంగా ఉండాల్సిందే'' అంటూ రెండు కీలక నిబంధనలను తాజా తీర్పులో పొందుపరిచింది. వాటిని తృప్తి పరిచినప్పుడే సభలో వారు చేసే ప్రసంగానికి, వేసే ఓటుకు చట్టపరమైన విచారణ నుంచి రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ధర్మాసనం తరఫున సీజేఐ 135 పేజీల తీర్పు రాశారు.

రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి ఓటేసేందుకు జేఎంఎం ఎమ్మెల్యే సీతా సొరెన్ లంచం తీసుకున్నారన్న కేసుపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఏఎస్ బొపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపి 2023 అక్టోబరులో తీర్పు రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించింది. ''ఒక ప్రజాప్రతినిధి చట్టసభలో ఓటేసేందుకు లంచం స్వీకరించిన, స్వీకరించేందుకు అంగీకరించిన క్షణంలోనే నేరానికి పాల్పడ్డట్టు లెక్క. అంతిమంగా ఓటేశారా, లేదా అన్నదానితో నిమిత్తం లేదు. లంచం స్వీకరించినప్పుడే నేరం జరిగిపోయింది'' అని స్పష్టం చేసింది. ''ఓటేయడానికి, మాట్లాడడానికి లంచం తీసుకుంటే రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛాయుత వాతావరణం సభలో కొనసాగకుండా పోతోంది. అలాంటి నేరాలకు సభ్యుడు రాజ్యాంగపరమైన మినహాయింపులు కోరజాలడు. ఆర్టికల్ 105, 194 రక్షణలు వర్తించబోవు'' అని స్పష్టం చేసింది. ''ఇలాంటి సందర్భాల్లో కూడా సభ్యుడికి విచారణ నుంచి మినహాయింపు ఇస్తున్న 1998 నాటి పీవీ నరసింహారావు కేసు తీర్పును పునఃపరిశీలించడం తప్పనిసరి. లేదంటే న్యాయస్థానం తప్పిదానికి పాల్పడ్డట్టే అవుతుంది'' అని అభిప్రాయపడింది.

కేసు పూర్వాపరాలివీ..

జార్ఖండ్‌లో 2012లో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంగా ఓటేసేందుకు ఓ స్వతంత్ర అభ్యర్థి నుంచి జేఎంఎం ఎమ్మెల్యే సీతా సొరెన్ లంచం తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. కానీ తాను తమ పార్టీ అభ్యర్థికే ఓటేశానని పోలింగ్ అనంతరం ఆమె తెలిపారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించినా ఆమె సొంత పార్టీ అభ్యర్థికే ఓటేశారు. అయితే సొరెన్ తన నుంచి లంచం తీసుకున్నారంటూ సదరు స్వతంత్ర అభ్యర్థి పోలీసుల్ని ఆశ్రయించడంతో ఆమెపై ఛార్జిషీటు దాఖలు చేయడంతో పాటు క్రిమినల్ విచారణ చర్యలు చేపట్టారు. ఆర్టికల్ 194(2) కింద తనకు రక్షణ ఉంటుంది గనుక ఈ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలంటూ సీతా సొరెన్ జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ప్రతికూల నిర్ణయం రావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2014 సెప్టెంబరులో కేసు ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వెళ్లింది. అనంతరం 2019 మార్చిలో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ కేసును విచారించింది. 1998 నాటి పీవీ నరసింహారావు కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ కేసు విచారణ సందర్భంగా జార్ఖండ్ హైకోర్టు ఉటంకించినందున విచారణను విస్తృత ధర్మాసనానికి అప్పగించాలని నిర్ణయించింది. తదనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించింది. 1998 నాటి కేసులో సీతా సొరెన్ మామ శిబు సొరెన్‌కు ఇదే తరహా కేసులో ఊరట లభించిందని ఆమె తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ''1998 నాటి పీవీ కేసు తీర్పుతో విభేదిస్తున్నాం. ఆ తీర్పును కొట్టేస్తూ ఏడుగురు న్యాయమూర్తులం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చాం'' అని పేర్కొంది.

ఏమిటీ పీవీ కేసు...

1993లో కేంద్రంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో శిబు సొరెన్ సహా ఐదుగురు జేఎంఎం ఎంపీలు లంచం తీసుకొని తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఆర్టికల్ 105(2), ఆర్టికల్ 194(2) కింద సదరు సభ్యులకు ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు ఉంటుందంటూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 మెజారిటీతో 1998లో తీర్పు వెలువరించింది. అది పరస్పర విరుద్ధ ఫలితాలకు దారితీసిందని సీజేఐ సారథ్యంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ''లంచం తీసుకుని తదనుగుణంగా ఓటేసిన సభ్యులకు విచారణ నుంచి ఆ తీర్పు రక్షణ కల్పిస్తోంది. కానీ లంచం తీసుకుని కూడా మనస్సాక్షి మేరకు స్వతంత్రంగా ఓటేసిన సభ్యులను శిక్షిస్తోంది. తద్వారా ఈ రెండు పరిస్థితుల మధ్య కృత్రిమ భేదాన్ని సృష్టించింది. ఆ తీర్పుతో విభేదిస్తూ ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు వెలువరించిన మైనారిటీ తీర్పు దీన్ని ఎత్తి చూపింది కూడా'' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

ఎన్టీపీసీలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు ప్రధాని శంకుస్థాపన



ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తిలకిస్తున్న సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ (అనకాపల్లి): అనకాపల్లి జిల్లా పరవాడ వద్ద ఉన్న సింహాద్రి ఎన్టీపీసీలో రూ.30 కోట్లతో ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి వర్చువల్‌గా సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా సుస్థిర అభివృద్ధి, ఆర్థిక వృద్ధి జరుగుతుందన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటుకు రూ.30 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జూన్ 20న రెవెన్యూ డే

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రెవెన్యూశాఖ ఏర్పడిన జూన్ 20వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ డేగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం జీవో ఎంఎస్ నెంబర్ 81 జారీ చేసింది. ఇకపై ప్రతి సంవత్సరం జూన్ 20వ తేదీన రాష్ట్రంలో రెవెన్యూ దినోత్సవంగా పాటించాలని పేర్కొంది. ఆ రోజున మండలం నుంచి జిల్లా స్థాయిల్లో ఉత్సవాలు నిర్వహించాలని తెలిపింది. రెవెన్యూశాఖ అందించే సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం జారీ చేస్తున్న సర్టిఫికెట్లు, నీటి పన్ను వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేసింది. రెవెన్యూ రికార్డులు, అడంగల్, 1బి, ప్రభుత్వ భూములు, దేవదాయ శాఖ భూములు, వక్ఫ్ భూముల వివరాలు ప్రదర్శించి, భూములకు సంబంధించిన విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రెవెన్యూ డేగా ప్రకటించడంపై ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కె.రమేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నారాయణ 'నల్ల' పుట్ట!

▶ మొదటి పేజీ తరువాయి

'ఎన్‌స్పైర మేనేజ్‌మెంట్ సర్వీసెస్' కంపెనీ ఏర్పాటైంది. అయితే ఆ ముసుగులో తమ అక్రమ ఆదాయాన్ని తరలించేందుకు నారాయణ దీన్ని వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. నారాయణ విద్యా సంస్థలకు అన్ని రకాల చెల్లింపులు నిర్వహిస్తున్నందుకు ఎన్‌స్పైరకు 10 శాతం కమిషన్ చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ ఇతర సంస్థల నుంచి భారీగా నిధులు మళ్లించారు. వివిధ సేవల పేరుతో నిధులు మళ్లించి అక్రమ ఆస్తులు సమకూర్చుకున్నారు.

అమరావతి భూ దందా..

టీడీపీ హయాంలో రాజధాని ముసుగులో చంద్రబాబు, నారాయణ ద్వయం అమరావతిలో సాగించిన భూ దోపిడీకి ఎన్‌స్పైరాను ప్రధాన సాధనంగా వాడుకున్నారు. అందుకోసం ఎన్‌స్పైరాలో ఇతర కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చూపారు. ఒలంపస్ క్యాపిటల్ ఏసియా క్రెడిట్ అండ్ సీఎక్స్ పార్టనర్స్ మ్యాగజైన్ అనే కంపెనీ 2016లో ఏకంగా రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు చూపడం గమనార్హం. 2018లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏసియా, బన్యాన్ ట్రీ గ్రోత్ క్యాపిటల్ అనే సంస్థలు 75 మిలియన్ డాలర్లు (రూ.613.27 కోట్లు) పెట్టుబడి పెట్టినట్లు రికార్డుల్లో చూపారు. రెండు విడతల్లో ఎన్‌స్పైరాలోకి రూ.1,013.27 కోట్లు వచ్చి చేరాయి. ఇలా భారీగా నల్లధనాన్ని మళ్లించినట్లు తెలుస్తోంది. అనంతరం నల్లధనాన్ని ఎన్‌స్పైరా నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశారు. నారాయణ సమీప బంధువు కేవీపీ అంజనికుమార్ ఆ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండటం గమనార్హం. నారాయణ సిబ్బంది, మరికొందరిని తమ బినామీలుగా మార్చుకుని రామకృష్ణ హౌసింగ్ బ్యాంకు ఖాతాల నుంచి వారి వ్యక్తిగత ఖాతాల్లోకి నిధులను మళ్లించారు. అనంతరం వారి ద్వారా ఆ నగదు డ్రా చేశారు. ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములను టీడీపీ సర్కారు తీసుకుంటుందని బడుగు, బలహీనవర్గాల రైతులను భయపెట్టారు. ఆ రైతుల అసైన్డ్ భూములను తమ బినామీలైన ఉద్యోగులు, ఇతరులకు అతి తక్కువకు విక్రయించేలా కథ నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వందల ఎకరాల అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకున్నారు. తర్వాత నారాయణ బినామీలే సీఆర్‌డీఏకు ఆ భూములను ఇచ్చినట్లు చూపించి వారికే భూసమీకరణ ప్యాకేజీ వచ్చేలా చేశారు. ఆ విధంగా 617.65 ఎకరాలకు గాను రూ.3,737 కోట్ల విలువైన భూసమీకరణ ప్యాకేజీ స్థలాలను పొందారు.



విచారణ కోసం గురుబ్రహ్మంను స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

అక్రమంగా బస్సుల కొనుగోలు రాయితీ

నెల్లూరు కేంద్రంగా నెలకొల్పిన ఎన్‌స్పైరా కార్యకలాపాలన్నీ హైదరాబాద్ కేంద్రంగానే సాగుతున్నాయి. ఎన్‌స్పైరా రూ.20.80 కోట్లతో హైదరాబాద్‌లో 92 బస్సులను కొనుగోలు చేసి నారాయణ విద్యా సంస్థలకు లీజుకు ఇచ్చినట్టు రికార్డుల్లో చూపించారు. నారాయణ విద్యా సంస్థలు అందుకు ప్రతి నెల అద్దె చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. రవాణా శాఖకు సమర్పించిన రికార్డుల్లో మాత్రం ఆ 92 బస్సులను నారాయణ విద్యా సంస్థలే కొనుగోలు చేసినట్టు చూపడం గమనార్హం. తద్వారా విద్యా సంస్థల కోటాలో భారీగా పన్ను రాయితీ పొందారు. ఓ వ్యాపార సంస్థ ఎన్‌స్పైరా కొనుగోలు చేసిన బస్సులను విద్యా సంస్థ కోసం కొనుగోలు చేసినట్టు తప్పుడు వివరాలు సమర్పించి అడ్డదారిలో పన్ను రాయితీలు పొందారు. ఎన్‌స్పైరాకు ప్రతి నెల 92 బస్సులకు సంబంధించి అద్దె చెల్లిస్తున్నట్టు చూపిస్తూ కంపెనీలోకి నల్లధనాన్ని తరలిస్తున్నారు. నారాయణ విద్యా సంస్థలకు వివిధ సేవలు అందిస్తున్నట్టు పేర్కొంటూ ఎన్‌స్పైరా బ్యాంకు ఖాతాల్లోకి భారీగా నిధులు మళ్లిస్తున్నారు. నారాయణ నల్లధనాన్ని తరలించేందుకు ఎన్‌స్పైరాను వాడుకుంటున్నారు. సోమవారం నెల్లూరులో ఎన్‌స్పైరాతో సంబంధం ఉన్నవారి నివాసాల్లో నిర్వహించిన సోదాల్లో అధికారులు రూ.1.81 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ వ్యవహారాలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తే భారీగా నల్లధనం వెలుగులోకి రావడం ఖాయమని డీఆర్‌ఐ వర్గాలంటున్నాయి.

రూ.10 కోట్ల పన్నుల ఎగవేత

లెక్క చూపని రూ.1.81 కోట్లు, కీలక పత్రాలు స్వాధీనం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: విద్యా సంస్థల వాహనాలకు పన్ను రాయితీ ఉంటుంది. దీంతో వాహనాలు ఎన్‌స్పైరా ద్వారా కొనుగోలు చేసినప్పటికీ నారాయణ విద్యాసంస్థలు కొనుగోలు చేసినట్లు రవాణా శాఖకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద రూ.4.48 కోట్లు జీఎస్టీ రిటర్న్‌ల రూపంలో పొందారు. ఈ మోసాన్ని గుర్తించిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. రూ.10.23 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉండగా రూ.22.35 లక్షలు మాత్రమే చెల్లించినట్లు గుర్తించారు. దీనిపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం నారాయణ విద్యా సంస్థలతో పాటు అనుబంధ సంస్థల్లో విస్తృత తనిఖీలు చేపట్టి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. లెక్కల్లో చూపని రూ.1.81 కోట్ల నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించనున్నట్లు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారంపై నారాయణ డైరెక్టర్ పునీత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్ రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన భూమా కిషోర్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డితోపాటు భూమా వీరభద్రారెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, పలువురు స్థానిక బీజేపీ నాయకులు, దాదాపు 500మంది అభిమానులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి (నాని), వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, కర్నూల్ విజయా డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద కిషోర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో బీజేపీ.. టీడీపీకి సీ టీమ్ పార్టీలా తయారైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నా. ఆళ్లగడ్డ అభ్యర్థిగా గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తాను. పెత్తందార్లను ఎదిరించి నిలబడ్డ నేతలుగా భూమా దంపతులు పేరు గడించారు. కానీ వారి కడుపున పుట్టిన అఖిల ప్రియ ఆళ్లగడ్డలో అరాచకశక్తిగా మారారు. అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్ ఆగడాలను అడుగడుగునా అడ్డుకుంటాం. భూమా బంధువర్గం అంతా అఖిలప్రియకు దూరంగా జరిగారు' అని ఆయన చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఏపీసీసీ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ గురునాథరావు



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జెట్టి గురునాథరావు, ముప్పిడి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఏపీసీసీ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ జెట్టి గురునాథరావు, జంగారెడ్డిగూడెం మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద జెట్టి గురునాథరావు మాట్లాడుతూ.. ఏపీలో కాంగ్రెస్ ఇతరులకు లాభం చేకూర్చే పార్టీలాగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం నేర్చుకున్నారని చెప్పారు. అందుకే కాంగ్రెస్ పార్టీ విధానాలు, ఆ పార్టీ నేతల వ్యవహారశైలి నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు.

'గిరిజన విద్యాలయాల్లో ప్రాథమిక విద్య భేష్'



గిరిజన బాలికలతో ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధి

సాక్షి, పాడేరు : ఏపీలోని గిరిజన విద్యాలయాల్లో నాణ్యమైన ప్రాథమిక విద్యనందిస్తున్నారని, సౌకర్యాలూ మెరుగ్గా ఉన్నాయని న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం కితాబిచ్చింది. 2025–26లో అమలుకానున్న నూతన విద్యా విధానంతో పాటు ప్రస్తుతం ప్రాథమిక విద్య బోధనలో విద్యా కార్యక్రమాలను పరిశీలించేందుకు బృందం సోమవారం పాడేరులో పర్యటించింది. ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, కరిక్యులం డిజైన్ మేనేజర్ ఆల్తో, అసోసియేట్ మేనేజర్, ఐబీ అసిస్టెంట్ ఆపరేషన్స్ మైఖేల్‌లు ముందుగా శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని చూసి వారు ముగ్ధులయ్యారు. వసతులు, విద్యార్థినుల భద్రతపై సంతృప్తి వ్యక్తంచేసింది.

ఏపీఎస్పీ, ఏఆర్ కానిస్టేబుళ్లకు కొత్త యూనిఫామ్

సాక్షి, అమరావతి: ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్పీ), ఆర్మ్డ్ రిజర్వ్(ఏఆర్) విభాగాల్లోని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం కొత్త యూనిఫామ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు ఉన్న యూనిఫామ్ స్థానంలో కొత్త యూనిఫామ్‌ను ఆమోదిస్తూ హోమ్‌శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భారీగా చేయూత సభ

- 7న అనకాపల్లి నియోజకవర్గానికి సీఎం జగన్
- సభ ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి అమర్‌నాథ్
- శ్రేణులన్నీ కలిసి పని చేసి సభను విజయవంతం చేయాలి


వైఎస్సార్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గంలోని పిసినికాడ గ్రామంలో ఈనెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే ‘చేయూత’ సభ భారీ ఎత్తున విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ పార్టీ నాయకులు, శ్రేణులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సభను ఎన్నికల శంఖారావ సభగా పరిగణించి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు భారీ సంఖ్యలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని నేతలను కోరారు. పార్టీలో మొదటి నుంచి పనిచేసిన వారిలో చాలామందికి అవకాశాలు లభించాయని, మిగిలిన వారికి కూడా పార్టీలో తగిన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజలందరికీ అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, ఈ ప్రయత్నానికి పునాది అనకాపల్లి లోనే పడాలని ఆయన అన్నారు. ఇతర పార్టీల నుంచి మన పార్టీలోకి రావడానికి చాలామంది ఉత్సాహం చూపిస్తున్నారని, వారిని స్వాగతించాలన్నారు. ఎంపీ బి.వి.సత్యవతి మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం సభలు విజయవంతం అవుతున్నాయని, పిసినికాడ సభ గొప్పగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్‌కుమార్, పార్టీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీకి ‘డిజిటల్ టెక్నాలజీ సభ-2024’ అవార్డు


ఆర్టీసీ ఐటీ విభాగం అధికారులను అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ ‘ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్’ విభాగంలో దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలతో పోటీ పడి వరుసగా ఆరో ఏడాది డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డు-2024ను దక్కించుకుంది. కోల్‌కతాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు సాధించిన ఆర్టీసీ ఐటీ విభాగం అధికారులను ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అభినందించారు. ఆర్టీసీ మాత్రమే ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, చీఫ్ ఇంజినీర్(ఐటీ) వి.సుధాకర్, డిప్యూటీ చీఫ్ మేనేజర్(ఐటీ) వై.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గన్‌మెన్ కుటుంబానికి ‘పిన్నెల్లి’ రూ.5 లక్షల సాయం


గన్‌మెన్ కుటుంబానికి రూ. 5లక్షల నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన గన్‌మెన్ గోపిరెడ్డి కుటుంబానికి వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి బాపట్ల వెళ్లి గోపిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గురుకుల బైలాస్ ప్రకారమే గిరిజన ప్రాంతాల్లో టీచర్ల పోస్టుల భర్తీ

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లోని టీచర్ పోస్టులను గురుకుల బైలాస్‌కు అనుగుణంగానే భర్తీచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ దాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తాజా డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన ప్రాంతాల్లోని 517 ఉపాధ్యాయ పోస్టులను జనరల్ కేటగిరిలోకి మార్చారని, దీనివల్ల గిరిజన యువత తీవ్రంగా నష్టపోతోందంటూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన విజయకుమార్, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ రామకృష్ణప్రసాద్ మరోసారి విచారించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గిరిజన ప్రాంతాల్లో టీచర్ పోస్టులను గురుకుల బైలాస్ ప్రకారమే భర్తీచేస్తామని తెలిపారు. ఏం చేసినా చట్టానికి అనుగుణంగానే చేస్తామని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను పరిష్కరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పోర్టు ఆధునికీకరణకు మరో ముందడుగు


ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న పోర్టు, ఎన్టీసీపీడబ్ల్యూసీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధునికీకరణలో మరో ముందడుగు వేసింది. వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్(వీటీఎంఎస్) సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చెన్నైలోని నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్ అండ్ వాటర్‌వేవ్స్(ఎన్టీసీపీడబ్ల్యూసీ)తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. వీపీఏ చైర్మన్ డాక్టర్ అంగముత్తు సమక్షంలో ఎన్టీసీపీడబ్ల్యూసీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కుమరన్ రాజ్, పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆధునిక సముద్ర రవాణాలో వీటీఎంఎస్ ఒక అంతర్భాగమని చైర్మన్ డాక్టర్ అంగముత్తు తెలిపారు. పోర్టుకు వచ్చే కార్గో షిప్‌ల నిర్వహణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, నియంత్రణకు పూర్తి పరిష్కారం చూపేలా రూ.14.03 కోట్లతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. మొత్తం పదేళ్ల పాటు ఈ సేవలు అందించేలా ఎంవోయూ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, కెప్టెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూలింగ్‌లో భూములిచ్చిన బడా ‘బాబు’ల దోపిడీ


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

1,254వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: పూలింగ్‌లో భూములిచ్చిన బడా బాబుల ముసుగులో దోచుకున్న వారి జాబితా తీస్తే అమరావతి కేంద్రంగా జరిగిన అవినీతి మొత్తం బట్టబయలవుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 1,254వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పూలింగ్‌కు భూములిచ్చిన రైతులందరూ 90 శాతానికి పైగా భూములు అమ్ముకున్నారని, ముందస్తు వ్యూహంతో కొనుగోలు చేసిన బడా బాబులు, బినామీలే పూలింగ్ ద్వారా లాభపడ్డారన్నది సత్యమన్నారు. అమరావతి నిర్మాణం పేరుతో బినామీ కాంట్రాక్టర్లను రంగంలోకి దించి తాత్కాలిక కట్టడాలు, ఇతర అభివృద్ధి పనులు పేరుతో నీకింత... నా కెంత అని రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేసిన బాబు తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే అడ్డదారుల్లో అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని ధ్వజమెత్తారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే తాము దోపిడీ చేయడం కుదరదని గ్రహించిన కులవాదులు ఆయనను గద్దె దించేందుకు పలు రకాలుగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎంతమంది కులవాదులు, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా బహుజనుల సత్తా ఏంటో చూపించి రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, కొమరవల్లి కిషోర్ బాబు, బూదాల సలోమి, పులి దాసు, బూదాల సౌమ్య, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

అనకాపల్లి/చీడికాడ: అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం ఖండివరానికి చెందిన బాలికపై అత్యాచారం కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు ముప్వల సోమునాయుడు (22)కు 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ సోమవారం విశాఖ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చినట్లు అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. 9వ తరగతి చదువుతున్న బాలికకు రెండుసార్లు గర్భస్రావం చేయించాడు. బాలిక పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో 2017 ఏప్రిల్ 27న ఖండివరం శివారులోని మోదకొండ గుడిలో పసుపు తాడు కట్టి పెళ్లిచేసుకున్నాడు. తరువాత అతడు బాలికను పట్టించుకోకపోవడంతో కేసు నమోదు చేసిన అప్పటి అనకాపల్లి డీఎస్పీ కె.వి.రమణ నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో విచారణ అనంతరం పోక్సో కోర్టు న్యాయాధికారి జి.ఆనందిని నిందితుడు సోమునాయుడుకు 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

వివేకా హత్య సునీత దంపతుల కుట్రే!

వారిద్దరితోపాటు శివప్రకాశ్‌రెడ్డిల తీరు సందేహాస్పదం • 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్ వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: 'వైఎస్ వివేకానందరెడ్డిని ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డే హత్య చేయించి ఉండొచ్చు. ఈ హత్య వెనుకనున్న ఏదో విషయాన్ని దాచిపెట్టాలని వారు ప్రయత్నిస్తున్నారు. వివేకం సార్ రెండో పెళ్లితో ఆ ఇంట్లో తలెత్తిన ఆస్తి గొడవలకు ఆయన హత్యకు ఏదైనా సంబంధం ఉందా.. అనిపిస్తోంది. కూతురు, అల్లుడు, పెద్ద బావమరిదే ఈ దారుణానికి తెగించి ఉండొచ్చు'.. అని వైఎస్ వివేకానందరెడ్డి పీఏగా చేసిన ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. 'వివేకానందరెడ్డి రాసిన లెటర్ పోలీసులకు వెంటనే ఇచ్చేసి ఉంటే దర్యాప్తు సక్రమంగా సాగేది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టమని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎందుకు చెప్పారు? ఈ కేసుతో సంబంధంలేని ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల పేర్లు చెప్పాలని నన్ను ఎందుకు బెదిరించారు? నేను అబద్ధం చెప్పకపోతే తన భర్త రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది' అని సునీత ఎందుకు అన్నారని కూడా ఆయన వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వివేకానందరెడ్డిని పాశవికంగా హత్య చేశానన్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం ఏమిటీ? అతను చెప్పే కట్టుకథలను పట్టుకుని సీబీఐ దర్యాప్తు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి చివరివరకు కూడా వైఎస్ జగన్‌ను సీఎం చేయడానికి, వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించడానికే కృషిచేశారని ఆయన స్పష్టంచేశారు. వివేకాకు పీఏగా దాదాపు 37ఏళ్ల పాటు పనిచేసిన కృష్ణారెడ్డి.. ఆయనకు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తునిగా గుర్తింపు పొందారు. ఆయన కుటుంబ వ్యవహారాలతో సహా అన్ని విషయాలు సమగ్రంగా తెలిసిన వ్యక్తి. 2019, మార్చి 15 ఉదయం వివేకానందరెడ్డి మృతిచెందిన విషయాన్ని కృష్ణారెడ్డే మొదటగా గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో పోలీసులు, తరువాత సీబీఐ అధికారుల చేతిలో చిత్రహింసలకు గురైన బాధితుడు కూడా కృష్ణారెడ్డే. వైఎస్ వివేకా హత్య కేసుకు సంబంధించిన అన్ని పరిణామాలను సమీపం నుంచి పరిశీలిస్తున్న కీలకవ్యక్తి అయిన కృష్ణారెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంచలన విషయాలను వెల్లడించారు.

సాక్షి: 2019, మార్చి 15న ఏ సమయంలో మీరు వివేకానందరెడ్డి ఇంటికి వెళ్లారు?

కృష్ణారెడ్డి: రోజూ వెళ్లినట్లే ఆ రోజు కూడా ఉ.5.30కే వివేకం సార్ ఇంటికి వెళ్లాను. ఇంట్లో లైట్‌వేసి లేదు. అంటే సారు ఇంకా నిద్ర నుంచి లేవలేదని అనుకున్నా. బయట లైట్ దగ్గర కూర్చుని పేపర్ చదువుకుంటూ ఉన్నా. కాసేపటి తరువాత సౌభాగ్యమ్మకు ఫోన్‌చేసి సార్ ఇంకా నిద్ర లేవలేదు.. మీరు ఫోన్ చేసి నిద్ర లేపుతారా అని అడిగాను. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చి ఉంటారు.. కాసేపు నిద్రపోనీ అని ఆమె చెప్పారు. కాసేపటికే వంట మనిషి లక్ష్మమ్మను ఆమె కొడుకు ప్రకాశ్ తన బైక్ మీద తీసుకొచ్చాడు. ఆలస్యమైంది కిటికీ వద్దకు వెళ్లి సారును నిద్రలేపు అని చెప్పాను. ఆ సమయంలో వాచ్‌మెన్ రంగన్న మెయిన్ డోర్ ముందర నిద్రపోతూ ఉన్నాడు. లక్ష్మమ్మ వచ్చేసరికి రంగన్న నిద్రలేచి ఉత్తరం వైపు ఉన్న పార్కు వైపు వెళ్లాడు. ఇంతలో 'సార్ పడిపోయాడు' అని అరుచుకుంటూ రంగన్న వచ్చాడు. మేము ఆ వైపు పరిగెత్తి వెళ్లాం. ఇంటికి ఉత్తరం వైపు ఉన్న తలుపు తెరచి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే సార్ హాల్లోగానీ బెడ్‌రూమ్‌లోగానీ లేరు. అక్కడ రక్తపు మరకలు ఉన్నాయి. బాత్రూమ్‌లో చూస్తే వివేకం సార్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. నేను సార్ చేయిపట్టుకుని నాడి చూశాను. నాడి కొట్టుకోవడంలేదు. ఆయన చనిపోయారని నిర్ధారించుకున్నా.



సాక్షి: ఎవరి పేర్లు అయినా చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి మిమ్మల్ని ఒత్తిడి చేశారా?

కృష్ణారెడ్డి: ఒకసారి నన్ను హైదరాబాద్ పిలిపించి మాట్లాడారు. అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పమన్నారు. వాళ్లు ముగ్గురు నన్ను బెదిరించినట్లు కూడా చెప్పమన్నారు. సీబీఐ అధికారులకు అలా చెబితే నన్ను రక్షిస్తామన్నారు. లేకపోతే చార్జ్‌షీట్‌లో నా పేరు చేరుస్తాం.. జైలుకు వెళ్లాల్సి ఉంటుందని బెదిరించారు. అయినా నేను ఒప్పుకోలేదు. దాంతో సునీత నా మీద కోపంతో కేకలు వేసింది.

సాక్షి: ఆ వెంటనే మీరు ఏం చేశారు?

కృష్ణారెడ్డి: నేను వెంటనే సార్ అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పాను. బావ మనకు లేరు.. ఎవరో ఏదో చేశారు. రక్తపు మడుగులో ఉన్నారు. తల మీద గాయం ఉంది అని చెప్పాను. సరే అని ఆయన ఫోన్ పెట్టేశారు. నేను 6.15కు కాల్ చేశాను. నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి నాతో 47 సెకన్లు మాట్లాడి ఫోన్ పెట్టేశారు. ఆ తరువాత సార్ పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డికి కాల్ చేశాను. కానీ, ఆయన ఫోన్ కలవలేదు. నాకు సౌభాగ్యమ్మ ఫోన్ నుంచి కాల్ వచ్చింది. నేను మేడంకు కూడా విషయం చెప్పాను.

సాక్షి: ఆ తరువాత ఏం జరిగింది?

కృష్ణారెడ్డి: నేను, ప్రకాశ్ అక్కడ ఉండగా వీల్ చెయిర్ దగ్గర లెటర్ దొరికింది. ఆ లెటర్ చదివాను. తన మాజీ డ్రైవర్ తనను చంపినట్లు వివేకం సార్ ఆ లెటర్‌లో రాసి ఉంది. ఇంతలో సౌభాగ్యమ్మ నాకు ఫోన్ చేశారు. అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ ఇమ్మన్నాను. ఆమె ఆయనకు ఫోన్ ఇస్తే ఆ లెటర్‌లో రాసింది చదివి వినిపించాను. ఆ లెటర్‌ను దాచిపెట్టు. ఎవరికి చెప్పొద్దు.. అని రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. లెటర్ గురించి పోలీసులకు చెప్పకపోతే ఇబ్బంది అవుతుంది కదా అని అన్నాను. ఏం ఇబ్బంది అవ్వదు.. మేం చూసుకుంటాం.. ఆ లెటర్ జాగ్రత్తగా దాచిపెట్టు అని ఆయన చెప్పారు. దాంతో ఆ లెటర్ విషయం పోలీసులకుగానీ ఎవరికీగానీ చెప్పలేదు. వంట మనిషి లక్ష్మమ్మ కొడుకు ప్రకాశ్‌కు ఆ లెటర్ ఇచ్చి మా ఇంట్లో ఇచ్చి రమ్మన్నాను. ఇంతలో రాజశేఖరరెడ్డి మళ్లీ నాకు ఫోన్ చేశారు. అప్పటికే సీఐ శంకరయ్య వచ్చారని చెప్పాను. ఆయన నా ఫోన్‌తో సీఐ శంకరయ్యతో మాట్లాడారు. తరువాత శంకరయ్య చెప్పినట్లుగా పోలీసు కంప్లైంట్ ఇవ్వమని రాజశేఖరరెడ్డి నాతో చెప్పారు. నేను అలానే చేశాను.

సాక్షి: ఆ లెటర్ అప్పుడే పోలీసులకు ఇచ్చేసి ఉంటే ఈ కేసు దర్యాప్తు వేరే విధంగా ఉండేది కదా?

కృష్ణారెడ్డి: ఆ లెటర్ అప్పుడే పోలీసులకు ఇచ్చి ఉంటే కేసు దర్యాప్తు సరైన విధంగా జరిగేది. కానీ, నాకు ఇష్టంలేకపోయినా రాజశేఖరరెడ్డి చెప్పడంతోనే ఆ లెటర్‌ను దాచి ఉంచాల్సి వచ్చింది.

సాక్షి: మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేశారు?

కృష్ణారెడ్డి: నన్ను పోలీసులు ఎందుకు అరెస్టుచేశారో నాకే తెలీదు. లెటర్ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పాడు. పోలీసులతో ఇబ్బంది వస్తుందని చెప్పినా తాను చూసుకుంటానని లెటర్ దాచి పెట్టమన్నాడు. టీడీపీ ప్రభుత్వం ఒత్తిడో.. వీళ్లు వాళ్లూ లాలూచీ అయి కృష్ణారెడ్డిని అరెస్టుచేయిస్తే సరిపోతుందని అనుకున్నారో తెలీదు.

సాక్షి: మిమ్మల్ని అరెస్టు చేశాక ఏం జరిగింది?

కృష్ణారెడ్డి: నన్ను అదేరోజు సాయంత్రం పోలీసులు అరెస్టుచేసి డీటీసీలో 13 రోజులపాటు ఉంచారు. బాగా కొట్టారు. రాజశేఖర్‌రెడ్డి చేశాడా.. శివశంకర్‌రెడ్డి చేసి ఉంటాడా చెప్పు అని తీవ్రంగా కొట్టారు. నాకు తెలీదని ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

సాక్షి: పోలీసులకు ముందు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మీద అనుమానం కలిగిందా?

కృష్ణారెడ్డి: పోలీసులు ముందు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డినే అనుమానించారు. వివేకం సార్‌ను ఆయనే హత్య చేయించి ఉంటాడా అని అడిగారు. నాకేమీ తెలీదని చెప్పాను. పోలీసులు కొట్టడంతో దాదాపు ఏడాదిపాటు నా చేతితో ఏమీ పట్టుకోలేక పోయాను.

సాక్షి: లెటర్‌ను దాచి పెట్టమన్న రాజశేఖర్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించరు అని మీరు పోలీసులను అడగలేదా?

కృష్ణారెడ్డి: పోలీసులు నన్ను కొడుతూ ఉంటే నేనేం మాట్లాడను. నా మాట వాళ్లు వినిపించుకుంటే కదా.

సాక్షి: రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు ఎందుకు విచారించలేదు?

కృష్ణారెడ్డి: ఎందుకు విచారించలేదో మరి. సీబీఐ వాళ్లకు కూడా అదే విషయం చెప్పాను. కానీ, వాళ్లు కూడా పట్టించుకోలేదు. వాళ్ల మధ్య ఏం ఒప్పందం ఉందో తెలీదు.

సాక్షి: ఎంపీ అవినాశ్‌రెడ్డి సీఐ శంకరయ్యను బెదిరించారనే ఆరోపణ కూడా ఉంది కదా?

కృష్ణారెడ్డి: సీఐ శంకరయ్య పక్కనే నేనున్నా. ఆయన్ని ఎవరూ బెదిరించనే లేదు.

సాక్షి: సీబీఐ కేసు దర్యాప్తు చేపట్టిన తరువాత ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పమని మీ మీద ఒత్తిడి వచ్చిందా?

కృష్ణారెడ్డి: ఎంపీ అవినాశ్, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని రాంసింగ్ నన్ను బాగా వేధించారు. వాళ్లిద్దరూ నన్ను బెదిరించారని చెప్పమన్నారు. అలాంటిదేమీ లేదని నేను చెప్పడంతో నన్ను బాగా కొట్టారు. ఉన్నది ఉన్నట్లు చెబుతాగానీ అబద్ధం చెప్పనని నేను అంటే మరింత గట్టిగా కొట్టేవారు. కొట్టినా చంపినా నాకు తెలిసింది ఇంతే అని చెప్పాను.

సాక్షి: ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లను ఇరికించాలని సీబీఐ అధికారి రాంసింగ్ ఎందుకు భావించారు?

కృష్ణారెడ్డి: సునీత, రాజశేఖరరెడ్డితో రాంసింగ్ ఏం కమిట్ అయ్యారో.. వాళ్లద్దరి పేర్లు చెప్పాలనే వేధించారు.

సాక్షి: సీబీఐ అధికారి రాంసింగ్ మీతో ఎలా వ్యవహరించారు?

కృష్ణారెడ్డి: ఒకరోజు రాంసింగ్ ఫోన్‌చేశారు. తాము చెప్పినట్లు విన్నారు కాబట్టే రంగన్న, దస్తగిరిలను రక్షించాం. నేను కూడా చెప్పినట్లు వింటే రక్షిస్తామన్నారు. కడప సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్‌కు నా పిల్లలతో రమ్మని చెప్పారు. ఆ విషయాన్ని రాజశేఖర్‌రెడ్డికి చెబితే రాంసింగ్ చెప్పినట్లు చేయమన్నారు. మా ఇద్దరు కొడుకులతో సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్‌కు వెళ్లాం. వాళ్లు చెప్పినట్లు వినకపోతే జైలుకు పంపిస్తామని బెదిరించారు. తాము పెద్ద పెద్ద వాళ్లనే జైలుకు పంపాం.. నువ్వెంత అని అన్నారు. నాకు తెలిసిందే చెబుతా తప్పా మీరు చెప్పమన్నట్లు అబద్ధం చెప్పలేనని నేను అన్నా. దాంతో కర్ర తీసుకుని నా కొడుకుల ముందే దాదాపు 20 సార్లు తీవ్రంగా కొట్టారు.

సాక్షి: మీ అబ్బాయి పెళ్లిని చెడగొట్టారు అంటారు..

కృష్ణారెడ్డి: మేం సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్ నుంచి ఇంటికి వచ్చిన మర్నాడే మా అబ్బాయికి సంబంధం కుదిరిన వారి నుంచి ఫోన్ వచ్చింది. పెళ్లి సంబంధం రద్దు చేసుకుంటున్నామని చెప్పారు. నా మీద కేసు ఉంది.. నేను జైలుకు వెళ్లాను.. మా ఆస్తులన్నీ తీసేసుకుంటామని సునీత, రాజశేఖర్‌రెడ్డి వారికి ఫోన్‌చేసి చెప్పారట. వాళ్లను హైదరాబాద్ పిలిపించుకుని మరీ బెదిరించి పెళ్లి సంబంధం రద్దుచేసుకునేలా చేశారు. వాళ్లు చెప్పినట్లు వినాలని నన్ను ఒప్పించేందుకు సునీత, రాజశేఖర్‌రెడ్డి అలా చేశారు. ఈ సంబంధం కాకపోతే మరో సంబంధం కుదురుతుందని నేను వారికి లొంగలేదు.

సాక్షి: మీరు రాంసింగ్ మీద ఫిర్యాదు చేశారు కదా?

కృష్ణారెడ్డి: నేను ఎంతమందితో చిత్రవధలకు గురయ్యేది. టీడీపీ ప్రభుత్వంలో ముందు పోలీసులు కొట్టారు. సునీత, రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్ పిలిపించుకుని బెదిరించారు. మా అబ్బాయి పెళ్లి సంబంధం చెడగొట్టారు. సీబీఐ అధికారి రాంసింగ్ నన్ను కడపలో కొట్టారు. ఢిల్లీ పిలిపించుకుని గొడ్డును బాదినట్లు కొట్టారు. ఇక ఎంతమందితో దెబ్బలు తినాలి.. అందుకే ఎస్పీకి ఫిర్యాదు చేశాను. నాకు ప్రాణహాని ఉంది.. భద్రత కల్పించాలని కోరాను. పులివెందుల కోర్టులో కూడా పిటిషన్ వేశాను.

సాక్షి: వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పారని ఒక ఆరోపణ వచ్చింది. ఆయన అలా చెప్పారా?

కృష్ణారెడ్డి: ఆ మాటే వినలేదు. అసలు ఆ విషయం ఎలా బయటకు వచ్చిందో కూడా నాకు తెలీదు.

సాక్షి: హత్య ప్రదేశంలో సాక్ష్యాధారాలను చెరిపేయాలని ఎంపీ అవినాశ్‌రెడ్డి మీతో చెప్పారని కొందరు ఆరోపిస్తున్నారు? దీనిపై ఏమంటారు?

కృష్ణారెడ్డి: అసలు వివేకం సార్ మృతదేహాన్ని బాత్రూమ్ నుంచి తీసుకువచ్చినప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి అక్కడ లేనేలేరు. అక్కడ సాక్ష్యాలను చెరిపి వేయించింది ఎర్ర గంగిరెడ్డే. ఎంపీ అవినాశ్‌రెడ్డిని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికే ఆ ఆరోపణలు చేస్తున్నట్లుగా ఉంది. అక్కడ తుడిపించి వేసింది గంగిరెడ్డే. అక్కడున్న అందరూ అది చూశారు.

సాక్షి: దస్తగిరి ఎలాంటి వ్యక్తి?

కృష్ణారెడ్డి: దస్తగిరి డ్రైవర్‌గా ఉండేవాడు. ప్రవర్తన సరిగా లేదని తీసేశారు. వివేకం సార్‌ను ముసలోడా అనేవాడు. డ్యాన్స్ చేసేవాడు.. వెక్కిరించేవాడు. దాంతో సౌభాగ్యమ్మ అతనిని పని నుంచి తీసేశారు. అతని ఇంట్లో వాళ్లు వచ్చి బాధపడితే సౌభాగ్యమ్మను ఒప్పించి మళ్లీ పనిలో పెట్టించాను.

సాక్షి: సీబీఐ అధికారులు పిలిస్తే మీరు ఢిల్లీ వెళ్లారు కదా.. అక్కడ ఏం జరిగింది?

కృష్ణారెడ్డి: సీబీఐ అధికారులు నోటీసు ఇస్తే ఢిల్లీ వెళ్లాను. నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి చెప్పే వెళ్లాను. నన్ను ఢిల్లీలో నెలరోజులు ఉంచి తీవ్రంగా వేధించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని అక్కడ కూడా రాంసింగే వేధించారు. నాకు తెలిసింది ఇప్పటికే చెప్పాను. లెటర్ దాచి పెట్టడమే నేను చేసిన తప్పు.. అది కూడా రాజశేఖర్‌రెడ్డి చెబితేనే చేశాను.. అంతకుమించి నాకేమీ తెలీదని చెప్పాను. దాంతో వాళ్లు నన్ను కొట్టేవారు. రోజూ రాత్రి సునీత, రాజశేఖర్‌రెడ్డి ఫోన్ చేసేవారు. నన్ను తీవ్రంగా కొడుతున్నారని వారికి నేను చెప్పేవాడిని.. నెల రోజులవుతోందని చెప్పినా వారు పట్టించుకోలేదు.

సాక్షి: దస్తగిరి చెప్పిందే నిజం అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది కదా?

కృష్ణారెడ్డి: దస్తగిరిని మేనేజ్ చేసి అలా చెప్పిస్తున్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకునే అతనితో అలా అబద్ధాలు చెప్పిస్తున్నారు. అసలు వివేకం సార్‌ను అంత క్రూరంగా చంపాను అని చెప్పిన దస్తగిరిని అప్రూవర్‌గా ఎలా మారుస్తారు? అతను చెప్పింది ఎలా పరిగణనలోకి తీసుకుంటారు? అందుకే దీని మీద నేను కోర్టులో పిటిషన్ వేశాను. చేతిలో 500 రూపాయలు కూడాలేని దస్తగిరి ఇప్పుడు పెద్దపెద్ద కార్లలో తిరుగుతూ పంచాయతీలు చేస్తున్నాడు. అప్రూవర్‌గా మారి తాము చెప్పినట్లు చెప్పాలని ఎవరో అతనికి భారీగా డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అతను చెప్పే అబద్ధాలనే పరిగణనలోకి తీసుకుంటూ సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి: వివేకానందరెడ్డి ఎవరి కోసం ఎన్నికల ప్రచారం చేసేవారు?

కృష్ణారెడ్డి: జగన్‌ను సీఎంను చేయాలి.. అవినాశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు. అందుకోసమే రోజూ తిరిగేవారు. చివరిరోజూ కూడా అలిగిన పార్టీ నేతలను బుజ్జగించి జగన్ సీఎం అవుతాడు.. అవినాశ్ మళ్లీ ఎంపీ అవుతాడు.. పార్టీ మీకు గుర్తింపు ఇస్తుంది.. ఎందుకు అలుగుతారని నచ్చజెప్పి వచ్చారు.

కానీ, ఆ తరువాత దస్తగిరి మరింత మారిపోయాడు. వివేకం సార్ షమీమ్ ఇంటికి వెళ్లాలంటే ఇతనే డ్రైవర్. దాంతో దస్తగిరికే ఆయన ప్రాధాన్యం ఎక్కువ ఇచ్చేవారు. దస్తగిరి డబ్బు మనిషి.

సాక్షి: మామా అల్లుళ్ల మధ్య సంబంధాలు ఎలా ఉండేవి?

కృష్ణారెడ్డి: నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మీద వివేకం సార్‌కు మంచి అభిప్రాయంలేదు. అల్లుడు కాబట్టి తప్పదు కదా. ఆయన మీద సార్ తరచూ కోప్పడేవారు. ఆ కుటుంబంలో ఏం జరుగుతోందో నాకు తెలీదు. కానీ, అల్లుడి మీద సార్ గట్టిగా అరుస్తూ ఉండేవారు. వివేకం సార్ రెండో భార్య షమీమ్ విషయంలోనే వాళ్ల మధ్య గొడవలు జరిగేవి.

సాక్షి: వివేకానందరెడ్డి రెండో పెళ్లి చేసుకోవడంతో ఆ కుటుంబంలో గొడవలు జరిగేవా?

కృష్ణారెడ్డి: షమీమ్ అనే ఆవిడను వివేకం సార్ రెండో పెళ్లి చేసుకోవడంతో ఆ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఒకరోజు సౌభాగ్యమ్మ, సునీత, రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి కలిసి వివేకం సార్‌తో గొడవ పడ్డారు. తాను షమీమ్‌ను పెళ్లి చేసుకోవడమే కాదు ఆమెతో తనకు ఒక అబ్బాయి కూడా ఉన్నాడని సార్ చెప్పారు. ఆ ఇద్దరి బాధ్యతతోపాటు ఆమెకున్న ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేయడం కూడా తన బాధ్యతేనని అన్నారు.

సాక్షి: సునీత ఎందుకు అంతగా కేకలు వేశారు?

కృష్ణారెడ్డి: నా మీద సునీత కోపంతో అరుస్తూ ఉంటే రాజశేఖర్‌రెడ్డి ఆమెను సముదాయించేందుకు యత్నించారు. 'ఈ కేసు విషయంలో కృష్ణారెడ్డి సహకరించకపోతే రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి వస్తుంది' అని సునీత ఆయనతో అంది. నాకేమీ అర్థం కాలేదు. వివేకం సార్ హత్యలో వీళ్ల పాత్ర ఉందేమోనని మొదటిసారి అనిపించింది. అంటే నాతో అబద్ధం చెప్పించి వేరెవరినో నాశనం చేయాలని సునీత భావిస్తోందని అర్థమైంది.

సాక్షి: వివేకానందరెడ్డిని ఎవరు చంపి ఉంటారు? మీతో ఎందుకు అబద్ధం చెప్పించాలని చూస్తున్నారు?

కృష్ణారెడ్డి: ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి ఎందుకు ప్రయత్నిస్తున్నారో అర్థంకావడంలేదు. నాతో ఒక అబద్ధం చెప్పించాలని ప్రయత్నిస్తున్నారంటే.. దాని వెనుక వాళ్లకేదో ఉద్దేశం ఉండే ఉంటుంది. ఎవర్నో కాపాడేందుకు.. ఏదో నిజాన్ని దాచేందుకే వాళ్లిద్దరూ ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోంది. సీబీఐ అధికారి రాంసింగ్ కూడా నాతో అబద్ధాలు చెప్పాలని ఎందుకు పట్టుబట్టారో తెలీడంలేదు. కేసు దర్యాప్తు సక్రమంగా సాగితేనే వాస్తవాలు బయటకొస్తాయి. కానీ, సీబీఐ తీరు సక్రమంగాలేదు. అదే బాధేస్తోంది.

సాక్షి: చివరగా.. వివేకా హత్య గురించి ఏమంటారు?

కృష్ణారెడ్డి: జరుగుతున్నదంతా చూస్తే.. సునీత, రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డిల మీదే అనుమానం కలుగుతోంది. వీళ్లే వివేకం సార్‌ను ఏమైనా చేసి మరొకరి మీద నింద వేయాలని చూస్తున్నారా అనిపిస్తోంది. ఆస్తి గొడవలు, షమీమ్ విషయం.. ఆస్తి వేరొకరికి పోతుందనే చేశారా అనిపిస్తోంది. ఎందుకంటే అబద్ధం చెప్పమని నన్ను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఎవరైనా నిజం చెప్పాలని అంటారు. కానీ, అబద్ధం చెప్పమని వీళ్లు ఎందుకు అంటున్నారన్నది చూడాలి. అందుకే వివేకం సార్‌ను వీళ్లే ఏమైనా చేశారనిపిస్తోంది. నేను అబద్ధం చెప్పకపోతే తన భర్త రాజశేఖర్‌రెడ్డి జైలుకు పోతారని కూడా సునీత నా ముందే అంది.

సాధికార బలగం

▶ మొదటి పేజీ తరువాయి

సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వడంతోపాటు రాజ్యాధికారంలో సింహభాగం వాటా కల్పించడం, అమ్మ ఒడి, విద్యాదీవెన లాంటి పథకాల ద్వారా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ సాధికారత సాధించేలా ముఖ్యమంత్రి జగన్ బాటలు వేశారని విశ్లేషిస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీబీటీ రూపంలో గత 58 నెలల్లో రూ.2,58,855.97 కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయగా ఇందులో బీసీ వర్గాలకే రూ.1,22,451.82 కోట్లు అందించడం ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. డీబీటీ, నాన్ డీబీటీతో కలిపి పేదలకు మొత్తం రూ.4,38,102.91 కోట్లను అందించగా అందులో బీసీ వర్గాలకే రూ.1,73,109.21 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియంను ప్రవేశపెట్టి అమ్మ ఒడి, విద్యా కానుక ఇచ్చి పిల్లలను బడులకు పంపేలా ప్రోత్సహించడంతోపాటు విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాల ద్వారా బీసీ బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్నత చదువులు అభ్యసిస్తున్న 93 శాతం మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతుండగా వీరిలో బీసీ విద్యార్థులే అత్యధికంగా లబ్ధి పొందుతుండటం గమనార్హం. గత సర్కారు ఎగ్గొట్టిన ఫీజుల బకాయిలు, మధ్యాహ్న భోజనం బిల్లులు కలిపి దాదాపు రూ.2,165 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించి పిల్లల చదువులకు అండగా నిలిచింది. అటు చదువుల వ్యయాన్ని భరిస్తూనే మరోవైపు భోజనం, వసతి ఖర్చుల కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోంది. నాడు – నేడుతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా అందుతున్న ఇంగ్లిషు మీడియం చదువులతో బీసీ విద్యార్థులు గరిష్టంగా ప్రయోజనం పొందగలుగుతున్నారు. సీబీఎస్ఈ సిలబస్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, ఐఎఫ్‌పీలతో డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే నైపుణ్యాలతో రాణించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

రాజ్యాధికారంలో సమున్నత వాటా

- 2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లను సాధించి 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలలో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని సాధించింది. 2019 మే 30న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన తొలి మంత్రివర్గాన్ని 2022 ఏప్రిల్ 11న పునర్‌వ్యవస్థీకరించారు. 25 మంది సభ్యులున్న మంత్రివర్గంలో ఏకంగా 11 మంది బీసీలకు సీఎం జగన్ స్థానం కల్పించారు. ఆ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడును డిప్యూటీ సీఎంగా నియమించారు. విద్య, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యారోగ్యం లాంటి కీలక శాఖలను బీసీలకే అప్పగించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశం కల్పించారు. 2014–19 మధ్య చంద్రబాబు తన మంత్రివర్గంలో కేవలం 8 పదవులు మాత్రమే బీసీలకు ఇవ్వడం గమనార్హం.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర కోటాలో ఖాళీ అయిన 11 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగగా, సీఎం జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారు. టీడీపీ హయాంలో ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు.
- సీఎం జగన్ శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 29 పదవులు (69 శాతం) ఇవ్వగా 2014–19 మధ్య చంద్రబాబు ఆ వర్గాలకు కేవలం 18 పదవులే (37 శాతం) ఇచ్చారు.

స్థానిక సంస్థల్లో పెద్దపీట

- స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టును ఆశ్రయించేలా చంద్రబాబు టీడీపీ నేతలను పురిగొల్పడంతో 24 శాతానికి తగ్గిపోయింది. అయితే రిజర్వేషన్లు తగ్గినా అంతకంటే ఎక్కువ మంది బీసీలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ దాన్ని ఆచరించి చూపి పదవులు ఇచ్చారు.
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో 13 జిల్లా పరిషత్‌లను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంటే ఒక్క బీసీలకే 6 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు (46 శాతం) కేటాయించారు.
- మండల పరిషత్ ఎన్నికల్లో 648 మండలాలకుగాను వైఎస్సార్‌సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను దక్కించుకుంటే అందులో 67 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకే ఇచ్చారు. ఇందులో కూడా గరిష్టంగా బీసీలకే పదవులు దక్కాయి.
- 14 కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయగా తొమ్మిది చోట్ల మేయర్ పదవులు(64 శాతం) బీసీలకు ఇచ్చారు.
- 87 మున్సిపాలిటీల్లో 84 మున్సిపాలిటీలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకోగా చైర్‌పర్సన్ పదవులు బీసీలకు 44 (53 శాతం) ఇచ్చారు.

నవరత్నాలతో బీసీలకు లబ్ధి ఇలా (రూ. కోట్లలో)

డీబీటీ: 1,22,451.82

నాన్ డీబీటీ: 50,657.39

మొత్తం (డీబీటీ + నాన్ డీబీటీ)
1,73,109.21

చట్టం చేసి మరీ 'నామినేటెడ్'

- దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వు చేస్తూ సీఎం జగన్ ఏకంగా చట్టం తెచ్చారు.
- రాష్ట్రంలో 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవుల్లో 76 అంటే 39 శాతం బీసీలకు ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్‌లలో 137 చైర్మన్ పదవుల్లో 53 బీసీలకే ఇచ్చారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఆ వర్గాల వారికే అవకాశం కల్పించారు.
- 137 కార్పొరేషన్‌లకు సంబంధించి మొత్తం 484 డైరెక్టర్ పదవుల్లో 201 బీసీలకే (42 శాతం) ఇచ్చారు.

బీసీలకు బాబు వెన్నుపోటు

చంద్రబాబు వలస వెళ్లి దశాబ్దాలుగా తిష్ట వేసిన కుప్పంలో బీసీల జనాభానే అత్యధికం. తన సొంతూరు ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో 1983 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన చంద్రబాబు 1989లో కుప్పం వలస వెళ్లి రాజకీయంగా బీసీలకు అన్యాయం చేశారు. తండ్రి బాటలోనే నారా లోకేశ్ కూడా నడుస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీలే అధికం. 2019లో బీసీ నేతకు వెన్నుపోటు పొడిచి ఆ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నారా లోకేశ్ దారుణ పరాజయం పాలయ్యారు.

వెన్నుదన్నుగా సీఎం జగన్

బీసీ డిక్లరేషన్‌లో చెప్పింది చెప్పినట్లుగా అమలు చేసి చూపించిన సీఎం జగన్ బలహీన వర్గాలను వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లపై టీడీపీ కోర్టుకెక్కితే అంతకంటే ఎక్కువ పదవులు దక్కేలా చేసిన సీఎం జగన్ బీసీల పక్షపాతిగా మన్ననలు అందుకున్నారు. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌తోపాటు డైరెక్టరేట్, ఆర్థిక సహకార సంస్థను కూడా ఏర్పాటు చేశారు. 139 కులాలకు 56 కార్పొరేషన్‌ల ఏర్పాటు చేసి బీసీల అభ్యున్నతికి చర్యలు చేపట్టారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం దశాబ్దాల తరబడి ఉద్యమాలు జరుగుతున్న విషయం తెలిసిందే. బీసీలకు 50% సీట్లు కేటాయించాలంటూ పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలతో ప్రైవేట్ బిల్లు పెట్టించి సీఎం జగన్ చరిత్ర సృష్టించారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. కుల గణన కోసం బీసీ సంఘాలు జాతీయ స్థాయిలో ఉద్యమం చేపట్టినా కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో సీఎం జగన్ కుల గణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించారు. కులగణనపై చంద్రబాబు మాట ఇచ్చి మోసం చేస్తే సీఎం జగన్ చిత్తశుద్ధితో కులగణన చేపట్టడం పట్ల బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ అడగకుండానే 'వైఎస్సార్ గీత కార్మిక భరోసా' పథకాన్ని తెచ్చి బీమా వర్తింప చేయడంతో గీత కార్మికులకు నిజమైన భరోసా లభించింది. చేనేత కార్మికుల పెన్షన్ రూ.వెయ్యి చేస్తానంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు లబ్ధిదారులను కుదించి మోసం చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నేతన్న నేస్తంతో ఏటా రూ.24 వేలు సాయంతోపాటు పెన్షన్ వయో పరిమితిని కుదించి అర్హులందరికీ రూ.3 వేలు పెన్షన్ అందిస్తూ చేనేత కుటుంబాలను ఆదుకుంటున్నారు.

సచివాలయంపై తా'కట్టు కథ'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా ఎల్లో మీడియా చేసిన కుట్ర బట్టబయలయ్యింది. రాష్ట్ర తాత్కాలిక సచివాలయాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారంటూ... ఒక పత్రికలో రాసిన కథనాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖండించింది. 'సచివాలయ భవనాలను తాకట్టు పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.370 కోట్లు రుణం తీసుకుంది' అంటూ ఒక పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తమని, ఇది ప్రజలను పూర్తిగా తప్పుదోవ పట్టించేదిగా ఉందని, దానిని ఖండిస్తూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికార ప్రతినిధి సోమవారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబును అధికారంలో కూర్చోబెట్టడానికి ఎల్లో మీడియా ప్రతీ రోజు ఏదో ఒక విష ప్రచారంతో భారీ కుట్రలకు తెరతీస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రతిష్టను మంటకలపడానికి కూడా వెనుకాడటం లేదు. ఇందులో భాగంగానే 'సచివాలయం తాకట్టు' అంటూ ఒక విష కథనాన్ని పకడ్బందీగా ప్రచారంలోకి తీసుకొచ్చింది. 'తాకట్టులో సచివాలయం' అంటూ ఎల్లో పత్రిక ఒక వార్తను ప్రచురించడం... దాన్ని తమ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం .. దానిపై తెలుగుదేశం పార్టీ అధినేత నుంచి జిల్లా స్థాయి నేతల వరకు మాట్లాడటం... తిరిగి ఆ వార్తను అన్ని పత్రికల్లో ప్రచురింపజేస్తూ... ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పడం ద్వారా ప్రజలు నిజం అని నమ్మే విధంగా చేయడానికి ఎల్లో మీడియా విశ్వప్రయత్నం చేసింది. కానీ ఆ వార్తను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖండించడంతో తెలుగుదేశం పార్టీ గోబెల్స్ ప్రచారం మరోసారి బట్టబయలయ్యింది.

మయూర వాహనంపై ఆదిదేవుడు

- శ్రీశైలంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీశైలం టెంపుల్/తిరుమల: శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గో రోజు సోమవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులను తోడ్కొని వచ్చి అందంగా అలంకరించిన మయూర వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపి హారతులు ఇచ్చారు. కళాకారుల నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించి క్షేత్ర పుర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మయూర వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనం పలికారు. స్వామివారికి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున ఈవో ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి రావణ వాహన సేవ నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

వేడుకగా ముక్కంటి ధ్వజారోహణం

- అంబారీపై విహరించిన ఆది దంపతులు
- శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



రేణిగుంట(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు సోమవారం స్వామివారి ధ్వజారోహణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారు పురవీధుల్లో ఊరేగగా, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పల్లకిని మోశారు. సాయంత్రం స్వామివారి ఆలయం ముందు వేదపండితులు హోమ పూజలు చేశారు. కలశ జలాలతో కొడిస్తంభాన్ని అభిషేకించి ధ్వజపటాన్ని ఎగురవేశారు. ధూపదీప నైవేద్యాలు పెట్టి పంచహారతులు సమర్పించారు. ధ్వజస్తంభానికి భక్తులు సమర్పించిన చీరలను కట్టి కొడి ఉత్సవం జరిపారు. సకలదేవతామూర్తులను ఆహ్వానించి వేడుకలను శోభాయమానంగా జరిపించాలని ప్రార్థించారు. అనంతరం పురవీధుల్లో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తొట్టెలో నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది


తొట్టెల్లో నింపిన నీటిని తాగుతున్న వన్యప్రాణులు

అడవిలో అమృతధార

వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ చర్యలు

పాపికొండలు అభయారణ్యంలో 60 నీటి తొట్టెల ఏర్పాటు

20 చెలమలతో పాటు చెక్‌డ్యామ్‌లు

బుట్టాయగూడెం: వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలంలో నీటి కోసం వన్య ప్రాణులు అటవీ పరిసర ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వచ్చేవి. ఆ సమయంలో కుక్కల బారిన, వాహనాల కింద పడి మృతి చెందిన ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు రెండేళ్లుగా వన్య ప్రాణులు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టిల్ని ఏర్పాటు చేసి వాటి దాహార్తి తీర్చేవిధంగా కృషి చేస్తున్నారు. ఈ చర్యలు విజయవంతం కావడంతో అటవీ శాఖ ఈ ఏడాది కూడా వేసవి ప్రణాళిక రూపొందించారు.

పాపికొండల్లో 60 నీటికుంటలు

పాపికొండలు అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేవిధంగా ఈ వేసవిలో 60 నీటి తొట్టెల్ని ఏర్పాటు చేశారు. వీటితోపాటు అటవీ ప్రాంతంలోని కాలువల్లో 20 చెలమల్ని తవ్వి వన్య ప్రాణులకు నీటి సౌకర్యం లభించే విధంగా చర్యలు తీసుకున్నారు. అవికాకుండా 25 చెక్‌డ్యామ్స్ ద్వారా నీటిని నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నీటి తొట్టెల్లో ప్రతి నాలుగు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా బేస్‌క్యాంప్ సిబ్బంది, బీట్ అధికారులు నీటిని తీసుకొచ్చి నింపుతున్నారు. వాటి పక్కన ఉప్పు ముద్దలను పెడుతున్నారు. నీటి కోసం వచ్చిన వన్యప్రాణులు దాహార్తి తీర్చుకుని ఉప్పు ముద్ద నాకుతాయని, తద్వారా వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశాలు ఉంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక కృషి



పాపికొండలు అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నాం. సుమారు 60 నీటితొట్టెల్ని వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో ఏర్పాటు చేశాం. జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.50 లక్షలు వెచ్చిస్తోంది.
– దావీదురాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

మల్లన్న పెళ్లికి నేతన్న 'తలపాగా'

మూడు తరాలుగా పృథ్వీ వంశస్తుల ఆచారం


మల్లన్నకు పాగా నేస్తున్న పృథ్వీ వెంకటేశ్వర్లు


శ్రీశైలం మల్లన్నకు అలంకరించేందుకు సిద్ధం చేసిన తలపాగా

చీరాల: శ్రీశైలం మల్లన్న కల్యాణానికి ముహూర్తం ముంచుకొస్తోంది. పెళ్లికోసం తలపాగా సిద్ధమైంది. శివరాత్రి రోజున చీరాల నేతన్న నేసిన తలపాగాను చుట్టిన తర్వాతే పెళ్లితంతు మొదలవుతుంది. ఈ అదృష్టం చీరాల చేనేత కార్మికుడికి దక్కడం ఈ ప్రాంతవాసుల అదృష్టం. ఈ ఆచారం మూడు తరాలుగా వస్తోంది.

ఇదీ తంతు.. : ఏటా శివరాత్రి రోజు శ్రీశైలం మల్లన్న కల్యాణం జరుగుతుంది. ఆయనను వరుడిని చేసేందుకు తలపాగాలంకరణ చేస్తారు. శివరాత్రి లింగోద్భవ సమయంలో రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకు గాను చీరాలలో తయారు చేసిన చేనేత వస్త్రంతో పెళ్లి కుమారుడిగా అలంకరిస్తారు. 150 గజాలు ఉండే ఈ వస్త్రాన్ని ఆలయ శిఖరం నుంచి నవ నందులను కలుపుతూ చుడతారు. (ఈ సమయంలో వస్త్రాన్ని ఇచ్చే భక్తులు ఒంటిపై నూలు పోగు లేకుండా ఉండాలన్నది ఆచారం).

చీరాలకు మహద్భాగ్యం : మల్లన్నను పెళ్లి కుమారునిగా అలంకరించే వస్త్రాన్ని నేసే మహద్భాగ్యం చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీ, హస్తినాపురంలోని చేనేత కుటుంబానికి చెందిన 'పృథ్వీ' వంశానికి దక్కింది. ఈ వంశం వారు మూడు తరాలుగా (వందేళ్లకు పైగా) ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పృథ్వీ వెంకటేశ్వర్లు నలభై ఏళ్లుగా మల్లన్న వస్త్రాన్ని నేస్తూ ప్రతి శివరాత్రి రోజున శ్రీశైలం వెళ్లి మల్లన్నకు అలంకరిస్తారు. ఈ మహద్భాగ్యం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతమని వెంకటేశ్వర్లు చెబుతారు.

ఉపవాసం, నియమ, నిష్ఠలు : మల్లన్నను అలంకరించే ఈ వస్త్రం తయారీకి 365 రోజులు పడుతుంది. రోజుకు ఒక మూర (అడుగున్నర) చొప్పున 365 రోజులు ఉపవాసం, నియమ, నిష్ఠలతో దీనిని నేస్తారు. ఇందులో పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పాలుపంచుకుంటారు. తలపాగాను తీసుకొని పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం ఊరేగింపుగా శ్రీశైలం బయల్దేరుతుంది. పది రోజుల పాటు అక్కడే ఉండి లింగోద్భవ సమయంలో రాత్రి 11 గంటల సమయంలో ఒంటిపై నూలుపోగు లేకుండా గర్భగుడి నుంచి నవనందులను కలుపుతూ శిఖరం చుట్టూ ఈ పాగాతో చుడతారు. ఆ తర్వాతే శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.

అధికారంలోకి వస్తే ఇంటి వద్దకే పింఛన్

- వలంటీర్లను తొలగించను
- పెనుకొండ సభలో చంద్రబాబు


చంద్రబాబు మాట్లాడుతుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న జనం

పెనుకొండ/బత్తలపల్లి/ : టీడీపీ అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే పింఛన్ అందిస్తానని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం కియా కార్ల పరిశ్రమ సమీపంలో సోమవారం నిర్వహించిన 'రా..కదలిరా' సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకొస్తే వలంటీర్లను తొలగిస్తామన్న అపోహ ఉందని, అయితే వలంటీర్లను తొలగించబోమని, వారి ద్వారానే పింఛన్లను అర్హుల ఇంటి వద్దకు అందిస్తామన్నారు. అయితే, వలంటీర్లు దౌర్జన్యపరుల కొమ్ముకాయకూడదన్నారు. తన హయాంలోనే కియా కార్ల పరిశ్రమ, గొల్లపల్లి రిజర్వాయర్ వచ్చాయని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అనుబంధ పరిశ్రమలు ఇక్కడి నుంచి వెళ్లిపోయాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హార్టికల్చర్ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి మీరు పది అడుగులు వేయండి.. తాము వంద అడుగులు వేస్తామన్నారు.

సభ అట్టర్‌ఫ్లాప్..

ఇదిలా ఉంటే.. కనీసం లక్ష మంది వస్తారని సభకు ముందు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. తీరా ఐదారు వేల మంది కూడా రాకపోవడంతో ఆ పార్టీ నేతలు నైరాశ్యం చెందారు. హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల నుంచే ఓ మోస్తరు జనం వచ్చారని, మిగిలిన ప్రాంతాల నుంచి రాలేదని.. అలాగే, టికెట్లు రాని నేతలు కూడా సభను పట్టించుకోకపోవడంవల్లే సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఇక చంద్రబాబు ప్రసంగం ప్రారంభించారో లేదో జనం భోజనాలు, తమ వాహనాల వద్దకు వెళ్లిపోయారు. ఉన్నవారితో చప్పట్లు కొట్టించడానికి చంద్రబాబు ప్రయత్నించినా.. వారిలో స్పందన కరువైంది. మరోవైపు.. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి గురించి చంద్రబాబు తన ప్రసంగంలో ప్రస్తావించకపోవడంతో ఆయన వర్గం తీవ్ర నిరుత్సాహానికి గురైంది.

రెచ్చిపోయిన పరిటాల వర్గీయులు


వరదాపురం సూరి వర్గీయుల వాహనాలపై దాడులు చేస్తున్న పరిటాల వర్గీయులు

ఇదిలా ఉంటే.. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల కేంద్రంలో సోమవారం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వర్గీయులు రెచ్చిపోయారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి) వర్గీయులతో బాహాబాహీకి దిగారు. సూరి వర్గీయులకు చెందిన 28 వాహనాల అద్దాలు పగులగొట్టారు. వారు కూడా ప్రతి దాడులకు దిగి పరిటాల వర్గీయులకు చెందిన రెండు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘర్షణ కారణంగా సుమారు మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో ఏం జరుగుతుందో తెలీక స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ దాడుల్లో ఆరుగురు కార్యకర్తలతోపాటు పలువురు ప్రయాణికులు, స్థానికులు గాయపడ్డారు.

బాబు సభకు అక్రమ మద్యం

హిందూపురం అర్బన్ : శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద సోమవారం నిర్వహించిన చంద్రబాబు 'రా..కదలిరా' సభకు వచ్చేవారి కోసం కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొస్తుండగా 'సెబ్' పోలీసులు పట్టుకున్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. టీడీపీ నేత బేవనహళ్లి ఆనంద్‌కుమార్ 40 బాక్సుల టెట్రా మద్యం ప్యాకెట్లు (మొత్తం 1,920 ప్యాకెట్లు) తీసుకుని కర్ణాటక రాష్ట్రం నగెరగెర నుంచి ఓ వాహనంలో లేపాక్షి మండలం మీదుగా పెనుకొండకు బయల్దేరారు. సమాచారం అందడంతో మైదగోళం వద్ద పట్టుకున్నారు. హిందూపురం పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన షేక్ హైసేన్ సాబ్, మేళాపురానికి చెందిన మంతేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. బేవనహళ్లి ఆనంద్‌కుమార్, గణేష్ పరారయ్యారు. మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు.

శ్రీవారి సేవలో సినీ నటి సమంత



తిరుమల: సినీనటి సమంత సోమవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

'దిండి'లో నిధుల గల్లంతు

- విజిలెన్స్ దర్యాప్తులో వెల్లడి
- ఐదుగురు సిబ్బందిపై కేసు

మలికిపురం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ పర్యాటక కేంద్రం దిండిలో రూ.1.16 కోట్ల నిధులు గల్లంతయ్యాయి. రెండేళ్లుగా సిబ్బంది చేతివాటం చూపడంతో ఈ నిధులు గల్లంతయినట్టు ఇటీవల పర్యాటక శాఖ నిర్వహించిన విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడైంది. దీనిపై పర్యాటక శాఖ రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ ఒంటెడ్డి స్వామినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి దిండి పర్యాటక కేంద్రం మేనేజర్ ఫణీంద్ర సహా మరో నలుగురిని బాధ్యులను చేస్తూ కేసు నమోదు చేశారు. ప్రధానంగా అకౌంటెంట్ పసుపులేటి సత్యనారాయణ డ్యూటీలో ఉన్న సమయంలోనే నిధులు గల్లంతయినట్లు సమాచారం. పర్యాటకుల నుంచి ఏటీఎం కార్డుల ద్వారా నగదును సత్యనారాయణ నేరుగా తన ఫోన్ పేకు జమ చేయించుకుని బిల్లులు ఇచ్చేసేవాడని చెబుతున్నారు. కార్డు ద్వారా జరిగిన నగదు చెల్లింపుల పరిశీలన అనేది టూరిజం శాఖ హెడ్ ఆఫీసులలో మాత్రమే జరుగుతుంది. స్థానికంగా వచ్చే నగదును రాజోలు ఎస్‌బీఐలో సిబ్బంది జమ చేస్తారు. జరిగిన వ్యాపారానికి, చెల్లింపులకు నగదు తేడా రావడంతో అనుమానం వచ్చిన విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగడంతో వ్యవహారం బయటపడింది. ఇలా రెండేళ్ల పాటు నగదు స్వాహాకు పాల్పడినట్లు చెబుతున్నారు. కేసు నమోదయినప్పటి నుంచీ సత్యనారాయణ పరారీలో ఉన్నాడు.

మైనారిటీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

నూర్‌బాషా, దూదేకుల ఆత్మీయ సమావేశంలో పలువురు వక్తలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలవల్ల రాష్ట్రంలో మైనారిటీలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలో ముస్లిం మైనారిటీలు అత్యంత భద్రతతో జీవిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన దూదేకుల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నూర్ బాషా, దూదేకుల కులస్తులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓతూరు రసూల్ మాట్లాడుతూ.. ఇండియన్ ఇస్లాం ముస్లిం దూదేకుల అని పరిగణించే విధంగా చర్యలు తీసుకోవాలని గత కొంత కాలంగా కోరుతున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేము కోరిన విధంగా మెమో జారీ చేయించారని చెప్పారు. అందుకు సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియచేశారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, నూర్ బాషా దూదేకుల రాష్ట్ర అధ్యక్షులు బుజ్జి పాల్గొన్నారు.



పరివార్

ప్రధానిపై లాలూ విమర్శలతో రాజకీయ రగడ

మోదీకి సంతానమెందుకు లేదన్న ఆర్జేడీ నేత

- కుటుంబం లేదు, హిందువే కాదని వ్యాఖ్యలు
- తనకు దేశమంతా కుటుంబమేనన్న మోదీ
- మతి చెడి తనపై విమర్శలంటూ ధ్వజం
- ప్రధానికి మద్దతుగా ఏకమైన బీజేపీ నేతలు
- తామంతా మోదీ కుటుంబమేనంటూ ప్రకటనలు
- సోషల్ ప్రొఫైల్స్‌లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్
- లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి సరికొత్త నినాదం!

"నువ్వేమీ మరీ అంత పెద్దవాడివి కాదు. మాట్లాడితే కుటుంబ రాజకీయాలంటూ మాపై పదేపదే దాడికి దిగుతున్నావ్! కుటుంబాల గురించి నీకెందుకు? నీకు సంతానం ఎందుకు లేదో చెప్పు. కుటుంబమే లేదు నీకు. అయోధ్యలో రామాలయం కట్టామంటూ గొప్పలు చెప్పుకుంటావు. కానీ నువ్వసలు హిందువువే కాదు. అమ్మ మరణిస్తే ప్రతి హిందువూ శిరోముండనం చేయించుకుంటాడు. నువ్వు మాత్రం చేయించుకోలేదు. కారణమేంటో చెప్పు! దేశమంతటా విద్వేష వ్యాప్తి చేస్తున్నావ్!" - పట్నా ర్యాలీలో మోదీపై లాలూ విమర్శలు



"ఇండియా కూటమిలోని విపక్ష నేతలంతా అవినీతి, వారసత్వ, సంతుష్టీకరణ రాజకీయాల్లో పీకల్లోతున కూరుకుపోయారు. పార్టీ ఏదైనా ఝూట్–లూట్ (అబద్ధాలు, దోపిడీ) అన్నదే వాళ్లందరి నైజం. దీనిపై ప్రశ్నిస్తే నాకు కుటుంబమే లేదంటూ ఆక్షేపిస్తున్నారు. 140 కోట్ల మంది భారతీయులే నా కుటుంబం. నా భారతదేశమే నా కుటుంబం. ఒక సేవకునిలా ప్రజా క్షేమానికే నా జీవితాన్ని అంకితం చేశా. దేశసేవ చేయాలనే కలను నిజం చేసుకోవడానికి చిన్న వయసులోనే ఇల్లు వీడా. నా జీవితమంతా తెరిచిన పుస్తకం. ప్రతి భారతీయునికీ ఆ విషయం తెలుసు" - ఆదిలాబాద్ సభలో మోదీ

న్యూఢిల్లీ/ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీపై ఆర్జేడీ నేత లాలూప్రసాద్ విమర్శలు పెను రాజకీయ వివాదానికి దారి తీశాయి. దేశవ్యాప్తంగా మంటలు రాజేశాయి. మోదీకి కుటుంబమూ లేదు, సంతానమూ లేరంటూ ఆదివారం పట్నా జన్‌సందేశ్ ర్యాలీలో లాలూ ఎద్దేవా చేశారు. ఆయనసలు హిందువే కాదంటూ ఆక్షేపించారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన విపక్ష నేతల సమక్షంలో లాలూ చేసిన ఈ వ్యాఖ్యలకు మోదీ సోమవారం గట్టిగా కౌంటరిచ్చారు. దేశం కోసమే జీవితాన్ని అంకితం చేశానని చెప్పారు. భారతదేశం, 140 కోట్ల మంది ప్రజలే తన కుటుంబమని పునరుద్ఘాటించారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ సభలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలను బీజేపీ నేతలంతా వెంటనే అందిపుచ్చుకున్నారు. తామంతా మోదీ కుటుంబమేనంటూ ఆయనకు పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మొదలుకుని రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, జి.కిషన్‌రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితర కేంద్ర మంత్రులు, నేతలంతా ఈ మేరకు ప్రకటనలు చేశారు. మోదీపై లాలు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. విపక్షాలపై పెద్దపెట్టున విరుచుకుపడ్డారు. తామంతా మోదీ కుటుంబమేనంటూ ప్రధానికి బాసటగా నిలిచారు. అంతేగాక సోషల్ మీడియా అకౌంట్లలో తమ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అంటూ జోడించుకున్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు కూడా ఇదే బాటపట్టి 'మోదీ కా పరివార్' అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. చివరికి ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కూడా తన ఎక్స్ ప్రొఫైల్‌కు 'మోదీ కా పరివార్' అని చేర్చుకున్నట్టు ట్రోల్స్ వెల్లువెత్తుతున్నాయి! విపక్షాలు మరోసారి లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి చేజేతులా పదునైన నినాదమే అందించాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

చిల్లర వ్యాఖ్యలు: బీజేపీ

మోదీపై వ్యక్తిగత విమర్శలు విపక్షాలకు కొత్తేమీ కాదంటూ బీజేపీ ఆగ్రహం వెలిబుచ్చింది. ''17 ఏళ్లుగా ఇలాంటి చిల్లర వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నాయి. ఇది నిజంగా బాధాకరం'' అని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది అన్నారు. విపక్షాల రాజకీయ దురహంకారానికి దేశ ప్రజలు తగిన విధంగా బదులు చెబుతారన్నారు. ''మొత్తం దేశాన్నే తన కుటుంబంగా మార్చుకున్నారు మోదీ. అందుకే ఎంత పని చేసినా ఆయనకు అలుపే రాదు. గత పదేళ్లలో మోదీ ఒక్క సెలవు కూడా తీసుకోలేదు'' అని చెప్పారు. మోదీకి సంతానం లేదన్న లాలు వ్యాఖ్యలను కూడా సుధాన్షు తీవ్రంగా తప్పుబట్టారు. ''హిందూ మతం గురించి లాలుకేం తెలుసు? అసలు విపక్ష ఇండియా కూటమిలో ఒక్కరు కూడా హిందువు లేదు! సనాతన ధర్మంలో భక్తికే పెద్దపీట తప్ప కుమారునికి కాదు. భారత్‌లో గురుశిష్య సంప్రదాయముంది తప్ప తండ్రీకొడుకుల సంప్రదాయం లేదు. రామభక్తుడైన హనుమంతునికే ఊరూరా గుళ్లున్నాయి. రాముని కుమారులు లవకుశులకు ఎక్కడైనా ఆలయముందా?'' అని ప్రశ్నించారు. ''మోదీ నాయకత్వంలో 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం మోదీ లక్ష్యమైతే ఎలాగైనా అధికారం సాధించి 2047 దాకా కూడా దాన్ని తమ కుటుంబాల గుప్పెట్లోనే ఉంచుకోవడం విపక్షాల లక్ష్యం'' అంటూ దుయ్యబట్టారు. వీళ్లైనంత భారీగా అవినీతికి పాల్పడి, తద్వారా తాము, తమ కుటుంబాలు మాత్రమే తరతరాలకు సరిపడా సంపద పోగేసుకోవాలన్నది విపక్షాల ఉద్దేశమని ఆరోపించారు.

నేరగాళ్లే మోదీ పరివారం: కాంగ్రెస్

ఇండియా కూటమి నానాటికీ బలోపేతమవుతుండటం చూసి అధికార బీజేపీలో అక్కసు పెరిగిపోతోందని కాంగ్రెస్ ఆరోపించింది. సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే 'మోదీ కా పరివార్' పేరిట కొత్త డ్రామాకు తెర తీసిందని మండిపడింది. ''రైతులను కార్లతో తొక్కించి చంపిన నేరగాడి తండ్రయిన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా, క్రీడాకారిణులను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ వంటి బీజేపీ నేతలే నిజమైన మోదీ కుటుంబం. అదే 'మోదీ కా అస్లీ పరివార్'' అంటూ ఎద్దేవా చేసింది. ''మణిపూర్ హింసాకాండకు బలైన మహిళలకు మోదీ కుటుంబంలో చోటేది? ఢిల్లీ శివార్లలో నిరసన గళమెత్తుతున్న రైతులను తన కుటుంబంగా చెప్పుకోగలరా? ఉపాధి లేక నిత్యం ఆత్మహత్యల బాట పడుతున్న నిరుద్యోగ యువతను తన కుటుంబమని చెప్పుకోరేం? బీజేపీ సర్కారు కేవలం క్రూరమైన నేరగాళ్ల, మోదీ సన్నిహిత పెట్టుబడిదారుల కోసం మాత్రమే పని చేస్తోంది'' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ దుయ్యబట్టారు. ''రైతుల హత్య, మహిళలపై అత్యాచారాలు... ఇదే నిజమైన మోదీ కుటుంబం'' అంటూ కాంగ్రెస్ నేతలంతా విమర్శలు గుప్పిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్, అజయ్ మిశ్రా తదితరులు తమ సోషల్ హ్యాండిల్స్‌కు 'మోదీ కా పరివార్' అని జోడించుకోవడాన్ని విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సంఘ్ పరివార్ కాస్తా చివరికి మోదీ పరివార్‌గా మారిందంటూ ఎద్దేవా చేస్తున్నారు.

2019లో 'మై భీ చౌకీదార్'

సాక్షి, న్యూఢిల్లీ: మోదీపై విపక్షాలు వ్యక్తిగత విమర్శలు చేయడం ఇది తొలిసారి కాదు. 2007 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోదీపై 'మౌత్ కా సౌదాగర్ (మృత్యు వ్యాపారి)' అంటూ అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లో మత అల్లర్లకు కారకుడనే అర్థంలో ఆమె చేసిన విమర్శలు వివాదానికి దారి తీశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బాగా నష్టం చేశాయి. అనంతరం 2018లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోదీని ఉద్దేశించి 'చౌకీదార్ చోర్ హై' (కాపలాదారే దొంగ) అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. తాను దేశానికి చౌకీదార్‌లా ఉంటానన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ ఎక్కుపెట్టిన ఆ విమర్శలూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నింటికీ తీవ్రంగా చేటు చేశాయి. ఆ వ్యాఖ్యలను బీజేపీ ప్రచారాస్త్రంగా మార్చుకుని ఘనవిజయం సాధించింది. మోదీ తన ట్విట్టర్ ప్రొఫైల్‌లో 'నరేంద్ర మోదీ చౌకీదార్' అని చేర్చుకున్నారు. బీజేపీ నేతలు కూడా 'మై భీ చౌకీదార్' అని ప్రొఫైల్స్‌లో చేర్చుకున్నారు.

ఉదయనిధిపై సుప్రీం మండిపాటు

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో..

న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత, తమిళనాడు యువజన సంక్షేమ, క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టింది. మంత్రి పదవిలో ఉన్నపుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించింది. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో తనపై ఆరు రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒక్కటిగా కలిపేయాలంటూ సుప్రీంకోర్టు తలుపు తట్టిన ఉదయనిధిని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ''మీరేం మాట్లాడుతున్నారో, ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేస్తున్నారనే దానిపై జాగ్రత్త వహించండి. మీ వ్యాఖ్యలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో ఒకసారి ఆలోచించండి'' అని కోర్టు మందలించింది. ''ఆర్టికల్ 19(1)ఏ కింద సంక్రమించిన వాక్ స్వాతంత్య్రం, భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కులను మీరు దుర్వినియోగం చేశారు. ఆర్టికల్ 25 కింద దఖలుపడిన మత స్వేచ్ఛను కించపరిచి ఇప్పుడేమో ఆర్టికల్ 32ను వాడుకుంటూ నేరుగా సుప్రీం కోర్టుకొచ్చారు. మీరు మాట్లాడిన మాటలు ఎంతటి విపరిణామాలకు దారితీశాయో మీకు తెలుసా? మీరేమీ సాధారణ వ్యక్తి కాదు. మీరు రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్నారు. మాటలు ఎక్కడికి దారితీస్తాయో తెల్సుకోండి'' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. విచారణను 15వ తేదీకి కోర్టు వాయిదావేసింది.

ఎన్నికల వేళ... టీఎంసీకి షాక్



కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీ నాయకత్వంపై తనకున్న భ్రమలన్నీ తొలిగిపోయాయంటూ అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ నేత తపస్ రాయ్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ప్రభుత్వ, పార్టీ పదవులకు మార్చి ఒకటో తేదీనే రాజీనామా చేశానని, ఈ మేరకు లేఖను కూడా పంపించినట్లు సోమవారం ఆయన మీడియాకు వెల్లడించారు. జనవరి 12వ తేదీన తన నివాసంపై ఈడీ అధికారులు దాడులు చేసిన సమయంలో పార్టీ మద్దతుగా నిలవకుండా మౌనంగా ఉండిపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. పార్టీ తనను ఏకాకిని చేసిందన్నారు. అసెంబ్లీలో షాజహాన్ షేక్ మద్దతుగా మాట్లాడిన సీఎం మమతా బెనర్జీ కనీసం తన పేరును కూడా ప్రస్తావించలేదని ఆరోపించారు. తదుపరి కార్యాచరణను సరైన సమయంలో ప్రకటిస్తానని తపస్ రాయ్ చెప్పారు.

సీనియర్ , డిప్యూటీ మేయర్ బీజేపీ కైవసం

చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి

చండీగఢ్: సర్వోన్నత న్యాయస్థానం జోక్యంతో చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో భంగపాటుకు గురైన బీజేపీ చివరకు సీనియర్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విజయబావుటా ఎగరేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థికి పడిన 8 ఓట్లను చెల్లనివిగా ప్రకటించి బీజేపీ నేత మేయర్ అయ్యేలా చేసిన రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన దరిమిలా చండీగఢ్ సీనియర్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు సైతం అందరి దృష్టినీ ఆకర్షించాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ రెండు విజయాలను నమోదు చేసుకుంది. ఫిబ్రవరి 19వ తేదీన ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు బీజేపీలో చేరడంతో 35 సభ్యులుండే మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ బలం మరింత పెరిగింది. దీంతో సీనియర్ మేయర్ ఎన్నికల్లో ఆప్ మద్దతు పలికిన కాంగ్రెస్ అభ్యర్థి గుర్‌ప్రీత్ గబీపై బీజేపీ అభ్యర్థి కుల్‌జీత్ సంధూ విజయం సాధించారు. డెప్యూటీ మేయర్ ఎన్నికల్లోనూ ఆప్ మద్దతు పలికిన కాంగ్రెస్ అభ్యర్థి నిర్మలా దేవిపై బీజేపీ అభ్యర్థి రాజేందర్ శర్మ గెలిచారు.

ప్రైమరీలో చరిత్ర సృష్టించిన నిక్కీ హేలీ




వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల రిపబ్లికన్ పార్టీ ప్రైమరీలో భారత సంతతికి చెందిన అభ్యర్థి నిక్కీ హేలీ చరిత్ర సృష్టించారు. వాషింగ్టన్ డీసీలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆమె మొదటిసారిగా విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల ప్రైమరీల్లో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. అంతేకాదు, డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీల నుంచి ప్రైమరీలో విజయం దక్కించుకున్న తొలి భారత సంతతి అమెరికన్‌గానూ రికార్డు నెలకొల్పారు. గతంలో, 2016లో భారత సంతతికి చెందిన బాబీ జిందాల్, 2020లో కమలా హారిస్, 2024లో వివేక్ రామస్వామి అధ్యక్ష పదవి రేసులో నిలిచినప్పటికీ కనీసం ఒక్క ప్రైమరీని కూడా గెలుచుకోలేకపోయారు. తాజాగా జరిగిన ఎన్నికలో హేలీ 1,274 ఓట్లతో 62.9% గెలుచుకోగా, ఆమె ప్రధాన ప్రత్యర్థి ట్రంప్‌కు 676 అంటే 33.2% ఓట్లు పడ్డాయి. తాజా విజయంతో హేలీ ఖాతాలో 43 డెలిగేట్లు చేరారు. ట్రంప్ ఖాతాలో 247 డెలిగేట్లున్నారు. మంగళవారం 15 రాష్ట్రాల్లో జరగనున్న ప్రైమరీ ఎన్నికలు కీలకంగా మారాయి.

కర్ణాటకలో విద్యార్థినులపై యాసిడ్ దాడి

మంగళూరు: ప్రేమను తిరస్కరించిందన్న ఆవేశంతో ఒక యువకుడు ఒక అమ్మాయిపై కక్ష పెంచుకుని యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. యాసిడ్ దాడి సమయంలో ఆ బాధిత అమ్మాయి పక్కనే కూర్చున్న వేరే ఇద్దరు అమ్మాయిలపైనా యాసిడ్ పడి వారికీ ముఖంపై కాలిన గాయాలయ్యాయి. కర్ణాటకలో మంగళూరు సమీపంలోని దక్షిణ కన్నడ జిల్లాలోని కడబ తాలూకాలో ఈ యాసిడ్ దాడి ఘటన జరిగింది. బాధిత అమ్మాయి ముఖంపై తీవ్రస్థాయిలో గాయాలయ్యాయి. దీంతో ఆమెను హుటాహుటిన సమీప ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడబలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రీ–యూనివర్సిటీ కోర్సు పరీక్షల కోసం కారిడార్‌లో కూర్చుని సిద్ధమవుతున్న ముగ్గురు టీనేజీ అమ్మాయిల ముఖంపైకి ఒక యువకుడు యాసిడ్ చల్లాడు. ఆ యాసిడ్ ద్రావకం పక్కనే ఉన్న మరో ఇద్దరు అమ్మాయిలపైనా పడింది. దాడి చేసి పారిపోతున్న యువకుడిని స్థానికులు వెంబడించి పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పజెప్పారు. అతడిని కేరళ మణప్పురం జిల్లా నీలాంబూర్‌కు చెందిన 23 ఏళ్ల అబిన్ షిబిగా పోలీసులు గుర్తించారు. తన ప్రేమను తిరస్కరించినందుకే బాధిత విద్యార్థినిపై యాసిడ్ దాడికి పాల్పడినట్లు పోలీసుల ముందు యువకుడు నేరం అంగీకరించాడు.

పాక్ ప్రధానిగా షహబాజ్ ప్రమాణం



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రిగా షహబాజ్ షరీఫ్(72) రెండోసారి ప్రమాణం చేశారు. అధ్యక్షభవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దేశాధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆయనతో ప్రమాణం చేయించారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, పంజాబ్ సీఎం మరియం నవాజ్, సింధ్ సీఎం మురాద్ అలీ షాతో పాటు ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్ హక్, త్రివిధ దళాధిపతులు పాల్గొన్నారు. గతంలో, 2022 ఏప్రిల్–2023 ఆగస్ట్ వరకు పార్లమెంట్ రద్దు కాకముందు షహబాజ్ దేశ ప్రధానిగా పనిచేశారు. ఆదివారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో షహబాజ్ సునాయాసంగా మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే.

కర్ణాటక అసెంబ్లీలో పాక్ నినాదాలు నిజమే!

పోలీసుల అదుపులో ముగ్గురు

బనశంకరి: కర్ణాటక అసెంబ్లీ భవనం విధానసౌధ కారిడార్లలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన కేసులో ముగ్గురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన ఇల్తాజ్, బెంగళూరు ఆర్‌టీ నగర వాసి మునావర్, బ్యాడగివాసి మహమ్మద్ షఫీనా శిపుడి అనే వారిని నిర్బంధించారు. ఫిబ్రవరి 27వ తేదీన విధానసౌధలో రాజ్యసభ ఎన్నికల పోలింగ్, ఫలితాల వెల్లడి జరిగింది. ఆ సమయంలో బళ్లారి కాంగ్రెస్ అభ్యర్థి నాసిర్ హుస్సేన్ గెలిచారు. దీంతో ఆయన మద్దతుదారులు పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి. విధాన సౌధ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రతిపక్ష బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ప్రదర్శనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ వీడియోలను ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షలకు పంపారు. నినాదాలు చేసింది నిజమేనని పరీక్షల్లో తేలడంతో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ డీసీపీ శేఖర్ తెలిపారు. మంగళవారం కస్టడీలోకి తీసుకుని విచారణ చేపడతామని చెప్పారు.

ఆ రోజే క్యాన్సర్ బయటపడింది

ప్రస్తుతం క్యాన్సర్‌ను జయించా: ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడి సంబంధ పరిశోధన కోసం భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదిత్య ఎల్–1 మిషన్ ప్రయోగంతో ఆనందంలో మునిగిపోయిన ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమ్‌నాథ్‌నూ అశుభ వార్త ఒకటి కొద్దిరోజులపాటు కలవరపాటుకు గురిచేసింది. ఆయన కడుపులో పెరుగుతున్న క్యాన్సరే అందుకు కారణం. శస్త్రచికిత్స, కీమోథెరపీ తర్వాత ఆయన ప్రస్తుతం క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ రెండో తేదీన జరిగిన ఘటన తాలూకు వివరాలను ఆయన ఇటీవల వెల్లడించారు. టార్మాక్ మీడియా సంస్థ వారి ' రైట్ టాక్' కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అందరితో ఆ విషయాలను పంచుకున్నారు. '' సెప్టెంబర్ రెండో తేదీన ఆదిత్య ఎల్–1 మిషన్ లాంచ్ ప్రక్రియకు కొద్ది వారాల ముందు నుంచే కడుపు నొప్పిగా అది మొదలైంది. మొదట అదే ఏడాది జూలై 14వ తేదీన చంద్రయాన్–3 ప్రాజెక్ట్ సందర్భంగానూ అనారోగ్యం బారినపడ్డా. ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పని ఒత్తిడి కారణంగా అలా అయ్యిందేమో అనుకుని దానిని సంగతి వదిలేశా. కానీ ఆ తర్వాతా కడుపు నొప్పి నన్ను వెంటాడింది. ఇక లాభం లేదనుకుని ఆదిత్య ఎల్–1 ప్రయోగం విజయవంతంగా పూర్వవగానే అదే రోజు చెన్నైలోని ఓ ఆస్పత్రిలో స్కానింగ్‌లు, టెస్ట్‌లు చేయించుకున్నా. పెద్ద పేగులో చిన్నపాటి క్యాన్సర్ కణతి పెరుగుతోందని పరీక్షల్లో బయటపడింది. ఆ వార్త విని నా కుటుంబసభ్యులంతా షాక్‌కు గురయ్యారు. కుటుంబసభ్యులే కాదు ఇస్రోలో శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, ఇంజనీర్లు హతాశులయ్యారు. శస్త్రచికిత్స తప్పదని వైద్యులు సూచించడంతో నాలుగు రోజులు ఆస్పత్రికే పరిమితయ్యా. సర్జరీ, కీమో థెరపీ తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నా. ఏటా స్కానింగ్, చెకప్ చేయించుకుంటా. నాకు క్యాన్సర్ వంశపారంపర్యంగా వచ్చిందని చెబుతున్నారు. దాన్ని జయించా. చిన్నపాటిది కాబట్టి మొదట్లోనే గుర్తించి శస్త్రచికిత్సతో తొలగించారు'' అని సోమ్‌నాథ్ చెప్పుకొచ్చారు.

సుప్రీంలో ట్రంప్‌కు భారీ విజయం

కొలరాడో ప్రైమరీ బ్యాలెట్‌లో ఆయన పేరుండాలని ఆదేశం



వాషింగ్టన్: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారీ ఊరట. కొలరాడో ప్రైమరీ బ్యాలెట్ పత్రాల నుంచి ఆయన పేరు తొలగించాలన్న రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పును అమెరికా సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. ఆయన పేరుండాల్సిందేనంటూ సంచలన తీర్పు వెలువరించింది. దాంతో కొలరాడోతో పాటు ఇలినాయీ, మెయిన్ వంటి రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్‌పై పేరు తొలగింపు ముప్పు ఎదుర్కొంటున్న ట్రంప్‌కు భారీ ఊరట లభించింది. ఆయా రాష్ట్రాల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రైమరీల్లో ట్రంప్ పోటీకి మార్గం సుగమమైంది. పార్లమెంట్‌పైకి మద్దతుదారులను ఉసిగొల్పారన్న ఆరోపణలపై రాజ్యాంగంలోని 14వ సవరణ మూడో సెక్షన్‌ను ఉపయోగించి ట్రంప్‌ను ప్రైమరీ నుంచి కొలరాడో సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. అధ్యక్ష అభ్యర్థిపై కోర్టు ఈ సెక్షన్‌ను వాడటం అమెరికా చరిత్రలో అదే తొలిసారి. 14వ సవరణను వాడే అధికారం పార్లమెంట్‌కే తప్ప రాష్ట్రాలకు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఇది అమెరికా సాధించిన ఘన విజయమని ట్రంప్ వ్యాఖ్యానించారు.



నెదర్లాండ్స్‌లోని తన నివాసంలో భార్య పెట్రాతో బెర్ట్ జాన్సెన్

మారిన గుండెతో 4 దశాబ్దాలు

గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించిన నెదర్లాండ్స్ వ్యక్తి

ఆమ్‌స్టర్‌డ్యామ్: గుండె కండరాల సమస్య కారణంగా అవయవాలకు అతని గుండె సరిగా రక్తాన్ని సరఫరా చేయలేని పరిస్థితి. ఈ దుస్థితి ఇలాగే ఉంటే మరో 6 నెలలకు మించి బతకవు అని వైద్యులు కరాఖండిగా చెప్పేశారు. అదేకాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి గుండె ఈయనకు సరిగ్గా సరిపోయింది. వెంటనే హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీతో ఈయనకు వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. 1984లో గుండె మార్పిడి చేయించుకున్నాక ఇప్పటికీనిక్షేపంగా ఉన్నారు. ప్రపంచంలో గుండె మార్పిడి చేయించుకున్న తర్వాత అత్యధిక కాలం జీవించి ఉన్న వ్యక్తిగా గిన్నిస్ రికార్డు సృష్టించిన నెదర్లాండ్స్ వాసి, 57 ఏళ్ల బెర్ట్ జాన్సెన్ కథ ఇది. ప్రస్తుతం గ్లైడర్ పైలెట్‌గా పనిచేస్తున్న ఇతనికి గుండె మార్పిడి చికిత్స జరిగి నేటికి 39 ఏళ్ల 8 నెలల 29 రోజులు. 17 ఏళ్లకు ఫ్లూ వ్యాధి సోకినపుడు వైద్యులు పరీక్షలు చేసి కార్డియో మయోపతి అనే సమస్య ఉందని గుర్తించారు. త్వరగా గుండె మార్చకపోతే ప్రాణానికే ప్రమాదమని తేల్చారు. లండన్ ప్రమాదంలో మరణించిన వ్యక్తి గుండె సరిపోలడంతో ఆయనకు ఆ గుండెను అమర్చారు. 'హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే 16 ఏళ్లకు మించి బతకరనేది అవాస్తవం. గుండె మార్పిడి అద్భుతం అనేందుకు నేనే నిలువెత్తు నిదర్శనం. బర్త్‌డేను అయినా పెద్దగా పట్టించుకోనుగానీ ఆపరేషన్ జరిగిన తేదీ నా జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజు' అని జాన్సెన్ వ్యాఖ్యానించారు. 'గుండె మార్పిడి చేయించుకున్న వ్యక్తి జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండాలి' అని ఆపరేషన్ చేసిన ప్రఖ్యాత వైద్యుడు మ్యాగ్డీ యాకూబ్ చెప్పారు. '40 ఏళ్ల క్రితం నెదర్లాండ్స్‌లో ఇలాంటి ఆపరేషన్ సౌకర్యాలు లేవు. అందుకే జాన్సెన్‌ను లండన్‌లోని హేర్‌ఫీల్డ్ ఆస్పత్రిలో గుండెమార్పిడి చేశా' అని చెప్పారు.

మరింత గడువివ్వండి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలపై సుప్రీంలో ఎస్‌బీఐ పిటిషన్

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించేందుకు గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించాలని కోరుతూ ఎస్‌బీఐ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత నెలలో ఎలక్టోరల్ బాండ్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు మార్చి 6వ తేదీలోగా బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి అందించాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. దాతల వివరాలను రహస్యంగా ఉంచేందుకు కోడ్‌ల రూపంలో వాటిని వేర్వేరుగా ఉంచామని, వాటిని ఒక చోట చేర్చి సరిపోల్చేందుకు చాలా సమయం పడుతుందని అందులో వివరించింది. రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలిచ్చే పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ ఫిబ్రవరి 15న విచారణ సమయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

హైతీలో తీవ్ర అరాచకం

- రాజధానిలోని జైలుపై దాడి.. 3,700 మంది ఖైదీల పరారీ
- ప్రధాని గద్దె దిగాలంటూ సాయుధ గ్రూపుల డిమాండ్

పోర్ట్ ఆవ్ ప్రిన్స్: కరేబియన్ దేశం హైతీలో అరాచకం రాజ్యమేలుతోంది. రాజధాని పోర్ట్ ఆవ్ ప్రిన్స్‌లోని జైలుపై సాయుధ దుండగులు ఆదివారం దాడులు చేశారు. అంతకుముందు పలు పోలీస్‌స్టేషన్లపైనా దాడులు చేశారు. జైలుపై దాడి ఘటనలో 12 మంది చనిపోగా, సుమారు 3,700 మంది ఖైదీలు పరారయ్యారు. అయితే, అధ్యక్షుడు మొయిజెను హత్య చేసిన కొలంబియా మాజీ సైనికులు సహా సుమారు 100 మంది ఖైదీలు జైలులోని తమ బ్యారక్‌లలోపలే ఉండిపోయారని సీఎన్ఎన్ తెలిపింది. బయటికొస్తే సాయుధ ముఠాలు చంపేస్తాయని వారంతా భయపడుతున్నట్లు పేర్కొంది. కాగా, రాజధాని పోర్ట్ ఆవ్ ప్రిన్స్ నగరాన్ని గుప్పెట పెట్టుకున్న ప్రధాన సాయుధ ముఠా ప్రధానమంత్రి ఆరియల్ హెన్రీ గద్దె దిగాలంటూ డిమాండ్ చేసింది. 2021లో అధ్యక్షుడు జొవెనెల్ మొయిజెను ఆయన నివాసంలో హత్య చేయడం వెనుక ఈ ముఠాయే ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదివారం 72 గంటల అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. 2023లో హైతీలో సాయుధ ముఠాల హింసాత్మక చర్యల కారణంగా 8,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస అంచనా.

జూన్ 15 కల్లా రౌస్ అవెన్యూలో ఆఫీసును ఖాళీ చేయాలి

ఆమ్ ఆద్మీ పార్టీకి సుప్రీంకోర్టు గడువు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రౌస్ అవెన్యూలోని ప్రభుత్వ స్థలంలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయాలను జూన్ 15 లోగా ఖాళీ చేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టుకు కేటాయించిన ఆ ప్లాట్‌లో కొనసాగే అర్హత ఆప్‌కు లేదంది. అక్కడి భవనాలను న్యాయ వ్యవస్థ అవసరాల కోసం అత్యవసరంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం పేర్కొంది.

12 తర్వాత వర్చువల్‌గా హాజరవుతా: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వరుసగా ఎనిమిదోసారి పంపిన సమన్లకు కూడా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్పందించలేదు. మార్చి 4వ తేదీన తమ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున సోమవారం విచారణకు హాజరు కాలేకపోయినట్లు తెలిపారు. ఈడీ తనకు సమన్లు ఇవ్వడం చట్టవిరుద్ధమే అయినా ఈనెల 12వ తేదీ తర్వాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వర్చువల్‌గా హాజరయ్యేందుకు చట్టం హక్కు కల్పించింది. అందుకు ఈడీ అధికారులు అనుమతిస్తారని భావిస్తున్నా. ఈడీ విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని నేను డిమాండ్ చేయలేదు. ఒకవేళ ప్రత్యక్ష ప్రసారం చేసినా అభ్యంతరం లేదు'అని కేజ్రీవాల్ అన్నారు. అయితే, కేజ్రీవాల్ పంపిన సమాధానాన్ని పరిశీలిస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. అయితే, కేజ్రీవాల్‌ను వర్చువల్‌గా విచారించేందుకు సిద్ధంగా లేని ఈడీ..తొమ్మిదో విడత సమన్లు పంపే అవకాశాలున్నాయంటున్నారు. ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో ఈడీ అధికారులు కోర్టును ఆశ్రయించడం.. కేజ్రీవాల్ వినతి మేరకు మార్చి 16న విచారణ చేపట్టనున్నట్లు కోర్టు ప్రకటించడం తెలిసిందే.


బీజేపీ 'మోదీ కా పరివార్' ప్రచారాన్ని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. కేవలం కేంద్ర మంత్రులే మోదీ కుటుంబమన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం, 5, మార్చి, 2024



ప్రభలకు పూజలు

పెనమలూరు: యనమలకుదురులో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రభల సందడి మొదలైంది. పలు ప్రభలకు సోమవారం భక్తులు పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.40 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 814.20 అడుగుల వద్ద ఉంది.



నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన పలువురు సోమవారం విరాళాలు సమర్పించారు. -8లో▸

న్యూస్‌రీల్

వైద్య సేవలను పరిశీలించిన నెదర్లాండ్స్ బృందం



పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుతున్న వైద్య సేవలను నెదర్లాండ్స్ దేశానికి చెందిన బృందం సోమవారం పరిశీలించింది. బృంద సభ్యులు జాన్ వాన్‌డీన్ బర్గ్, అలెగ్జాండర్ తదితరులు మధుమేహ రోగుల వివరాలు తెలుసుకున్నారు. వారికి ఇస్తున్న మందులు, వైద్య సేవల వివరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీం సభ్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ శోభ, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి వారికి పీఎం సౌర విద్యుత్ పథకం



చిలకలపూడి(మచిలీపట్నం): పేద, మధ్య తరగతి గృహ వినియోగదారుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సౌర విద్యుత్ పథకాన్ని ప్రారంభించిందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో సౌర విద్యుత్ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలు తమ గృహాలకు తగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కెపాసిటీ ప్రకారం సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. నెలవారీ విద్యుత్ వినియోగం 150 యూనిట్ల వరకు ఉంటే రెండు కిలోవాట్ల సోలార్ ప్లాంట్ కోసం రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు, 150 నుంచి 300 లోపు విద్యుత్ వినియోగం ఉంటే రూ.78 వేల వరకు సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీఓ ఎం.వాణి, ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

97.33 శాతం మందికి పింఛన్ కానుక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక సోమవారం సాయంత్రానికి 97.33 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,39,157 మంది వివిధ పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 2,31,799 మందికి వార్డు/గ్రామ వలంటీర్లు పింఛన్లు పంపిణీచేశారు. అత్యధికంగా జి.కొండూరు మండలంలో 98.98 శాతం, గంపలగూడెం మండలంలో 98.3 శాతం, నందిగామ (అర్బన్)లో 98.28 శాతం, నందిగామలో 98.22 శాతం, వీరులపాడు మండలంలో 98. 17 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు అందరికీ పోలియో చుక్కల మందు తప్పనిసరిగా అందేలా వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా ఆదివారం బూత్ సెషన్స్‌లో చుక్కల మందు వేసిన సిబ్బంది, సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. తొలి రోజు చుక్కల మందు వేయించుకోని చిన్నారులను గుర్తించి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్న పాఠశాలల్లో కూడా స్క్రీనింగ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని మండల పరిషత్ ఆదర్శ్ పాఠశాలలో నిర్వహించిన స్క్రీనింగ్ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పాల్గొన్నారు. మెరుగైన విద్యాబోధన జరగాలని, పోషకాహారంపై అవగాహన కలిగించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డీఈఓ సుబ్బారావు, డాక్టర్ నిరంజన్, ఐసీడీఎస్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్ జోష్

- 2024 ఎన్నికల్లో గెలుపే వైఎస్సార్ సీపీ లక్ష్యం
- మూడు ప్రాంతాల్లో నిర్వహించిన 'సిద్ధం' సభలు గ్రాండ్ సక్సెస్
- వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల్లో రెట్టించిన ఆత్మవిశ్వాసం
- 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సభతో విజయంపై భరోసా
- సీఎం ప్రసంగంతో పార్టీ శ్రేణులు, నాయకుల్లో నూతనోత్సాహం
- 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని ప్రజల్లో చర్చ



ఏలూరు సిద్ధం సభలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఉత్సాహం (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో నిర్వహించిన 'సిద్ధం' సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. వీటిలో లక్షల మంది పార్టీ శ్రేణులు పాల్గొనడంతో ప్రతిపక్ష నేతలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ భారీ బహిరంగ సభల్లో తాను ఐదేళ్లలో పేదల సంక్షేమం కోసం చేసిన కృషి, ఇచ్చిన హామీలు నెరవేర్చడం, రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేసేలా ఆయన చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల మంగళగిరిలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంతో పార్టీ నేతల్లో ఆత్మస్థైర్యం మరింత పెరిగింది. ఈ సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో 87 శాతం మందికి మేలు జరిగిందని, ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి విశ్వసనీయతను చాటుకున్నామని వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతి పక్షాల కుటిల రాజకీయాలను ఎలా తిప్పికొట్టాలో సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గెలుపు సాధ్యం చేసే అంశాలు, ముఖ్యమంత్రి చెప్పిన మాటలు ఆకట్టుకున్నాయి. తమ అధినేత హితబోధను పార్టీ నేతలు కింది స్థాయి నాయకులు, కార్యకర్తలకు చెప్పడంతో వారిలో ఉత్సాహం రెట్టింపయింది.

పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం

రాష్ట్ర ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చేపట్టిన చర్యలు, వాటి వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన మేలును పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించడంతో పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసింది. ఇదే ఉత్సాహం, నమ్మకంతో పనిచేసి పార్టీని మళ్లీ గెలిపించాలని పార్టీ కార్యకర్తలు సంకల్పం చేశారు. జిల్లాలో సీఎం పర్యటన తరువాత కింది స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, గెలుపు కోసం చేయాల్సిన కృషిని వివరించనున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

త్వరలో జరిగే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ దూసుకెళ్తోంది. గత ఎన్నికల్లో కృష్ణా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు, మచిలీపట్నం ఎంపీ స్థానం, ఎన్టీఆర్ జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఘన విజయం సాధించింది. 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సమావేశంలో పార్టీ అధినేత, సీఎం జగన్ చేసిన దిశానిర్దేశంతో రెండు ఎంపీ, అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి క్లీన్ స్వీప్ దిశగా పార్టీ నేతలు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానంతో పాటు ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు మెజారిటీ స్థానాలు సాధించారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే సాధారణ ఎన్నికల కోసం సర్వం 'సిద్ధం' చేసుకున్నారు. పార్టీ శ్రేణుల్లో వచ్చిన ఉత్తేజాన్ని చూసి గత ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయనే చర్చ ప్రజల్లో జరుగుతోంది.

రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై శివరాత్రి మహోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల ఆరు నుంచి పదో తేదీ వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ సోమవారం తెలిపింది. ఆరో తేదీ ఉదయం 9.30 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు, వధూవరుల అలంకరణ, సాయంత్రం నాలుగు గంటలకు విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన, ధ్వజారోహణ జరుగుతాయి. ఏడో తేదీ ఉదయం ఎని మిది గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి 6.30 గంటల వరకు మండపారాధన పూజ, ఔపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం వంటి వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఎనిమిదో తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు త్రికాల అభిషేకాలు, రాత్రి 9.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12.30 గంటల వరకు శ్రీదుర్గా మల్లేశ్వరుల దివ్య లీలాకల్యాణ మహోత్సవం జరుగుతుంది. తొమ్మిదో తేదీ ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు మండపారాధన పూజ, అనంతరం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద సదస్యం, వేదస్వస్తి నిర్వహిస్తారు. పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవం, దుర్గాఘాట్‌లో అవభృథోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ధ్వజావరోహణతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. 11వ తేదీ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పంచహారతుల సేవ, అనంతరం పవళింపు సేవ జరుగుతాయి. ఉభయదాతలు రూ.1116 టికెట్‌తో కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

కల్పవల్లీ.. పాహిమాం

- వైభవంగా ముగిసిన వీరమ్మతల్లి తిరునాళ్లు
- పెద్ద ముఠా ప్రభ బండి ఊరేగింపు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే



పెద్ద ముఠా కార్మికుల ప్రభ బండి ఊరేగింపులో మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఉయ్యూరు(పెనమలూరు): భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు వైభవంగా ముగిశాయి. పెద్ద ముఠా కార్మికులు సోమవారం ప్రత్యేకంగా అలంకరించిన జోడు పొట్టేళ్ల పూల ప్రభ బండి మొక్కు చెల్లించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. తిరునాళ్ల ఆఖరి రోజున అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. కనులారా తల్లిని దర్శించుకుని పాహిమాం వీరమ్మతల్లి.. రక్షమాం కల్పవల్లి.. అంటూ మొక్కులు సమర్పించారు. పొట్టేళ్ల ప్రభ బండి ఊరేగింపును మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించి ప్రత్యేక పూజలు జరిపించారు. 15 రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు చల్లని తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు సిద్ధం చేసి నైవేద్యంగా సమర్పించారు. సంతాన ప్రాప్తి కోసం అమ్మ సన్నిధిలో పానాచారం చేశారు. ఎదురుగండ దీపాలతో అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరిన పర్వదినాన భక్తులు ఎదురుగండ దీప, తిరుగుడు గండ దీపాలు సమర్పించి హారతులు పట్టారు. ఊయల ఉత్సవం, ఆలయం ఎదురుగా 11వ రోజు శిడి బండి ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తిరునాళ్ల ప్రత్యేకం.. జోడుపొట్టేళ్ల ప్రభ బండ్లు

తిరునాళ్లలో జోడు పొట్టేళ్ల పూల ప్రభ బండ్లు ప్రత్యేకం. వివిధ గ్రామాలు, ఉయ్యూరు పట్టణం నుంచి భక్తులు జోడు పొట్టేళ్ల పూల ప్రభ బండ్లుతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తరలివచ్చి కల్పవల్లిని దర్శించుకుని పొట్టేళ్లను కానుకగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పెద్ద ముఠా కార్మికులు అమ్మకు ఆఖరి మొక్కు చెల్లించారు. పూల ప్రభ బండి ఊరేగింపును గృహ నిర్మాణశాఖమంత్రి జోగి రమేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, నాయకులు జంపాన రవి, జంపాన స్వామి, జంపాన శివయ్య, ముఠా ప్రతినిధులు అనగాని శివశంకర్, అనగాని శ్రీను, జంపాన చింతయ్య పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- స్పందనలో కలెక్టర్ ఢిల్లీరావు



స్పందనలో ప్రజల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు తమ సమస్యలపై స్పందనలో ఇచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు ప్రజల సమస్యలను ఆలకించి, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందన ద్వారా స్వీకరిస్తున్న అర్జీలను సకాలంలో, అర్జీదారు తృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే అర్జీలకు పరిష్కారం చూపితే జిల్లా స్థాయి వరకు వచ్చే అవకాశం ఉండదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులు అందరిపై ఉందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనతో పాటు ఆన్‌లైన్‌లో జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదవుతున్న అర్జీలను కూడా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీదారుల వినతులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు.

స్పందనలో 108 అర్జీలు నమోదు

జిల్లా స్పందనలో 108 అర్జీలు నమోదయ్యాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖ పరిధిలో 51 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. శాఖల వారీగా పోలీస్ 15, మునిసిపల్ 5, మార్కెటింగ్, విద్య, డీఆర్డీఏ పరిధిలో నాలుగుచొప్పున, సర్వే అండ్ సెటిల్‌మెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, అటవీ శాఖ, పౌర సరఫరాలు, బ్యాంకులకు సంబంధించి మూడు చొప్పున, ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభావంతులు, డ్వామాకు సంబంధించి రెండేసి, కోఆపరేటివ్, ఉపాధి కల్పన, ఆర్అండ్‌బీ, దేవదాయ శాఖ పరిధిలో ఒక్కొక్క అర్జీ చొప్పున అందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజని కుమారి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెనమలూరులో గ్రూపుల గోల

- తేలని తెలుగుదేశం పార్టీ సీటు వ్యవహారం
- తాడో పేడో తేల్చుకుంటానంటున్న బోడే
- రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తున్న వైనం
- తాజాగా తెరపైకి తుమ్మల చంద్రశేఖర్
- నియోజకవర్గ శ్రేణుల్లో అయోమయం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో పెనమలూరు సీటు వ్యవహారం కాకరేపుతోంది. టీడీపీ–జనసేన ప్రకటించిన అభ్యర్థుల తొలి జాబితాలో పెనమలూరు ప్రస్తావన లేకపోవటంతో ఆశావహుల ఆశ.. నిరాశగానే మిగిలింది. రోజుకొక కొత్త పేరు తెరపైకి రావటంతో అసలు సీటు ఎవరికిస్తారో అర్థమవక ఆ పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నాయి. ఆది నుంచి పార్టీ కోసం కష్ట పడిన వారికి సీట్లు ఇవ్వకుండా డబ్బు మూటలతో వచ్చే నేతలకే టీడీపీ అధినేత చంద్రబాబు, చినబాబు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈకోవలోనే గుడివాడలో వెనిగండ్ల రాము, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావుకు సీట్లు కేటాయించారు. స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి గాలం వేసి తీరా పార్టీలో చేరాక సర్వేల బూచి చూపి, నూజివీడుకు పంపారు. మరో వైపు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న బోడే ప్రసాద్‌కు టికెట్ ఇవ్వకుండా, డబ్బు మూటలతో వచ్చే నాయకుల కోసం గాలిస్తున్నారు. ఓ వైపు సర్వేలన్నీ తనకే అనుకూలంగా ఉన్నాయని, పెనమలూరులో తానే పోటీచేస్తానని బోడే ప్రసాద్ గట్టిగా చెబుతున్నారు. 'ఎవరికో' ఇస్తే చేతులు ముడుచుకు కూర్చునే ప్రసక్తే లేదని అధిష్టానానికి హెచ్చరికలు పంపుతున్నారు.

తమ్ముళ్లలో విభేదాలు

పెనమలూరు టీడీపీలో గ్రూపుల గోల ఇప్పటికే పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. నియోజకవర్గ టీడీపీ సీటు తమదేనంటూ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత గ్రామాల్లో పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలు సాగిస్తున్నారు. తానే ఇన్‌చార్జినని, తన వల్లే పార్టీ పటిష్టంగా ఉందని బోడె ప్రసాద్ చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో ఒప్పందం మేరకు ఈ దఫా సీటు తమదేనని పండు కుమార్తె స్మిత ధీమాతో ఉన్నారు. ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్ వర్గం బోడేకు సహకరించడం లేదు. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్యే పార్థసారథి వర్గం మరో గ్రూపుగా వ్యవహరిస్తోంది. పార్థసారథి సైతం తమ గ్రూపు తరఫున కొత్త అభ్యర్థిని ప్రతిపాదిస్తున్నారు. ఇందులో భాగంగానే పార్టీలో ఆయనతోపాటు పార్టీలో చేరిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్‌కు మద్దతు ఇస్తున్నారు. ఇలా ఎవరికి వారే తమ వర్గాలతో ప్రజల్లోకి వెళ్తూ సీటుపై ఆశలు పెంచుకుంటున్నారు.

తాజాగా తెరపైకి తుమ్మల

తొలి నుంచి బోడే ప్రసాద్, దేవినేని స్మిత టీడీపీ టికెట్ ఆశిస్తూ పనిచేస్తున్నారు. ఒకానొక తరుణంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడే ఇక్కడ పోటీకి వస్తున్నారన్న ప్రచారం జోరుగా జరిగింది. మరో వైపు పూటకో నేత పేరుతో పార్టీ వర్గాలు ఎన్నికల సర్వే నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కె.పార్థసారథి, బేగ్, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమా పేరుతో సర్వేలు చేయించారు. తాజాగా ఇటీవల పార్టీలో చేరిన తుమ్మల చంద్రశేఖర్ పేరుతో కూడా సర్వే చేస్తున్నారు. తుమ్మల చంద్రశేఖర్‌ను బాబు వద్దకు పార్థసారథి తీసుకెళ్లి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు సమాచారం. బయట నేతలకు ఇక్కడ అవకాశం లేకుండా స్థానిక నేతలకే టికెట్ దక్కేలా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా తుమ్మల సైతం ఎన్నికల్లో అయ్యే ఖర్చు భరిస్తానని, డిపాజిట్ కూడా చేస్తానని చెప్పడంతో అతనివైపు బాబు, చినబాబు మొగ్గుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతోపాటు బోడే ప్రసాద్, దేవినేని ఉమా, మరికొందరు బయట వ్యక్తుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరగటంతో 'సీటు' వ్యవహారం కొలిక్కి రాక పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. రానున్న రోజుల్లో పెనమలూరు వేదికగా టీడీపీలో ఎవరికి టికెట్ కేటాయించినా అక్కడి వర్గాలు కత్తులు దూసుకొని, పార్టీ పరువును బజారు కీడ్చడం ఖాయమని టీడీపీ నాయకులే పేర్కొంటున్నారు. చంద్రబాబు, లోకేష్ చిల్లర రాజకీయాలే పెనమలూరు టీడీపీలో చిచ్చు రేపుతున్నాయని పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టికెట్ వ్యవహారంలో ఇలానే నాన్చుడు ధోరణితో అవలంబిస్తే పార్టీ పుట్టి మునగడం ఖాయమని పరిశీలకులు సైతం స్పష్టంచేస్తున్నారు.

త్వరితగతిన కాలువల మరమ్మతులు చేపట్టాలి

- వ్యవసాయ సలహామండలి సమావేశంలో కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ



మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ. చిత్రంలో జన్ను రాఘవరావు, పద్మావతి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు మేలు జరిగేలా జిల్లాలోని పంట కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ పనులను సాగునీటి విడుదలకు ముందుగానే చేపట్టాలని అధికారులను కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం కమిటీ చైర్మన్ జన్ను రాఘవరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. జేసీ మాట్లాడుతూ.. మైనర్, మీడియం డ్రెయిన్లలో పూడికతీతను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టేందుకు జిల్లాలోని 106 గ్రామాల్లో పనులు గుర్తించామని తెలిపారు. ఈ పనులు రూ.9.73 కోట్లతో చేపట్టేందుకు కలెక్టర్ మంజూరు చేశారని పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో పనులను గుర్తించి నిర్వహిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో సేకరించిన ధాన్యానికి సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చూస్తామని తెలిపారు. తడిచి రంగుమారిన ధాన్యం కొనుగోలుకు నిబంధనలు వచ్చాయన్నారు. వాటి ప్రకారం రైతులకు డబ్బులు సకాలంలో అందిస్తామన్నారు. జిల్లాలోని ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీకి 149 పాత కనెక్షన్లు, 250 కొత్త కనెక్షన్లకు సంబంధించి సబ్సిడీ చెల్లింపును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిటీ సభ్యులు పట్టపు శ్రీనివాసరావు, శ్రీకాకో ళపు నాగేశ్వరరావు (బాబు), జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.పద్మావతి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్, డీసీఓ ఫణికుమార్, మార్కెటింగ్ ఏడీ ఎల్.నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్తేశ్వరుని కల్యాణోత్సవాలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): స్థానిక భవానీ ముక్తేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు ఈ నెల ఐదు నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జయప్రకాష్ బాబు సోమవారం తెలిపారు. ఐదున నది ఒడ్డునున్న ముక్తేశ్వరాలయంలో సంప్రోక్షణ, స్వామి వారిని పెళ్లి కుమారుని చేయటం, ఆరున విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, ఏడున నిత్య హోమం, బలిహరణ, ఎనిమిదిన మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటలకు స్వామి కల్యాణం, అన్నాభిషేకం, తొమ్మిదిన బిందుతీర్థం, నిత్య హోమం, పారువేట ఉత్సవం, 10న పూర్ణాహుతి, వసంత సేవ, దొంగల తోపు ఉత్సవం, 11 నుంచి 13 వరకు పవళింపు సేవలతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. స్వామి వారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌బాబు ఏర్పాట్లను పరిశీలించారు. నది ఒడ్డున జల్లు స్నానాలు, పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో పారిశుద్ధ్య, తాగునీరుతో పాటు మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మూడు ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చిల్లకల్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 59 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షకు 21,938 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 21,486 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిగిలిన విద్యార్థులు హాజరు కాలేదు. ఆర్ఐవో రవికుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలు జిల్లాలోని ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ జరగలేదని తెలిపారు.

16న 'మిక్ ఫెస్ట్ ఆగమ 2024'

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఏటా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక పేపర్ ప్రజెంటేషన్ కాంటెస్ట్ 'ఆగమ 2024' ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీకిరణ్ తెలిపారు. సోమవారం ఆగమకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, కోడింగ్ వంటి పలు విభాగాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో బీటెక్‌తో పాటు వివిధ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులు, ఎంటెక్, ఎంసీఏ విద్యార్థ/లు ఈ పోటీలలో పాల్గొని వారి ప్రతిభ కనపరచవచ్చని చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాల కళాశాల వెబ్‌సైట్ మిక్‌టిక్.ఇడియు.ఇన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. అదే రోజున కళాశాల విద్యార్థులకు 'మిక్ ఫెస్ట్ 2024' వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి. పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు ఎం. సుహాస్, మిక్ ఫెస్ట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఏలూరు రైల్వే పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. దీంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. మృతుడు తెనాలికి చెందిన సరిశెట్టి సాయిరాం (27)గా గుర్తించారు. గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల లేదా రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడటం వల్ల కానీ మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఏలూరు రైల్వే హెచ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాణ్యమైన వస్తువులను వినియోగించండి

జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు



మాట్లాడుతున్న సీఈఓ జ్యోతిబసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాణ్యత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించి నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసేలా ప్రజలను చైతన్యం చేయాలని డీపీఆర్సీ ప్రిన్సిపాల్, జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు అన్నారు. నాణ్యత లేని వస్తువులు కొనుగోలు చేయడం వలన ఎదురయ్యే ఇబ్బందులు, మోసాలను నివారించేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఆయన అన్నారు. సోమవారం బందరు రోడ్డులో గల డిస్ట్రిక్ట్ పంచాయతీ రిసోర్సు సెంటర్ (డీపీఆర్సీ) మీటింగ్ హాలులో నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై జిల్లాకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సీఈఓ జ్యోతిబసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), ఐఎస్ఐ, హాల్‌మార్క్ గల వాటిని కొనుగోలు చేసేల ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించి ఎలక్ట్రికల్ వస్తువులు, నిర్మాణాలకు సంబంధించి ఐరన్, సిమెంట్ తదితర వస్తువులను ఐఎస్ఐ మార్క్ కలిగిన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. గ్యాస్ సిలెండర్లు, ప్రెజర్ కుక్కర్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, బంగారం మొదలైన వస్తువుల నాణ్యత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో నాణ్యత ప్రమాణాలు (ఇండియన్ స్టాండర్డ్స్) వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పించేలా కృషి చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని జ్యోతిబసు కోరారు. జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్, ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ సాయి కుమార్, జిల్లాలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జి దుర్గారావు గౌడ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లు బీసీలను తీవ్ర అన్యాయం చేసి, బీసీల ద్రోహిగా మిగిలిపోయారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కసగోని దుర్గారావు గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా సమస్యలు చెప్పడానికి వెళ్లిన బీసీలను తోకలు కత్తిరిస్తానని బెదిరించారని, బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారని అవహేళనగా మాట్లాడారన్నారు. అలాంటి ఆయన ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని జయహో బీసీ అంటూ సభలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు.

అండగా సీఎం జగన్..

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అధికశాతం బీసీలు భాగస్వాముల య్యారన్నారు. మంత్రివర్గంలో అత్యధికంగా బీసీలే ఉన్నారని, నలుగురిని రాజ్యసభకు పంపారని, ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమం అందుతోందని, ఇళ్లలేని వారికి ఇళ్ల స్థలాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలతో బీసీలు సంతోషంగా ఉన్నారని దుర్గారావుగౌడ్ అన్నారు.

పూరిల్లు లేని రాష్ట్రమే లక్ష్యం

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

కంకిపాడు: పూరిల్లు లేని రాష్ట్రం సాధనకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఏడు బాధిత కుటుంబాలను స్నిగ్ధ సోమవారం పరామర్శించారు. రక్ష ఫౌండేషన్, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రమాద వివరాలను, జరిగిన ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇల్లు లేని పేదలకు స్థలం కేటాయించి, పక్కా ఇళ్ల నిర్మించుకునేలా ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తుందన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పక్కా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు.

వినియోగదారుల అభిరుచికి తగినట్టు విజయ ఉత్పత్తులు

తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


విజయ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వినియోగదారుల అభిరుచికి తగినట్లుగా కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ) తన ఉత్పత్తులను అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్, సౌత్ జోన్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 50వ పాడి పరిశ్రమ సదస్సును సోమవారం ఏర్పాటు చేసింది. ఈ ఎగ్జిబిషన్ సెంటర్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి ఉత్పత్తులను పరిశీలించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు యూనియన్ పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, పాల ధర గురించి వివరించారు. తెలంగాణా డెప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు సోఢీ పాల్గొన్నారు.

ప్రత్తిపాటి శరత్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు వాయిదా

సాక్షిప్రతినిధి, విజయవాడ: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ పోలీసు కస్టడీ పిటిషన్‌పై ఒకటో అదనపు మెట్రోపాలిటన్ చీఫ్ మేజిస్ట్రేట్ కరీముల్లా తీర్పు వాయిదా వేశారు. అవెక్సా కార్పొరేషన్‌లో ప్రత్తిపాటి శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో డొల్ల కంపెనీలు సృష్టించి నిధుల మళ్లింపు, జీఎస్టీ ఇన్‌పుట్ సబ్సిడీ పొందారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో శరత్ ఇప్పటికే జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. శరత్‌ను తమ కస్టడీకి అప్పగించాలని మాచవరం పోలీసులు కోర్టులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ 1వ ఏసీఎంఎం కోర్టులో సోమవారం సాయంత్రం వాదనలు జరిగాయి. మేజిస్ట్రేట్ కరీముల్లా ఎదుట ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించి ఇప్పటికే విచారణ పూర్తి అయిందని, ఈ దశలో పోలీసు కస్టడీకి నిందితుడిని ఇవ్వాల్సిన అవసరం లేదని డిఫెన్స్ న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు. బోగస్ పత్రాలతో ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందారని చెబుతున్న సమయంలో శరత్ కంపెనీలోకి ఇంకా ప్రవేశించలేదన్నారు. కేవలం 67 రోజులు మాత్రమే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారని వివరించారు. లేని సమయంలో జరిగిన వాటితో నిందితుడికి సంబంధం లేదన్నారు. కాగా, అక్రమాలను వెలికితీయాల్సి ఉందని, నిందితుడు శరత్.. తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో ఆయన పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని, వీటిపై మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉన్నందున పోలీసు కస్టడీకి ఇవ్వాలని ప్రభుత్వం తరఫున హైకోర్టు పీపీ దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు. పలు డొల్ల కంపెనీలను సృష్టించి నిధులు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీనిపై నిందితుడిని పోలీసు కస్టడీలోకి తీసుకుని మరింతగా విచారిస్తే కానీ అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇరు పక్షాల వాదనాలు విన్న మేజిస్ట్రేట్ పోలీ సు కస్టడి పిటిషన్‌పై తీర్పును ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. శరత్ తరఫున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై పోలీసులు అదే రోజు కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన పర్వతరెడ్డి తేజదీప్ రూ. 1,00,001, లక్కిరెడ్డి సుధా కుటుంబం సుచరిత పేరిట రూ. లక్ష విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ పర్యవేక్షకుడు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

పకడ్బందీగా 'ఓపెన్' పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్నాయని, వాటిని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం సాయంత్రం పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బస్సు చోరీ కేసు నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

గన్నవరం: కళాశాల బస్సును చోరీ చేసిన కేసులో నిందితుడికి రెండు నెలలు జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని మర్లపాలెంలో పార్కింగ్ చేసి ఉన్న కేఎల్ యూనివర్సిటీకి చెందిన బస్సు గతేడాది డిసెంబర్‌లో చోరీకి గురైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన అంబాపురం గ్రామానికి చెందిన చింతల రవికుమార్‌ను అరెస్ట్ చేసి, బస్సును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో కొనసాగుతుండగా, నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల సాధారణ జైలుశిక్ష అమలు చేయాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న తెలిపారు.

ఆధార్ కార్డుల్లో తప్పులుండకూడదు


మాట్లాడుతున్న కొడాలి అనురాధ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మంజూరు చేసే ఆధార్ కార్డుల్లో స్పష్టమైన, దోష రహిత సమాచారం పొందుపరచడంపై ప్రతి ఉద్యోగి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గ్రామ, వార్డు సచివాలయ విభాగ కార్యదర్శి కొడాలి అనురాధ అన్నారు. సోమవారం నగరంలో ఐవీ ప్యాలెస్ నందు గ్రామ, వార్డు సచివాలయాలలో అందిస్తున్న ఆధార్ సేవలు మరింత నాణ్యతగా అందించేందుకు జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ ప్రతి పౌరుడికి ఎంతో కీలకమైన గుర్తింపుగా మారిందన్నారు. ఆధార్‌లో వ్యక్తుల పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్, చిరునామా మార్పు, నవజాత శిశువులకు ఆధార్ కార్డు ఇచ్చే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ అధికారి జి. గిరిధర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు ప్రారంభమైన తొలినాళ్లలో కంటే ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఎంతో క్లిష్టతరమైన ఒకప్పటి సాఫ్ట్‌వేర్ కంటే ప్రస్తుతం చాలా తేలికగా ఆపరేట్ చేయగలిగేలా ఉందన్నారు. ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, కొత్త కార్డు డౌన్‌లోడ్ చేసుకునే విధానం, పౌరుల వ్యక్తిగత సమాచార భద్రత వంటి విషయాలలో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సురక్షిత విధానాలను ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలన్నారు. ఉద్యోగి విధులలో నిర్లక్ష్యం లేకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధార్ స్టేట్ కోఆర్డినేటర్ వి. సుందరం, ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ వైవీ సురేష్, 113 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

జాబ్‌ఫెయిర్‌లో 108 మందికి ఉద్యోగాలు


జాబ్‌ఫెయిర్‌లో నియామక పత్రాలు అందుకున్న వారితో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జి సెంటర్(జేకేసీ) ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్‌ఫెయిర్‌లో 108 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ ఫెయిర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ప్రారంభించారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుకుంటుండగానే ఉపాధి కల్పించేందుకు జేకేసీ కృషి చేస్తుందని.. ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన తొమ్మిది ప్రభుత్వ కళాశాలలు, మొవ్వ, పామర్రు, అవనిగడ్డ, బంటుమిల్లి, తిరువూరు, మైలవరం, కంచికచర్ల తదితర కళాశాలకు చెందిన మొత్తం 475 మంది విద్యార్థులు జాబ్‌ఫెయిర్‌కు హాజరయ్యారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత 108 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీసీఈ ఓఎస్‌డీ రమేష్, మీరావళి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఏ ఆశీర్వాదం జేకేసీ నుంచి డి. సురేష్, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు యూబీఐ ఉత్తమ సేవలు


పోరంకిలో ఎక్స్‌పో ప్రారంభిస్తున్న మురళీ పార్థసారథి, శారదమూర్తి

పెనమలూరు: ఖాతాదారులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తమ సేవలు అందిస్తోందని డెప్యూటీ జోనల్ హెడ్స్ మురళీ పార్థసారథి, శారదమూర్తి అన్నారు. పోరంకిలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా రిటైల్ ఎక్స్‌పో-2024ను ప్రారంభించి ప్రసంగించారు. ఖాతాదారులకు తమ బ్యాంకు ఉత్తమ సేవలు అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. గృహ రుణాలు, వాహన రుణాలు అతి తక్కువ వడ్డీతో వెంటనే మంజూరు చేస్తామన్నారు. బిల్డర్లు, కార్ డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్‌టెంట్స్ తమతో సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మచిలీపట్నం రీజనల్ హెడ్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



పెనమలూరు: వణుకూరు గ్రామం జగనన్న కాలనీ లేఅవుట్-3లో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు కాలనలో 30-35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలం వద్దకు పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతి చెందిన మహిళ ఎరుపు, తెలుపు, పసుపు రంగుతో ఉన్న చీర, తెలుపురంగులో జాకెట్, కాళ్లకు పట్టీలతో ఉంది. ఆమె మరణించి 24 గంటలు సమయం అయ్యి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆమె మరణానికి కారణాలు, అలాగే ఆమె వివరాలు కూడా పోలీసులకు తెలియలేదు. ఫొటోలో గుర్తించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రామారావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

7న మహిళలకు ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు హాస్పటల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎంజే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో మహిళలకు ఎముకల సాంద్రత పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం వైద్యులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా తమ హాస్పటల్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకునే మహిళలు 9640133302 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు మార్చి 7 తేదీ నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ టైలరింగ్, డ్రస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, భాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

యూనియన్ బ్యాంక్‌లో మెగా రిటైల్ ఎక్స్‌పో

లబ్బీపేట(విజయవాడతూర్పు): రిటైల్ లోన్ పోర్ట్‌పోలియోను పెంచే లక్ష్యంతో ఎంజీ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిరీస్ బ్రాంచ్‌లో సోమవారం మెగా రిటైల్ ఎక్స్‌పో నిర్వహించారు. డెప్యూటీ జనరల్ మేనేజర్స్ మురళీపార్థసారథి, శారదమూర్తి లాంఛనంగా ప్రారంభించారు. ఆ బ్రాంచి ఆవరణలో నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో పలువురు బిల్డర్లు, కార్ డీలర్లు, పాల్గొని స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు కస్టమర్లు సందర్శించి ఆ బ్యాంకు పథకాలను తెలుసుకున్నారు. గృహ, వాహన, విద్యా రుణాలకు సంబంధించి పలువురికి మంజూరు పత్రాలు అందచేశారు. అంతేకాక బ్యాంకులో వివిధ పథకాలు, సౌకర్యాలపై కూడా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్‌లు ఎస్ శ్రీధర్, హరీష్ బేతా, ఐ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గడప వద్దకే సంక్షేమ పథకాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ బావ వై.సిద్ధార్ద్ అన్నారు. ఆయన సోమవారం 5వ డివిజన్ కొండ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కొండ చివరి ప్రాంతాల వరకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా, అవినీతి, సిఫార్సులకు తావులేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సైతం వేగంగా జరిగాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీని ప్రజలు ఆదరించాలని, రానున్న ఎన్నికల్లో దేవినేని అవినాష్‌ను గెలిపించాలని కోరారు. విజయవాడ తూర్పు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలపాలని తెలిపారు. ఆయన వెంట 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, నాయకులు నీలం కొండ, షకీరా, వరుణ్, రాజ్ తదితరులు ఉన్నారు.

ఎన్టీటీపీఎస్ పురోభివృద్ధికి సహకరించండి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల అసోసియేషన్‌లు, వాటి సభ్యులు సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం సీఈని కలిసి ఆక్సిజన్ మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను సీఈ అభినందించారు. భవిష్యత్‌లో ఇంజినర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపి సంస్థకు పేరు తీసుకురావాలన్నారు. బ్రాంచి కార్యదర్శి కేవీఆర్ చక్రపాణి, కోశాధికారి వెంకటరావు, జ్ఞానేశ్వరరావు, మధుబాబు, రవి, వెంకటరమణ, ప్రశాంతి పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యలకు మోక్షం

- రెండో డివిజన్‌లో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు
- అందుబాటులోకి మెట్ల మార్గాలు, విద్యుత్ దీపాలు
- మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు
- సీసీ రోడ్లు, యూజీడీ పనుల నిర్వహణ



కొండ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన మెట్ల మార్గం



కొండ ప్రాంతంలో యూజీడీ పనులు చేపట్టిన దృశ్యం

ఇది కదా.. అభివృద్ధి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కొండ ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొలువై ఉన్న సమస్యలకు మోక్షం లభించింది. శిథిలమైన మెట్లు అత్యాధునికంగా రూపుదిద్దుకున్నాయి. మంచినీటి సమస్య తొలగిపోయింది. విద్యుత్ లైన్లు ఏర్పాటయ్యాయి. వీధి దీపాలు కూడా ఏర్పాటు చేశారు. సకల సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో కొంత ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు చెప్పినా ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ పట్టించుకోలేదని, అది చేస్తాం..ఇది చేస్తామని మాయ మాటలు చెప్పే వారే కానీ ఏ ఒక్కపని చేసే వారు కాదని స్థానికులు అంటున్నారు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి సమస్యను తీసుకెళ్తే సత్వరమే పరిష్కరిస్తున్నారని, కొండ ప్రాంత ప్రజలు సంతోషంగా ఉంటున్నారంటే ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనులే కారణమని అక్కడి ప్రజలు అంటున్నారు. స్థానిక కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి చొరవ , దేవినేని అవినాష్ కృషితో కొండ ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు పెట్టాయి.

ఆ డివిజన్ కొంత ప్రాంతమే అధికం...

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని రెండో డివిజన్‌లో అత్యధికంగా కొండ ప్రాంతాలే ఉన్నాయి. ఈ డివిజన్ జనాభాలో 80 శాతం అంటే 10 వేల మంది కొండ ప్రాంతాల్లోనే నివశిస్తుంటారు. బెత్తెహేంనగర్, దేవినేనినగర్, కార్మికనగర్, శ్రీలంక కొండ, మాచవరం కొండ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు, వ్యాపారులు, స్వయం ఉపాధిపై జీవనం సాగించేవారు. కూలీలు ఇలా అనేక మంది ఉంటారు. కొండ ప్రాంతాల్లో గతంలో ఎప్పుడో మెట్లు నిర్మాణం చేపట్టారు. అవి శిథిలావస్థకు చేరడంతో మహిళలు, వృద్ధులు కొండపైకి వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొండపై నుంచి రావాలంటే గతంలో చాలా ఇబ్బందులు పడేవారు. మెట్లు సరిగా లేక, మంచినీటి సమస్యలతో ఇబ్బంది పడేవారు.

రూ. 7 కోట్లతో అభివృద్ధి....

కొండ ప్రాంతాల్లో అభివృద్ధి అంటే ఏమిటో ఈ నాలున్నరేళ్లలో చేసి చూపించారు. ఎక్కడ ఎలాంటి సమస్యను ప్రజలు నేతల దృష్టికి తీసుకు వచ్చినా దానిని వెంటనే పరిష్కరించారు. శిథిలమైన మెట్లు మార్గాలను పునర్నిర్మాంచారు. సీసీ రోడ్లు వేసారు. మంచి నీటిపైప్‌లైన్‌లను కొండ చివరి ప్రాంతం వరకూ వేశారు. యూజీడీ కొత్త లైన్లు వేశారు. ఇలా ప్రతి కాలనీలో, ప్రతి ప్రాంతంలో అభివృద్ధి చేసి చూపించారు.

విద్యుత్ లైన్‌లు ఏర్పాటు....

ఒకప్పుడు మారతీనగర్ కార్మికనగర్, శ్రీలంక కాలనీ తదితర ప్రాంతాల్లో నివశించే వారికి విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు. ఆ ప్రాంతంలో అంతా ఎస్టీలు నివశిస్తుంటారు. ఈ విషయాన్ని దేవినేని అవినాష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ప్రస్తుతం విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, వీధి దీపాలు కూడా వచ్చాయి. ఇలా కొండ ప్రాంతాల్లోనే అనేక కాలనీల్లో విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, వీధి దీపాలను కూడా ఏర్పాటు చేశారు.



సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

మా డివిజన్‌లో ఎక్కువగా కొండ ప్రాంతాలు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో మెట్లు శిథిలమవడంతో పాటు, యూజీడీ కూడా సరిగా ఉండేది కాదు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్య కూడా ఉంది. ఆ సమస్యలన్నింటినీ దేవినేని అవినాష్ చొరవతో పరిష్కరించగలిగాం. ఇప్పుడు డివిజన్‌లో ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుంది. ప్రజలు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–అంబడిపూడి నిర్మలకుమారి, కార్పొరేటర్, 2వ డివిజన్



మా ప్రాంతం అభివృద్ధి చెందింది

నాలుగేళ్లలో మా ప్రాంతంలో ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో శిథిలమైన మెట్లుపై నుంచి దిగాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లు. ఇప్పుడు మెట్లు అన్ని పునర్నిర్మించారు. యూజీడీ ఏర్పాటు చేయడమే కాకుండా మంచినీటి సమస్య పరిష్కారమైంది. ఏ సమస్య చెప్పినా కార్పొరేటర్‌తో పాటు, దేవినేని అవినాష్ చొరవ తీసుకుంటున్నాడు. దీంతో అభివృద్ధి అంటే ఏమిటో చూస్తున్నాం.

–పి.అలంకార్‌బాబు, గుణదల

400 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని రామలింగేశ్వరనగర్ 68, 69, 70, 71, సచివాలయాల పరిధిలోని 400 మంది లబ్ధిదారులకు డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలను ఇచ్చినట్టు తెలిపారు. ఎర్రపోతులవారివీధిలో సోమవారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులైన 30 లక్షల మంది నిరుపేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు,శానిటేషన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ విభాగాన్ని ఈవో కెఎస్.రామారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మహా మండపం రెండో అంతస్తుకు చేరుకున్న ఈవో రామారావు అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. భక్తులతో రామారావు మాట్లాడారు. అన్న ప్రసాద నాణ్యత, కూరలు, సిబ్బంది వడ్డించే విధానంపై ఆరా తీశారు. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. షెడ్డు నెం:1, 2 ను తనిఖీ చేసి భక్తులు దేవస్థానానికి అందిస్తున్న విరాళాల గురించి తెలుసుకున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించే విరాళాలకు తగిన రశీదులను ఇవ్వాలని సూచించారు. ఈవో రామారావు అన్న ప్రసాద వితరణ విభాగాన్ని తనిఖీ చేస్తారనే సమాచారం ముందుగానే అక్కడి సిబ్బంది లీకయ్యినట్లు సమాచారం. ఈవో మహా మండపం రెండో అంతస్తుకు చేరుకునే సరికి సిబ్బంది ఎదురు చూస్తూ కనిపించారు.

కొండ ప్రాంతాల్లో మెరుగైన అభివృద్ధి

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి అవినాష్



శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొండ ప్రాంతాల్లో మెరుగైన అభివృద్ధి చేశామని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ శ్రీలంక కొండ ప్రాంతంలో రూ.34 లక్షల వ్యయంతో ప్రారంభమైన అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు పరచటం ద్వారా పేదలంతా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్‌లలో సకల వసతులు నెలకొల్పామని చెప్పారు. తాగునీరు, రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, వంటి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముఖ్యంగా గుణదల, క్రీస్తురాజపురం, మొగల్రాజపురం, చుట్టుగుంట, మాచవరం తదితర కొండ ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, కాలి బాటలు అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కొండ ఎగువ ప్రాంతాలకు సైతం తాగు నీరు చేరే దిశగా వాటర్ సంప్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. మారుతీనగర్ శ్రీలంక కొండ ప్రాంతంలో స్థానికుల సౌకర్యార్థం రూ.34 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని స్పష్టం చేశారు. డ్రైనేజి, మెట్లు, రెయిలింగ్ ఏర్పాటు నిమిత్తం పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని వివరించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యత్యాసం లేని సమాజాన్ని సృష్టించాలి

సామాజిక విశ్లేషకులు పి.దేవి



సెమినార్‌లో మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకులు దేవి

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్త్రీ, పురుష వ్యత్యాసం లేని సమాజాన్ని సృష్టించే బాధ్యత ఆడ పిల్లలదేనని సామాజిక విశ్లేషకులు పి.దేవి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8, 9 ,10 తరగతుల విద్యార్థినులకు ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై అసోసియేషన్ ప్రెసిడెంట్ వెనిగళ్ళ అమ్మాజీ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో ఆడ మగ వ్యత్యాసం లేని చదువు ఉండేలా తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినులపై ఇంటా బయటా జరిగే లైంగిక దాడులను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎన్ని సమస్యలు ఎదురైనా లక్ష్యాలు సాధించడానికి ఏ విధంగా కృషి చేయాలి, బాల్య వివాహాలను ఏవిధంగా తిప్పికొట్టాలో వివరించారు. సేఫ్ ప్రెసిడెంట్ గుళ్ళపల్లి జ్యోత్స్న మాట్లాడుతూ విద్యార్థినుల విద్య ద్వారా మాత్రమే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవినేని జోనికుమారి, అసోసియేషన్ సెక్రటరీ షేక్ షరీపున్నీసా, ట్రెజరర్ ఉషారాణి, కమిటీ సభ్యులు, పలు విద్యా సంస్థల యజమానులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై పట్టుతో ఉద్యోగవకాశాలు



ప్రొఫెసర్ శ్యామ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

గుణదల (విజయవాడ తూర్పు): గణితశాస్త్రంపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత స్థాయి ఉద్యోగావకాశాలు లభిస్తాయని కర్ణాటక మణిపాల్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతి కుంచెం శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో గణిత శాస్త్రం పై జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని తెలిపారు. పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. ముఖ్యంగా గణిత శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. సూత్రాలను అవపోసన పట్టి గణిత సమస్యలను సులువుగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. లయోల కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి..

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించే దిశగా సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని లయోల కళాశాల విజువల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఫాదర్ రాయప్ప అన్నారు. గ్రాస్ కినోస్ 2.0 పేరుతో కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం సోమవారం లయోల కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫాదర్ రాయప్ప మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. విద్య, క్రీడలు, లలిత కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు గ్రూప్ డ్యాన్స్, ర్యాంప్ వాకింగ్, సోలో సింగింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్, అధ్యాపకులు శ్రీధర్, కార్తీక్, లలిత తదితరులు పాల్గొన్నారు.

టీడీఎస్ నిబంధనలపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఐరన్ యార్డ్‌లోగల ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీడీఎస్ నిబంధనలపై వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారి కెఎస్ఎన్ రాము మాట్లాడుతూ టీడీఎస్ నియమ నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం వలన పన్ను మినహాయింపుదారులు వివిధ డిఫాల్ట్‌లకు ప్పాడుతున్నారని తెలిపారు. ఫలితంగా టీడీఎస్ రిటర్న్‌ల ప్రాసెసింగ్‌పై అనవసరమైన డిమాండ్లు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పర్యవసనంగా జరిమానాలు, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలను నివారించేందుకు ప్రతి వ్యాపారస్తుడు టీడీఎస్ నిబంధనల గురించి తప్పనిసరిగా తెలుసుకుని తీరాలన్నారు. టీడీఎస్ విషయంలో ఎటువంటి అనుమానం ఉన్నా తమను సంప్రదిస్తే సహకరిస్తామని చెప్పారు. సదస్సుకు హాజరైన అసోసియేషన్ సభ్యులు తమ సందేహాల గురించి అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రం రమణయ్య, సెక్రటరీ కొనకళ్ల సూర్య శంకర్, ఆడిటర్ రాఘవులు పాల్గొన్నారు.

భద్రత జీవన విధానంలో భాగం కావాలి



ఇబ్రహీంపట్నం: భద్రత అనేది మన జీవన విధానంలో ఒక భాగం కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. సంస్థలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. పరిశ్రమల్లో 85 శాతం ప్రమాదాలు ప్రమాదకర చర్యలు, మానవ తప్పిదాల వలన జరుగుతున్నాయని తెలిపారు. రక్షణ సామగ్రి, యూనిఫాం ధరించాలని అన్నారు. ఏకాగ్రతతో పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు పాటుపడాలని సూచించారు. సంస్థలో ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధమవ్వాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల పట్ల విద్యార్థులు భయాందోళన చెందకుండా, ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమైతే విజయం తథ్యమని సమగ్రశిక్ష అభయాన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రమేష్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పట్టుదల, సమయపాలన, పునశ్చరణ ఎంతో కీలకమని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో మూడవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతి గదులు పరిశీలించారు. ఎంఈఓ బి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని చేపట్టిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించగా వాటిల్లో ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి నాలుగు, ఎస్టేట్ విభాగానికి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, హార్టికల్చర్ ఒకటి, ప్రజారోగ్య శాఖ ఒకటి, యూసీడీ ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ సమస్యలతో స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యలను దిగువ స్థాయి సిబ్బందికి తెలియచేసినా పరిష్కారం కాకపోతేనే ఇక్కడి వరకు వస్తారని, అటువంటి సమస్యలపట్ల అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒకసారి ఇక్కడకి వచ్చిన సమస్య నిర్ణీత సమయంలో పరిష్కారం కాకపోతే వారు మళ్లీ వస్తారని, ఆ విధంగా రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అప్పుడే ప్రజల విశ్వసనీయత, నమ్మకాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఏడీహెచ్ రత్నకొండ రామమోహన్, బయాలజిస్ట్ సూర్యనాయక్, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు వాక్‌థాన్



టిక్కిల్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం వాక్‌థాన్ నిర్వహించింది. బృందావనకాలనీలో ఎ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఎంజీ రోడ్డు వరకూ నిర్వహించిన ఈ వాక్‌థాన్‌లో 200 మంది బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులను కేరీర్ మార్గంలో మరింత గొప్ప బాధ్యతలు చేపట్టేలా పోత్రహించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ బ్యాంక్ డెప్యూటీ జోనల్ హెడ్ ఎ. శారదమూర్తి అన్నారు. అంతేకాక ముద్ర, స్టాండ్ ఆఫ్ ఇండియా, సీజీటీఎంఎస్ఇ వంటి విభిన్న పథకాలకు రుణాలను అందించడం ద్వారా సమాజంలోని మహిళలను వివిధ వ్యాపార వెంచర్‌లను చేపట్టేలా పోత్సహించడంలో తమ బ్యాంక్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బ్యాంక్ అత్యుత్తమ స్కీమ్ యూనియర్ నారీ శక్తిని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ.2 కోట్లు వరకూ కొలేటరల్ లేని ఉచిత రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మరో డెప్యూటీ జోనల్‌హెడ్ మురళీపార్థసారథి మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, జీవితంలోని అన్ని రంగాల్లో మహిళలను చేర్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ వాక్‌థాన్‌లో రీజనల్‌హెడ్ ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాసనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 29వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ బాబాను దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, బాబా మంగళస్నానం, 6.30 గంటలకు దోనేపూడి దుర్గాప్రసాద్ దంపతులచే 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం నిర్వహించారు. తుమ్మలపల్లి హరికృష్ణ దంపతులచే పళ్ల రసంతో స్నపన, విశేష అలంకరణ, విష్ణు సహస్రనామ పారాయణం, జొన్నలగడ్డ సురేష్ దంపతులచే తులసిదళ పూజలు, సాయిరామ్ దంపతులచే వెండి మారేడు దళాలతో విశేష అర్చన చేశారు. అనంతరం అన్నాభిషేకం పూజలు, పాదుకా ఉత్సవం, పతాకావిష్కరణ, భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించారు. మందిర అధ్యక్షుడు అర్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా...

ప్రతి మహిళకు సొంతిల్లు సీఎం జగన్ లక్ష్యం

గృహ నిర్మాణ సంస్థ చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి



షర్మిలా రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎండీ వెంకటరమణారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి మహిళా సొంతిల్లు కలిగి ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ షర్మిలా రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని తమ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. షర్మిలా రెడ్డి అధ్యక్షతన సోమవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో 36వ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5,277 కోట్లతో విద్యుత్ సరఫరా పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 7,942 లే అవుట్‌లలో విద్యుద్దీకరణ పనులు పూర్తవ్వగా.. మిగిలిన లే అవుట్‌లలో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. యుద్ధప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తి చేయడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంస్థ ఎండీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. పేదల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి పనుల వేగాన్ని మరింతగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈడీ చంద్రశేఖర్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా బాధితుల పునరావాసంపై దృష్టి పెట్టాలి

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

సాక్షి, అమరావతి: మానవ అక్రమ రవాణా బాధిత మహిళలకు, బాలలకు కమ్యూనిటీ ఆధారిత పునరావాస కల్పనపై దృష్టి పెట్టాలని, తద్వారా వారికి సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. మానవ అక్రమ రవాణా బాధితులకు పునరావాసంలో ఎదురౌతున్న సవాళ్లపై హెల్ప్, విముక్తి సంస్థల సహకారంతో సోమవారం విజయవాడలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వసతి గృహాల్లో సేవలను మెరుగుపరచడం ద్వారా బాధితులను వీలైనంత త్వరగా వారి కుటుంబాలతో కలపవచ్చని చెప్పారు. అప్పుడే వారి కాళ్ళపై వాళ్ళు నిలబడి స్వతంత్రంగా, గౌరవప్రదంగా జీవిస్తారన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలోని వసతి గృహాల్లోని మానవ అక్రమ రవాణా బాధితులకు మౌలిక సదుపాయలు, కౌన్సెలింగ్, వృత్తి నైపుణ్య శిక్షణను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా బాధితులకు పోలీసు శాఖ చట్టపరమైన సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామ్మోహన్ మాట్లాడుతూ బాధిత మహిళలు, పిల్లలకు నష్టపరిహారం, పునరావాసంపై మరింత శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ, బచపన్ బచావో ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త తిరుపతిరావు తదితరులు మాట్లాడారు.

జనసేన ఆఫీసు ఆవరణలో హెలిప్యాడ్



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ తన రాకపోకల కోసం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మించుకున్నారు. ఆయన ప్రయాణించే హెలికాప్టర్ సోమవారం కొత్తగా నిర్మించిన ఆ హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. ఎన్నికల నేపథ్యంలో జిల్లాల పర్యటనలకు, హైదరాబాద్–విజయవాడ రాకపోకలకు ఆయన ఇటీవల ఎక్కువగా వ్యక్తిగత హెలికాప్టర్‌ను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే.

అనుమానాస్పద స్థితిలో 80 వానరాల మృతి

రొద్దం: శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని చోళేమర్రి గ్రామ సమీపంలో సుమారు 80 వానరాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామ సమీపంలోని కాలనీ వద్ద వానర కళేబరాలను గుట్టగా పడేసి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతం కానందున మీరే ఖననం చేసేయాలని సూచించారు. దీంతో కాలనీ వాసులు జేసీబీతో గుంత తీయించి వానర కళేబరాలను ఖననం చేశారు.



విజయవాడలో గురు లింగమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమాదేవి



గుంటూరు కేవీపీ కాలనీలో సోమయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య

97.38 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా 97.38 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. సోమవారం సాయంత్రం వరకు మొత్తం 64,19,846 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 1,907.02 కోట్లు పంపిణీ చేశారు. మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి



ఒంగోలు కిమ్స్‌లో రాజ్యలక్ష్మికి వితంతు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ నాగేశ్వరరావు

ఆధ్యాత్మిక పర్యాటకం.. ఆర్థిక వృద్ధికి దోహదం

దేశ వ్యాప్తంగా ప్రధాన ఆలయాలకు దేశ విదేశాల నుంచి భక్తులు నిరంతరం పోటెత్తుతున్నారు. ప్రఖ్యాత ఆలయాలు, ప్రదేశాలు లక్షలాది మంది భక్తులు, పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. ఆలయాల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఆర్థిక అభివృద్ధి కూడా వేగంగా జరుగుతోంది. చిన్న చిన్న పరిశ్రమలకు, వృత్తి కళాకారులకు చేతినిండా పనిదొరుకుతోంది. ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ఇటీవలప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కూడా ఆధ్మాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఆధ్మాత్మిక పర్యాటకంతో స్థానిక వ్యాపారులకు పెద్దఎత్తున అవకాశాలు లభిస్తాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తన ప్రసంగంలో కూడా చెప్పారు.

దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఆలయాల సందర్శన

- 14 శాతం పెరిగిన విరాళాల వాటా
- ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాల కల్పన
- 2023-30 మధ్య 16 శాతానికిపైగా వార్షిక వృద్ధి రేటు నమోదు అంచనా
- ఆతిథ్యం, పర్యాటక పరిశ్రమల్లో చిన్న సంస్థలకు ప్రోత్సాహం
- అత్యధికంగా తిరుమలకు ఏటా 2.50 కోట్ల మంది రాక
- ప్రత్యేక రెలిజియస్ టూరిజంను ప్రవేశపెట్టిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా ఏటా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోంది. ప్రఖ్యాత ఆలయాలు, ప్రదేశాలు యాత్రికులను ఆకర్షించడమే కాకుండా ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకంగా మారుతున్నాయి. కోవిడ్ మహమ్మారి తర్వాత భారతీయుల్లో ఆధ్యాత్మిక భావనలు, భక్తి విశ్వాసాలు మరింత బలపడినట్టు గణాంకాలను బట్టి తెలుస్తోంది. 2022లో తీర్థయాత్ర కోసం ప్రయాణాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. దేశంలో ఆధ్యాత్మిక కేంద్రాలకు వచ్చే విరాళాల వాటా 14 శాతం పెరిగింది. ఈ క్రమంలోనే 2023–30 మధ్యకాలంలో దాదాపు 16 శాతానికిపైగా వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)ను అధిగమిస్తోందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా దేశంలోని పురాతన ఆలయాలు, క్షేత్రాలు ఆధ్యాత్మిక పర్యటనలకు స్వర్గధామంగా మారాయి.

విస్తృతంగా ఉద్యోగాల కల్పన

ఆధ్యాత్మిక పర్యటన భక్తితో పాటు దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోంది. ఆధ్యాత్మిక హాట్ స్పాట్స్‌లో భక్తుల అవసరాలను తీర్చేందుకు వీలుగా హోటళ్లు, రెస్టారెంట్లు వస్తున్నాయి. తద్వారా పాకశాస్త్ర కళలు, ఈవెంట్ ప్లానింగ్ వరకు ఆతిథ్య పరిశ్రమలో అనేక ఉద్యోగాలు వస్తున్నాయి. కేంద్ర పర్యాటక మంత్రిత్వ లెక్కల ప్రకారం దేశంలో 2022లో వంద కోట్ల మంది పర్యాటకులు వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఇందులో ఆధ్యాత్మిక ప్రదేశాలు సుమారు రూ. 1.34 లక్షల కోట్లు ఆర్జించాయి. ఎక్కువగా విదేశీలు భారతీయ సంస్కృతి, ఆలయాల చరిత్రను తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతూ ఇక్కడకి వస్తున్నారు. అందుకే ఈ రంగం 2030 నాటికి 14 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, బిహార్, పంజాబ్, ఉత్తరాఖండ్‌లలో ఉద్యోగాల సృష్టికి ఆలయాలు చోదక శక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యటనల్లో ప్రయాణం, ఆతిథ్యం, పర్యాటక పరిశ్రమల్లో చిన్న సంస్థలకు మేలు జరుగుతుంది. యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ (యూఎన్‌డబ్ల్యూటీఓ) సైతం తరచుగా సంస్కృతి అన్వేషణలో భాగంగా ఆధ్యాత్మికతలో కొత్త అనుభవాలు కోరుకునేవారు పెరుగుతున్నట్టు గుర్తించింది.

టాప్‌లో తిరుపతి..



దేశ ఆధ్యాత్మిక పర్యాటకంలో అయోధ్య రామ మందిరం రిలీజియస్ టూరిజంలో కీలక మార్పులు తీసుకొస్తోందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పర్యాటకులకు అదనంగా 5 నుంచి 10 కోట్ల మందికిపైగా భారత్‌ను సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. తాజ్ మహల్ (65 లక్షలు), రోమ్‌లోని వాటికన్ సిటీ (90 లక్షలు), సౌదీ అరేబియాలోని మక్కా (2 కోట్లు) వార్షిక సందర్శకుల సంఖ్యల కంటే అయోధ్య ప్రత్యేకంగా నిలుస్తుందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి దేవాలయం ఏడాదికి 2.50 కోట్ల మంది సందర్శకులతో టాప్‌లో నిలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం 80 లక్షల మంది సందర్శకులతో అలరాలుతోంది. ఇలాంటి ఆలయాలు భారతదేశంలో బలమైన ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి.

ఏపీలోనూ ప్రత్యేక సర్క్యూట్లు

ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక పర్యాటకంలో అతిపెద్ద విభాగంగా ఉంది.ం మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలతో సరికొత్త ఆర్థిక ప్రభావాన్ని కలిగి ఉంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ), దేవదాయశాఖ సంయుక్తంగా 'రిలీజియస్ టూరిజం'ను ప్రవేశపెట్టాయి. తిరుమల, మహానంది, శ్రీశైలం, అహోబిలం, యాగంటి, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం, అరసవల్లి, శ్రీకూర్మం, అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం, విజయవాడ, మంగళగిరి, కోటప్పకొండ, మంత్రాలయం, లేపాక్షి, కదిరి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనలను ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చింది. నిత్యం ఆధ్యాత్మిక పర్యటనలను ప్రోత్సహించేలా భక్తులకు నచ్చిన ఆలయాలను కలుపుతూ ప్యాకేజీలు అందిస్తోంది. తిరుపతిలో భక్తులకు చింతలేని దర్శనాన్ని కల్పించడం కోసం బ్యాకెండ్ సేవలను ప్రారంభించింది. సర్క్యూట్ టూరిజంలో భాగంగా 100కి పైగా ఆలయాల జాబితాను సిద్ధం చేసింది. దశల వారీగా ఆధ్యాత్మిక టూర్లను అందుబాటులోకి తెస్తోంది.

పవన్‌ను ఓడించేది టీడీపీనే

ఇద్దరు గుంటనక్కల మధ్య ప్రయాణం చేస్తున్నాడు: కొడాలి నాని

- 3 శాతం ఉన్న కమ్మ సామాజికవర్గానికి 30 సీట్లిచ్చిన బాబు
- 20 శాతం ఉన్న కాపు సామాజికవర్గానికి 24 సీట్లు మాత్రమే ఇచ్చాడు
- డబ్బున్న వాళ్లకే టీడీపీలో టికెట్లు: పేర్ని నాని
- రాజకీయ వ్యాపారం చేసే బాబు, పవన్ రాష్ట్రానికి అవసరం లేదు: భరత్‌రామ్
- రాజమహేంద్రవరంలో సిద్ధం సభ



సిద్ధం సభలో మాట్లాడుతున్న కొడాలి నాని. చిత్రంలో పేర్నినాని, మార్గాని భరత్

సాక్షి, రాజమహేంద్రవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఓడించేది టీడీపీ నేతలేనని, ఈ విషయంలో జనసేన అభిమానులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, నాదెండ్ల మనోహర్ వంటి గుంటనక్కలతో పవన్ ప్రయాణం చేస్తున్నాడని చెప్పారు. ఎవరు ఎప్పుడు ఎలా పొడుస్తారో చెప్పలేని పరిస్థితి అని అన్నారు. పవన్‌ను కాపాడుకోవాల్సిన అవసరం జనసైనికులు, అభిమానులకు ఉందన్నారు. అది జరగాలంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును పాతాళానికి తొక్కి, టీడీపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో సోమవారం 'ఎన్నికలకు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం సిద్ధం' పేరిట స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో కొడాలి నాని మాట్లాడుతూ, పవన్‌ను ఓడించేందుకు సీఎం వైఎస్ జగన్ వ్యూహం పన్నుతున్నారంటూ బాబు, ఆయన అనుకూల మీడియా డప్పు కొడుతున్నారని.. రాష్ట్రంలోని 175 సీట్లలోనూ వైఎస్సార్ సీపీ గెలవాలన్నది సీఎం జగన్ ఉద్దేశమని, ఓడే వాళ్లలో బాబు, పవన్, లోకేశ్ కూడా ఉండవచ్చని అన్నారు. ఒక్కడే ఎన్నికల బరిలో వస్తే గెలవలేడని భావించిన చంద్రబాబు.. దత్తపుత్రుడు పవన్, డ్రామోజీ, టీవీ–5, పౌడర్ డబ్బా వంటి వారిని వెంట వేసుకుని వస్తున్నాడని ధ్వజమెత్తారు. 3 శాతం ఉన్న కమ్మ సామాజిక వర్గానికి 30 స్థానాలిచ్చిన చంద్రబాబు.. 20 శాతం ఉన్న కాపులకు మాత్రం 24 సీట్లే ఇచ్చాడని దుయ్యబట్టారు. ఇవ్వడానికి చంద్రబాబుకు.. తీసుకునేందుకు పవన్‌కు సిగ్గుండాలని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీలోనే ప్రాధాన్యం: పేర్ని నాని

రాజకీయ చరిత్రలో పార్టీ కార్యకర్తలకు అత్యంత విలువ, ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. కార్యకర్తలు తమకు ఎమ్మెల్యే అభ్యర్థి వద్దంటే మార్చే పరిస్థితులు మరే పార్టీలోనైనా ఉంటాయా? అని ప్రశ్నించారు. టీడీపీలో డబ్బుంటేనే టికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. సంక్షేమానికి డబ్బులు ఇస్తే రాష్ట్రం దివాలా తీస్తుందని విమర్శిస్తున్న చంద్రబాబు.. ఆయన ప్రకటించిన పథకాలకు డబ్బులు ఏవిధంగా ఇస్తారని దుయ్యబట్టారు.

బాబుకు బుద్ధి చెప్పాలి: భరత్‌రామ్

మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రంలో తలదాచుకుంటూ, ఏపీలో రాజకీయ వ్యాపారం చేస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రానికి అవసరం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో దగాకోరు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన నేతల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఒక మహిళా వలంటీర్‌ను ఫోన్ చేసి బెదిరించిన టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుపై ఎంపీ భరత్‌తో పాటు మాజీ మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. ఆడపిల్లకు ఫోన్ చేసి వార్నింగ్ ఇవ్వడం మగతనం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ కిశోర్ ఓ చిల్లర మనిషి

గుడివాడ టౌన్: డబ్బులు తీసుకుని చిల్లర వాగుడు వాగే ప్రశాంత్ కిశోర్ వంటి వారిని పట్టించుకోవలసిన అవసరం లేదని కొడాలి నాని మండిపడ్డారు. గుడివాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్ కిశోర్‌ను ప్రస్తుతం ఏరాజకీయ పార్టీ వ్యూహకర్తగా పెట్టుకోలేదన్నారు. ఐప్యాక్ నుంచి తన్ని తరిమేసిన తర్వాత ఏపార్టీ అతన్ని చేరదీయక పోతే తీసేసిన తహసీల్దార్‌లాగా బిహార్‌లో సొంత పార్టీ పెట్టి ఫలితం లేక డిజాస్టర్ అయిపోయాడన్నారు. చంద్రబాబు లాంటి పనికి మాలిన వ్యక్తుల వద్ద ప్యాకేజ్ తీసుకుని జ్యోతిష్యం చెపుతున్నాడన్నారు. ఐప్యాక్ టీమ్ ఇప్పటికీ వైఎస్సార్‌సీపీకి పని చేస్తోందన్నారు. లగడపాటి రాజగోపాల్‌లాగా జ్యోతిష్యం చెప్పడం ప్రారంభించిన పీకే చెపితే రెండు, మూడు శాతం ఓట్లు మారి తనకు పడతాయనేది చంద్రబాబు ఆశ అని అన్నారు.

ఈనాడు ఒత్తిళ్లతో మహిళా ఉద్యోగి ఆత్మహత్య

- కార్యాలయం నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య
- సోమవారం ఉదయం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త.. అతను కూడా ఈనాడు ఉద్యోగే
- పూర్వాపరాలు చెప్పనివ్వకుండా అడ్డుకున్న సంస్థ సిబ్బంది



సాయికుమారి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఈనాడు దినపత్రిక యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక ఓ మహిళా ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడింది. సంస్థలో గత కొంతకాలంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను, అనుభవిస్తున్న మానసిక క్షోభను భర్తతో పంచుకున్నప్పటికీ.. అవి మరింత తీవ్రతరం కావడంతో తనకిక చావే శరణ్యం అనుకుంది. తాను పనిచేస్తున్న ఈనాడు కార్యాలయ భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు, మృతురాలి భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్ రెవెన్యూ గజ్జి స్వామియాదవ్ కాలనీలో నివాసముండే ఎర్రగొల్ల శ్రీనివాస్, సాయికుమారి (34)కి పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. శ్రీనివాస్ పదిహేనేళ్లుగా, సాయికుమారి తొమ్మిదేళ్లుగా రామోజీ ఫిల్మ్ సిటీలోని ఈనాడు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ఈనాడు కాల్ సెంటర్‌లో పనిచేసే సాయికుమారికి కొంతకాలంగా సంస్థలో ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. దీంతో తరచూ ఇబ్బంది పడుతుండేది. భర్తకు చెప్పుకుని బాధ పడేది.

ఆదివారం సరదాగా గడిపి..

ఈ క్రమంలోనే భార్యకు మానసిక ధైర్యాన్నిచ్చేందుకు శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి తిప్పాడు. ఇద్దరూ సరదాగా గడిపారు. సోమవారం విధుల్లో భాగంగా రామోజీ ఫిల్మ్‌సిటీకి బయలుదేరిన సాయికుమారిని ఉదయం 6 గంటలకు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి జాతీయ రహదారి వద్ద దిగబెట్టి ఇంటికి వచ్చాడు. అయితే 9 గంటల సమయంలో ఈనాడు హెచ్‌ఆర్ విభాగం నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. సాయికుమారి నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి చనిపోయిందని చెప్పడంతో హుటాహుటిన ఫిల్మ్‌సిటీకి వెళ్లాడు. అప్పటికే తలకు తీవ్ర గాయమైన సాయికుమారి మృతి చెందింది. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఈనాడు సిబ్బంది అత్యుత్సాహం

ఈనాడు సంస్థ ఒత్తిళ్ల కారణంగా తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పీఎస్‌లో ఉన్న శ్రీనివాస్ నుంచి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించారు. అయితే అతని చుట్టూ కంచెలా ఉన్న ఈనాడు సిబ్బంది అడ్డుకున్నారు. తన భార్య మృతికి దారితీసిన పరిస్థితులను మీడియాకు వివరించేందుకు సిద్ధమవుతున్న శ్రీనివాస్‌ను బలవంతంగా తమ కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు.

ప్రభుత్వ సాయంతో ప్రగతి

- మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి
- సంక్షేమ పథకాల వినియోగంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మాటామంతి



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకుంటూ పట్టణ పేద మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ప్రగతి సాధిస్తున్నారని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి చెప్పారు. పట్టణ పేద మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వినియోగంపై సోమవారం ఆమె వర్చువల్‌గా మాటామంతి నిర్వహించారు. స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణతో పాటు మెప్మా ద్వారా ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలతో జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు తదితరాలు ఏర్పాటు చేయించి స్వయం ఉపాధి వైపు నడిపించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ఈ–కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి 142 మహిళా ప్రగతి యూనిట్లు స్థాపించారు. సుమారు 3 వేల మందికి ప్రముఖ బ్యూటీ సంస్థ అనూస్ శాఖల్లో శిక్షణ ఇప్పించారు. రూ.50 వేలలోపు చొప్పున పెట్టుబడితో 110 యూఎల్‌పీల్లో 5,638 మహిళా సమృద్ధి యూనిట్ల ఏర్పాటుకు రూ.28 కోట్లు అందించారు. మెప్మా పరిధిలో దాదాపు 24 లక్షల మంది సభ్యులు ఉండగా.. గత ఐదేళ్లలో 13.50 లక్షల మందికి ప్రత్యక్షంగా స్వయం ఉపాధి కల్పించారు. ఈ క్రమంలో పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులతో మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి వర్చువల్ విధానంలో మాట్లాడి వారు సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు గతంలో ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని సొంత అవసరాలకు ఉపయోగించుకునేవారని విజయలక్ష్మి చెప్పారు. ఇప్పుడు తామే వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపిస్తున్నామని వివరించారు. పెద్దగా చదువుకోని మహిళలు సైతం ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని తెలిపారు.

శంషాబాద్‌లో రూ.6 కోట్ల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. విదేశాల నుంచి పలువురు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన 13.65 కిలోల బంగారాన్ని సోమవారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం విలువ రూ.6.03 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమ లగేజీ సూట్‌కేసులో హార్డ్‌వేర్ పరికరాలు, కడుపులో, మెర్క్యూరీ కోటెడ్ చైన్లలో బంగారం దాచి తీసుకొస్తూ పట్టుబడ్డారు. మొత్తం 28 సూట్‌కేసుల్లో ఈ బంగారం లభించగా.. ముగ్గురిని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

క్రిష్.. పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోసం దర్శకుడు క్రిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ఆయన ఉపసంహరించుకున్నారు. పోలీసులు క్రిష్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చడం తెలిసిందే. దీంతో ఈ కేసులో ముందస్తు బెయిల్, సీఆర్‌పీసీ 41ఏ నోటీసులు ఇచ్చిన తర్వాతే విచారణ చేపట్టేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ క్రిష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి సోమవారం విచారణ చేపట్టారు. కేసులో విచారణకు హాజరుకావాలని పోలీసులు క్రిష్‌కు 41ఏ నోటీసులు జారీ చేశారు. దీంతో క్రిష్.. తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ.. వాదనలను ముగించారు.

శంషాబాద్ విమానాశ్రయానికి జాతీయ అవార్డు

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లో జీఎంఆర్ నిర్వహిస్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 'ఏఎస్ఆర్ఈఎక్స్' హాల్ ఆఫ్ ఫేమ్ జాతీయ అవార్డు అందుకుంది. ఎనర్జీ ఎఫిషియన్సీ, సస్టెయినబిలిటీ కోసం కమర్షియల్ బిల్డింగ్ విభాగంలో దేశంలోని అగ్రశ్రేణి కార్పొరేట్ కార్యాలయాలు, భవనాలను అధిగమించి జీహెచ్ఐఏఎల్ మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవల ఢిల్లీలో ఈ పోటీల విజేతను ప్రకటించారు. శాస్త్రవేత్తలు, వాస్తు శిల్పులు, సాంకేతిక నిపుణులతో కూడిన విశిష్ట జ్యూరీతో మూల్యాంకనం చేసి శక్తి సామర్థ్యం, స్థిరత్వ కార్యక్రమాలకు అసాధారణమైన నిబద్ధతను ప్రదర్శించే సంస్థలను ఈ పోటీల్లో గుర్తిస్తారు.

పొత్తులో గందరగోళం

సీట్లు పంచుకున్న టీడీపీ, జనసేన.. స్పష్టత ఇవ్వని బీజేపీ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తుపై గందరగోళం నెలకొంది. ఇప్పటికే సీట్లు పంచుకున్న చంద్రబాబు, పవన్.. బీజేపీ కూడా తమతో కలిసి వస్తుందని చాలా రోజుల నుంచి ప్రచారం చేస్తున్నారు. అయితే, బీజేపీలో తాజా రాజకీయ పరిణామాలు చూస్తుంటే పొత్తుపై ఇంకా అస్పష్టతే కొనసాగుతోంది. ఇదిలా ఉంటే ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చిన రోజునే పవన్‌కళ్యాణ్ అక్కడి నుంచి హడావుడిగా బయలుదేరి మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి చేరుకోవడంపై విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే పొత్తులపై అస్పష్టత ఉన్న నేపథ్యంలో.. హైదరాబాద్‌కు వచ్చిన మోదీతో పొత్తులపై చర్చించే అవకాశం ఉన్నా, పవన్ ఎందుకు ఆ ప్రయత్నం చేయకుండా మంగళగిరికి వచ్చారనే సందేహాన్ని రాజకీయ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు.. జనసేన ఎన్డీఏలో బీజేపీతో మిత్రపక్షంగా కొనసాగుతూనే ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీతో ఇప్పటికే సీట్లు సర్దుబాటు చేసుకుంది. ఒకవేళ, బీజేపీ ఈ రెండు పార్టీల పొత్తుతో కలిసి రాని పక్షంలో పవన్ ఎన్డీఏ నుంచి బయటకు రావడానికి పూర్తి సంసిద్ధతతో ఉన్నారనే అనుమానాలు విశ్లేషకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

ఐదేళ్లలో ప్రజల జీవితాల్లో మార్పులు

'పాలనలో కొత్త పంథా.. మన కోసం.. మన ప్రభుత్వం'పై సదస్సులో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం

- అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు మాత్రమే కాదు..
- జీవన ప్రమాణాలు పెంచడం, శాశ్వత అభివృద్ధి అందించడం కూడా
- ల్యాండ్ టైట్లింగ్ చట్టం దేశంలోనే అతిగొప్ప సంస్కరణ
- నిజమైన అభివృద్ధి చెయ్యాలంటే నాయకుడికి ధైర్యం కావాలి
- ఆ ధైర్యం సీఎం జగన్‌లో ఉంది


మాట్లాడుతున్న సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యడమంటే రోడ్లు వెయ్యడం, పెద్దపెద్ద భవనాలు నిర్మించడం మాత్రమే కాదనీ.. ప్రజల జీవన ప్రమాణాల్ని మార్చి.. వారి జీవితాల్లో మౌలిక మార్పులు తీసుకురావడమని సీఎం ముఖ్య సలహాదారు, మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం అన్నారు. పాలనలో కొత్త పంథా.. మన కోసం మన ప్రభుత్వం అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం టీఎల్ఎన్ సభాహాల్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజేయ కల్లం మాట్లాడుతూ ఏమన్నారంటే..

డబ్బులిస్తే రోడ్లు, భవనాలను కాంట్రాక్టర్లు కట్టి ఇచ్చేస్తారు. దానివల్ల మాత్రమే అభివృద్ధి జరిగిందని అనుకోవడం కల్ల. ప్రజల జీవన ప్రమాణాలు పెంచకుండా ఏం చేసినా వృథా ప్రయాసే. ఇదే గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టిసారించి శాశ్వత అభివృద్ధి అందించారు. దీన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంది. గత ప్రభుత్వాలు ఇందులో వీసమెత్తైనా చెయ్యలేకపోయాయి.

అభివృద్ధి చెయ్యాలంటే ధైర్యం కావాలి..

ఈ ప్రభుత్వం మంచిది.. ఈ ప్రభుత్వం చెడ్డది అని అంటాం. ప్రభుత్వాలు చేసే పనులను బట్టి దీన్ని నిర్ణయిస్తాం. నిజమైన అభివృద్ధి చెయ్యాలంటే ధైర్యం కావాలి. అది గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దగ్గర, ఇప్పుడు అంతకు రెట్టింపు ధైర్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర చూస్తున్నాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు శాశ్వతంగా నిలిచిపోతున్నాయి. పెట్టుబడులు, పరిశ్రమలు రాలేదని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం అవాస్తవం. ఎందుకంటే.. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో దేశంలోనే అత్యధికంగా రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులతో ఎంఓయూలు చేసుకున్నాం. ఇందులో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ వర్క్ జరిగాయి. పోర్టుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లు కమిషనింగ్‌కి సిద్ధంగా ఉన్నాయి. ఇన్‌ఫ్రా, ఇండస్ట్రీస్‌లో పెట్టుబడులు ఇంతగా ఏ ప్రభుత్వంలోనూ రాలేదు.

మార్పులు తీసుకొచ్చే ప్రభుత్వమే కావాలి..

'విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, పరిశ్రమలు, పెట్టుబడులు.. ఇలా ప్రతి విభాగంలోనూ సమూల మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వాలే కావాలి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది గొప్ప సంస్కరణ. దేశంలోనే మొట్టమొదటిగా ఏపీ ప్రభుత్వం దీన్ని చేపట్టింది. ఈ చట్టం ఎలా అమలుచేస్తారనే అంశంపై అన్ని రాష్ట్రాలూ ఏపీ వైపు చూస్తున్నాయి. శాశ్వత పట్టాలు అందించడమనేది గొప్ప సంస్కరణ. దీనివల్ల భవిష్యత్తులో భూ తగాదాలకు, వివాదాలకు, హత్యలకు ఆస్కారం ఉండదు. ఇవన్నీ చేస్తూ.. పారదర్శకంగా అమలుచేస్తున్న ప్రభుత్వాన్నే ఎన్నుకుంటే రాష్ట్రం మరింత ముందుకెళ్తుంది. అని అజేయ కల్లం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావంతులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబు డైరెక్షన్‌లోనే పీకే వ్యాఖ్యలు!

శనివారం చంద్రబాబుతో మూడుగంటలు సమావేశం

బాబు చెప్పిన మేరకే ఆదివారం వైఎస్సార్‌సీపీపై పీకే వ్యతిరేక వ్యాఖ్యలు

- ఏ సర్వేలు చేయడంలేదంటూనే వైఎస్సార్‌సీపీపై విషం
- బాబు మేలు కోరే ఇలా మాట్లాడారంటున్న విశ్లేషకులు
- సోమవారమూ బాబుతో పీకే రెండున్నర గంటలపాటు భేటీ
- ఆ భేటీ తర్వాతే అనంతపురం జిల్లా సభకు చంద్రబాబు



సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్ (పీకే) ఆదివారం హైదరాబాద్‌లోని ఓ సదస్సులో ఏపీలో వైఎస్సార్‌సీపీపై చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు ప్రేరేపితమని బయటపడిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబుతో ముందుగా సమావేశమై, ఆయన డైరెక్షన్‌లోనే ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తేటతెల్లమైంది. హైదరాబాద్ నగరంలోని ఖరీదైన హోటల్‌లో బస చేసి, గంటల తరబడి చంద్రబాబుతో భేటీలు జరుపుతున్న ప్రశాంత్ కిషోర్.. బాబు వ్యూహంలో భాగంగానే వైఎస్సార్‌సీపీపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో ఓ ఆంగ్ల పత్రిక సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ప్రశాంత్ కిషోర్ శనివారం మూడు గంటలపాటు చంద్రబాబుతో సమావేశమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సమావేశంలో చంద్రబాబు కోరిన మేరకు ఆదివారం సదస్సులో ఏపీ ఎన్నికలపై వ్యాఖ్యలు చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. తాను సర్వేలు చేయడంలేదని, ఏ రాజకీయ పార్టీకీ సలహాలు ఇవ్వడంలేదంటూనే, పీకే ఒక పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎలాంటి సర్వేలు చేయకుండా, గణాంకాల్లేకుండానే ఓ పార్టీ ఓడిపోతుందని చెప్పడం కచ్చితంగా రాజకీయ ప్రేరేపితమేనని విశ్లేషకులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటం, టీడీపీ ఓటమి ఖాయమని తేలడంతో ప్రజల్లో గందరగోళం సృష్టించాలన్న ఉద్దేశంతోనే పీకేతో చంద్రబాబు ఆ వ్యాఖ్యలు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ వీరు వైసీపీపై ఇటువంటి విష ప్రచారాన్ని మరింతగా చేయాలని చంద్రబాబు, పీకే నిర్ణయించినట్లు చెబుతున్నారు.

సోమవారమూ బాబుతో పీకే భేటీ

సోమవారం ఉదయం కూడా ప్రశాంత్ కిషోర్ రెండున్నర గంటలపాటు చంద్రబాబుతో భేటీ అయ్యారు. టీడీపీ ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ (ఒకప్పుడు పీకే టీంలో సభ్యుడు), లోకేశ్ సన్నిహితుడు కిలారి రాజేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశం ముగిసేవరకు సోమవారం ఉదయం చంద్రబాబు మరెవరికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని తెలిసింది. పీకేతో భేటీ తర్వాతే చంద్రబాబు అనంతపురం జిల్లాలో టీడీపీ సమావేశానికి వెళ్లారని సమాచారం. సోమవారం సాయంత్రం ప్రశాంత్ కిషోర్ పాట్నా వెళ్లినట్లు తెలిసింది.

నాటి పాలన హేళన.. నేటి పాలన లాలన

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలు ఎగువ మధ్యతరగతి స్థాయికి చేరారు

- పల్లెల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తెచ్చారు
- సీఎం జగన్ వల్ల స్వచ్ఛంద సంస్థలకు పని తగ్గిపోయింది
- ప్రభుత్వమే అతిపెద్ద సేవాసంస్థగా మారి పేదలను ఆదుకుంటోంది
- 'జగన్ పాలన– సమాజ సేవకుల స్పందన' సదస్సులో వక్తలు


సీఎం వైఎస్ జగన్ పాలనలో వివిధ రంగాలకు చేసిన ఖర్చు, సాధించిన ప్రగతి వివరాలు ప్రదర్శిస్తున్న కృష్ణంరాజు, మేడపాటి వెంకట్ తదితరులు

సాక్షి, అమరావతి: ప్రజలకు సుస్థిర సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ నాయకుడి స్థాయి నుంచి రాజనీతివేత్త స్థాయికి ఎదుగుతున్నారని పలువురు సామాజిక సేవా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. నాటి చంద్రబాబు పాలనలో పేదల బతుకులు హేళనకు గురికాగా, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని అక్కున చేర్చుకుని లాలిస్తోందన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్, మారుతి మహిళా సొసైటీ ఆధ్వర్యంలో 'జగన్ పాలన– సమాజ సేవకుల స్పందన' సదస్సు విజయవాడలో సోమవారం జరిగింది. గాంధీజీ కలలు కన్న సర్వోదయ మార్గాన్ని అనుసరిస్తూ సీఎం వైఎస్ జగన్ పల్లెల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు కొనియాడారు. నిరుపేదలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలతో ఎగువ మధ్యతరగతి ఆదాయ వర్గానికి చేరుకున్నారని వరల్డ్ రూరల్ ఫోరం సంస్థ పేర్కొందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వమే అతిపెద్ద సేవాసంస్థగా మారి పేదలను ఆదుకుంటోందన్నారు. తద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా 773 రకాల పౌరసేవలందిస్తున్న ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అంతేకాకుండా ఈ ఐదేళ్లలో సుమారు 12 కోట్ల అర్జీలను పౌరసేవా కేంద్రాల ద్వారా పరిష్కరించి జాతీయ రికార్డు నెలకొల్పిందని చెప్పారు.

మహిళలకు అవసరమైనవన్నీ చేస్తున్న ప్రభుత్వం

మారుతి మహిళా సొసైటీ అధ్యక్షురాలు సునీత లక్కంరాజు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలనలో స్వచ్ఛంద సంస్థల అవసరం బాగా తగ్గిందన్నారు. ప్రభుత్వమే రైతులు, మహిళల కోసం అవసరమైనవన్నీ చేస్తోందని చెప్పారు. జగన్ చేస్తున్న మేలును ప్రజలు మర్చిపోరన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రాఫిక్స్ చూపించి కాలం గడిపేశారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం చేయలేనివన్నింటినీ ఇప్పుడు ప్రభుత్వం చేసి చూపిస్తోందన్నారు. రాష్ట్రంలో 16.50 లక్షల మంది ప్రావిడెంట్ ఫండ్ లబ్ధిదారులు, 18 లక్షల మంది ఆదాయపన్ను చెల్లింపుదారులు పెరిగారని గుర్తు చేశారు. పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని అందరూ తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాల్మన్ పాల్, సలీంమాలిక్, జయప్రకాశ్, సుజయ్ ప్రకాశ్‌రాజు, ఈదా శామ్యూల్ రెడ్డి, డాక్టర్ పి. మాన్‌సింగ్, టి.మంగయ్య, జానకీదేవి, పార్వతి, రంగమ్మ, జయకర్, విజయ, లింగాల రాజేష్, భండారి కోటయ్య, విశ్రాంత ఎస్పీ డాక్టర్ చెన్నంశెట్టి చక్రపాణి, శ్రీనివాసరావు, సలీమ్ మాలిక్, గరిమెళ్ల వెంకట సీత, జంపన శ్రీలక్ష్మి, శారా రాణి, చిరంజీవి, కంది పున్నారెడ్డి, హరేకృష్ణ మూమెంట్ ప్రెసిడెంట్ వంశీధర దాస (వీడియో సందేశం) తదితరులు తమ అభిప్రాయాలను వివరించారు.

ప్రశాంత్ కిషోర్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్

మండిపడ్డ సామాజిక కార్యకర్తలు

సాక్షి, అమరావతి: బీహార్ జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పెయిడ్ ఆర్టిస్ట్‌గా మారారని పలువురు సామాజిక కార్యకర్తలు విమర్శించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఇదే విషయాన్ని వెల్లడించారని, తమ పార్టీ తరఫున పనిచేయడానికి అతను రూ.500 కోట్లు అడిగినట్లు నితీష్ బయటపెట్టారని వారు గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో ఓడిపోతుందంటూ ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా సత్యదూరమని, ప్రశాంత్ కేవలం చంద్రబాబు వదిలిన బాణంలా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక ఓ హోటల్‌లో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు, మానవతా సంస్థ ప్రతినిధి సలీం మాలిక్, మారుతీ మహిళా సొసైటీ అధ్యక్షురాలు లఖంరాజు సునీత, రిటైర్డ్ ఎస్పీ డాక్టర్ చన్నంశెట్టి చక్రపాణి, సామాజిక కార్యకర్త ఈదా శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు జమ్మూ కశ్మీర్ నుంచి ఫరూఖ్ అబ్దుల్లాను చంద్రబాబు పిలిపించి జగన్‌పై ఆరోపణలు చేయించారని చెప్పారు. ప్రశాంత్‌కిషోర్ సలహాలపై పనిచేసిన కాంగ్రెస్ 2017లో ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో, 2022లో గోవాలో తృణమూల్ కాంగ్రెస్ కూడా ఘోరంగా ఓడిపోయాయన్నారు. 2023లో 4 రాష్ట్రాల ఫలితాలపై ఆయన అంచనాలన్నీ తలకిందులయ్యాయని, తెలంగాణలో బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పారని కానీ అక్కడ కాంగ్రెస్ గెలిచిందని, చత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పగా బీజేపీ గెలిచిందని వివరించారు. పార్టీ పెట్టి ఏడాదిగా పాదయాత్రలు చేస్తున్నా ప్రజలు ఆయనను పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ పార్టీ విజయం సాధిస్తుందా? అని ఇండియాటుడే ప్రతినిధి ప్రశ్నిస్తే.. జనం గెలుస్తారని సమాధానం చెప్పాడే తప్ప తన పార్టీ విజయం సాధిస్తుందని చెప్పలేకపోయాడన్నారు. సొంతపార్టీ విజయావకాశాలనే అంచనా వేయలేని ప్రశాంత్‌కిషోర్ వైఎస్ జగన్ విజయావకాశాలను ఎలా అంచనా వేయగలుగుతారని వారు ప్రశ్నించారు.

సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి ఔట్!

- రోజుకో కొత్త వ్యక్తి పేరుతో సర్వే చేస్తున్న టీడీపీ
- ఇటీవల వినిపించిన ఆనం, పెళ్లకూరు పేర్లు
- తాజాగా రూప్‌కుమార్ యాదవ్ పేరుతో సర్వే
- ఆయనకు సర్వేపల్లి సీటు ఖరారు చేయించేలా వేమిరెడ్డి ప్రయత్నం
- కంగుతిన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వర్గం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ సీనియర్ నేత, మూడు దశాబ్దాలుగా జిల్లా పార్టీలో అన్నీ తానై వ్యవహరించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా ఉంది. ఓ వైపు ఆయనకు సొంత నియోజకవర్గం నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో ప్రజల్లో, కేడర్‌లో పూర్తి వ్యతిరేకత ఉండటంతో ఈసారి సీటు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. మరోపక్క ఇతర నేతల పేర్లతో పార్టీ అధిష్టానం సర్వేలు చేస్తుండటంతో సోమిరెడ్డి వర్గం కంగుతింది. మరోపక్క ఇటీవల టీడీపీలోకి వచ్చిన వేమిరెడ్డి ఇప్పుడు జిల్లా పార్టీ ఆధిపత్యాన్ని చేజిక్కించుకున్నారు. దీంతో పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ గతంలో జిల్లాలో ఎంతోమందికి పార్టీ బి-ఫాంలు ఇప్పించిన ఆయన.. ఇప్పుడు తన సీటు కోసం పార్టీ అధినేత వద్ద మోకరిల్లాల్సిన పరిస్థితి వచ్చింది.

తెరపైకి రోజుకో కొత్త పేరు

ఇప్పటికే నాలుగు దఫాలు వరుస ఓటములు ఎదుర్కొన్న సోమిరెడ్డికి ఈసారీ అదే పరిస్థితి అని సర్వేలు తేల్చి చెప్పాయి. దీంతో సర్వేపల్లిలో టీడీపీ కొత్త అభ్యర్థి కోసం వెదుకుతోంది. రోజుకో వ్యక్తి పేరుతో ఐవీఆర్ఎస్ సర్వేలు చేస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేరుతో సర్వే చేశారు. ఆయన సర్వేపల్లి సీటు వద్దని చెప్పడంతో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేరుతో మరోసారి సర్వే చేశారు. నాలుగు రోజుల క్రితం టీడీపీ కండువా కప్పుకున్న నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పేరుతో తాజాగా సర్వే చేస్తున్నారు.

దెబ్బకు దెబ్బ కొట్టిన వేమిరెడ్డి

గత టీడీపీ ప్రభుత్వంలో రాజ్యసభ సీటు కోసం చంద్రబాబుతో ఒప్పందం చేసుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చేరిక లాంఛనమే అనుకున్న తరుణంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అడ్డుకున్నారు. వేమిరెడ్డి వస్తే తన పెత్తనానికి అడ్డుకట్టపడుతుందన్న భావనతో వేమిరెడ్డి పార్టీలోకి చేరకుండా చేయగలిగారు. అది మనసులో ఉంచుకున్న వేమిరెడ్డి ఈసారి సోమిరెడ్డికి సర్వేపల్లి సీటు దక్కకుండా చేయగలిగారనే ప్రచారం ఉంది. వేమిరెడ్డి వ్యూహాత్మకంగా రూప్‌కుమార్‌యాదవ్ పేరు తెరపైకి తెచ్చి సోమిరెడ్డికి తన సత్తా చూపించారన్న ప్రచారం జరుగుతోంది. రూప్‌కుమార్‌కు సీటిస్తే జిల్లాలో బీసీకి కూడా సీటు ఇచ్చినట్లవుతుందని వేమిరెడ్డి చంద్రబాబుకు తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చంద్రబాబు కూడా వెంటనే రూప్‌కుమార్ పేరుతో సర్వే చేయించినట్లు తెలుస్తోంది. అంతే కాదు.. టీడీపీకి సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు పెత్తనం చెలాయించిన సోమిరెడ్డి స్థానాన్ని ఆర్థికంగా స్థితిమంతుడైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దక్కించుకున్నారు. దీంతో జిల్లా టీడీపీలో సోమిరెడ్డి హవా తగ్గిపోయింది. దీంతో ఆయనకు ఇటీవల అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నాయి. ఇటీవల వేమిరెడ్డి చేరిక కోసం నెల్లూరుకు వచ్చిన బాబు తన వాహనంలో సోమిరెడ్డికి చోటివ్వకపోవడంతో పార్టీలో ఆయన పరపతి పూర్తిగా తగ్గిపోయింది.

జవహర్‌కు ఝలక్?

- మాజీ మంత్రి ఆశలపై నీళ్లు చల్లిన టీడీపీ అధిష్టానం
- ఐవీఆర్ఎస్‌లో గోపాలపురం మాజీ ఎమ్మెల్యే పేరు ఒక్కటే ప్రస్తావన


జవహర్


మద్దిపాటి వెంకట్రాజు


వెంకటేశ్వరరావు

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆశలపై ఆ పార్టీ అధిష్టానం నీళ్లు చల్లింది. కొవ్వూరు టికెట్ తనకే దక్కుతుందనుకున్న ఆయనకు ఆశాభంగమే ఎదురవుతోంది. టీడీపీ శ్రేణుల నుంచి అధిష్టానం సోమవారం ఉదయం ఐవీఆర్ఎస్ విధానం ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టింది. కొవ్వూరు టీడీపీ అభ్యర్థిగా గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అయితే బాగుంటుందని భావిస్తే 1, నోటా అయితే 0 నొక్కండి అనే ఫోన్ సందేశం టీడీపీ శ్రేణుల్ని గందరగోళంలో పడవేసింది. గతంలో ఐవీఆర్ఎస్ విధానంలో ముగ్గురి పేర్లు ప్రస్తావించినప్పటికీ ప్రస్తుతం వెంకటేశ్వరరావు ఒక్క పేరు పైనే అభిప్రాయ సేకరణ చేయడం గమనార్హం. గత ఎన్నికల్లో తిరువూరు నుంచి పోటీ చేసిన జవహర్ ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం అక్కడ టీడీపీ అభ్యర్థిగా కొటికలపూడి శ్రీనివాసరావును అధిష్టానం ప్రకటించింది. దీంతో జవహర్‌కు ఈసారి ఇటు గోపాలపురం, అటు తిరువూరు దారులు మూసుకుపోయినట్లేనని చెప్పవచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలున్నాయి. చింతలపూడి అభ్యర్థిని ఇటీవలే ప్రకటించారు. కొవ్వూరులో ముప్పిడి పేరు దాదాపు ఖరారు చేస్తారన్న ప్రచారం సాగుతోంది. గోపాలపురం ఇన్‌చార్జిగా వెంకట్రాజును గతంలోనే ప్రకటించారు. వీరిలో గోపాలపురంలో వెంకట్రాజు, చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్, కొవ్వూరులో పరిశీలనలో ఉన్న వెంకటేశ్వరరావు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారే. వీరిలో గోపాలపురంలో వెంకట్రాజును మార్చి మాల సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని రంగంలోకి దింపాలని టీడీపీ యోచిస్తున్నట్లు చెబుతున్నారు. కొవ్వూరులో జవహర్‌కు తప్ప వేరే ఎవరికిచ్చినా ఓకే అంటూ పెండ్యాల అచ్చిబాబు వర్గీయులు తమ వైఖరిని అధిష్టానానికి స్పష్టం చేశారు. ఇన్నాళ్లూ జవహర్‌ను ఎక్కడో ఒకచోట సర్దుబాటు చేస్తారని అందరూ భావించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ, మాజీ మంత్రిగా పని చేసిన ఆయన రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

దొంగపట్టాలైతే రాజీనామా చేస్తా..

- ఒరిజినల్ అయితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా?
- దామచర్లకు బాలినేని సవాల్


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

ఒంగోలు సబర్బన్: పేదలకు ఇస్తున్న ఇళ్ల పట్టాలు దొంగపట్టాలని తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేస్తున్న ప్రచారంపై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫైర్ అయ్యారు. 'మేము పంపిణీ చేస్తున్నవి దొంగ పట్టాలు అయితే నేను రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయను, అవి ఒరిజినల్ అయితే నువ్వు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటావా' అంటూ ఆయన సవాల్ విసిరారు. ఒంగోలు నగరంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. తొలి రోజు నగరంలోని ఐదు డివిజన్లలో బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం జగన్ పేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు, పచ్చ పత్రికలు అసత్య ప్రచారానికి తెరతీశాయని మండిపడ్డారు. తొలుత యరజర్లలో 25 వేల మందికి ఒకేచోట పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిద్దామనుకుంటే దామచర్ల తన అనుచరుల చేత హైకోర్టులో కేసు వేయించి ఆపేయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళితే రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి అయినా సరే ఇళ్ల పట్టాలు ఇద్దామన్నారని తెలిపారు. దాంతో 436 ఎకరాలు కొనుగోలు చేసి తొలుత కొంత మొత్తాన్ని రైతులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మిగతా నిధులు రావడం కొంత ఆలస్యమయ్యే సరికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదని దామచర్ల జనార్దన్‌తో పాటు టీడీపీ నాయకులు అసత్య ప్రచారం మొదలు పెట్టారన్నారు. పట్టాలు సిద్ధం చేసి పంపిణీ కోసం సమాయత్తం అవుతుంటే అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నారని మళ్లీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చింతల వద్ద టిడ్కో ఇళ్లు నగరంలో కట్టావా అని దామచర్లను బాలినేని నిలదీశారు.

తంబళ్లపల్లె అభ్యర్థిని మార్చకుంటే

టీడీపీని ఓడిస్తాం

- నల్లబ్యాడ్జీలతో కొండా వర్గీయుల మౌనదీక్ష.. పెద్దమండ్యంలో శంకర్ వర్గీయుల ర్యాలీ
- తిరగబడుతున్న తమ్ముళ్లు


బి.కొత్తకోటలో టీడీపీ శ్రేణుల మౌనదీక్ష

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని మార్చకుంటే ఆ పార్టీని ఘోరంగా ఓడిస్తామని మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, కొండా నరేంద్ర వర్గీయులు ముక్తకంఠంతో నినదించారు. సోమవారం నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దమండ్యంలో జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా రోడ్డెక్కారు. అభ్యర్థిని మార్చకుంటే టీడీపీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. పెద్దమండ్యంలో టీడీపీ మండల కన్వీనర్ జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌కు న్యాయం చేయాలన్న బ్యానర్‌తో పార్టీ శ్రేణులు ప్రదర్శన నిర్వహించాయి. బస్టాండ్ కూడలి నుంచి కుషావతి నది వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సర్వేలో ఎక్కువ శాతం మద్దతు వచ్చిన శంకర్‌ను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. పార్టీ క్యాడర్‌కు పరిచయం లేని వ్యక్తిని ఎన్నికల్లో పోటీ చేయించడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే బి.కొత్తకోటలోని కళ్యాణమండపంలో టీడీపీ నాయకుడు కొండా నరేంద్ర వర్గీయులు మౌనంగా నిరసన దీక్ష చేశారు. నోటికి నల్లగుడ్డ కట్టుకుని దీక్ష చేశారు. టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎవరికి పరిచయం లేని వ్యక్తిని తీసుకొచ్చి అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. దీర్ఘకాలంగా పార్టీలో ఉన్న వారిలో ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యంతరం లేదన్నారు. అభ్యర్థిని మార్చకపోతే ఎన్నికల్లో మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వంపై రోజురోజుకు పార్టీ క్యాడర్‌లో వ్యతిరేకత పెరుగుతోంది.

స్ఫూర్తిని రగిలించేలా అంబేడ్కర్ విగ్రహం

- ఆచార్య కొలకలూరి ఇనాక్ కితాబు


సభలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

సాక్షి, అమరావతి: అణగారిన వర్గాలు తల ఎత్తుకుని జీవించేలా విజయవాడ నడిబొడ్డున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం చైతన్య స్ఫూర్తిని రగిలిస్తోందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, విశ్రాంత వైస్ ఛాన్సలర్ కొలకలూరి ఇనాక్ చెప్పారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం (సామాజిక న్యాయ మహా శిల్పం)ను జాతికి అంకితం చేసిన సీఎం జగన్‌కు అభినందనలు తెలుపుతూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం సభ నిర్వహించారు. ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ నగరంలో అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని చూస్తుంటే చాలా ఆనందంగా, గర్వంగా ఉందని ఆయన చెప్పారు. సీఎం జగన్ ఎంతో గొప్ప సంకల్పంతో, మానవాళిని చైతన్యవంతం చేయడానికే అంబేడ్కర్ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం రెండు అంచుల కత్తి మాదిరిగా ఉందన్నారు. ఈ కత్తి సామాన్యులు సైతం చైతన్యంతో ముందుకు నడిపేలా స్ఫూర్తినిచ్చే ఒక అంచుగా, దుర్మార్గాలను తెగనాడే పదునైన విజ్ఞానం మరో అంచుగా నిలుస్తుందన్నారు. ఒక వర్గం ధైర్యంగా జీవించేలా, మరో వర్గం భయంతో వెనుకడుగు వేసేలా నిలిచిన అంబేడ్కర్ విగ్రహాన్ని చూసేందుకు రెండు కళ్లు చాలడంలేదని చెప్పారు. హైదరాబాద్‌లోకంటే గొప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్ ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నానని అన్నారు.

మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ వంటి గొప్ప మేధావి తమ దేశంలో పుట్టి ఉంటే బాగుండేదని ఎన్నో దేశాలు కోరుకున్నాయన్నారు. ఇప్పుడు అంత గొప్ప అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో తెలుగు జాతికి స్ఫూర్తిని అందించిన వైఎస్ జగన్ వంటి సీఎం తమ రాష్ట్రానికి ఉంటే బాగుంటుందని అనేక రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. చరిత్ర ఉన్నంత వరకు అంబేడ్కర్ మన గుండెల్లో ఉంటారని, అంటువంటి అంబేడ్కర్ విగ్రహాన్ని బెజవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన సీఎం జగన్ చరిత్ర ఉన్నంత వరకు గుర్తుంటారని అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని అట్టడుగు వర్గాలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు నిజమైన వారసుడు సీఎం జగన్ అని చెప్పారు.

ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎవరు అడగకుండానే పేద బిడ్డలకు ఇంగ్లిష్ చదువులు, ఆందోళనలు చేయకుండానే అంబేడ్కర్ విగ్రహాన్ని అందించిన ధీశాలి సీఎం జగన్ అని చెప్పారు. సీఎం జగన్ మనసులో ఉన్న అంబేడ్కర్ రూపాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్న సీఎం జగన్ పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం పెడితే వెంకయ్యనాయుడు, చంద్రబాబు, పవన్ వంటి ఫ్యూడలిస్టులు అడ్డుపడ్డారన్నారు. చంద్రబాబు మనవడికి ఇంగ్లిష్‌తోపాటు ఫ్రెంచ్ కూడా నేర్పిస్తున్నాడని, పేద పిల్లలకు మాత్రం ఇంగ్లిష్ మీడియం అవసరంలేదా అని ప్రశ్నించారు.

ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకుడు జేబీ రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ వ్యతిరేకి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించేందుకు అప్పట్లో సీఎంగా చంద్రబాబు ప్రయత్నించగా, గద్దర్‌తోపాటు అనేక మందిమి ఉద్యమించామని చెప్పారు. తమ ఆందోళనకు దిగివచ్చిన చంద్రబాబు విగ్రహాన్ని తొలగించడంలేదని చెప్పారన్నారు. విజయవాడ నగర నడిబొడ్డున అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన సీఎం జగన్ ఆదర్శనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు తదితరులు మాట్లాడారు. కృష్ణా జిల్లా నిడమానూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు సుమప్రియ, యోగిత హరిణి ఇంగ్లిష్‌లో అంబేడ్కర్ జీవిత చరిత్ర, విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు ఉద్దేశాన్ని సభకు వివరించి ఆకట్టుకున్నారు.

క్లుప్తంగా...

టెట్ 'కీ'పై అభ్యంతరాలు తెలపండి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. సోమవారం స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సాంఘికశాస్త్రం, తెలుగు భాషా ఉపాధ్యాయులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ అర్హత పరీక్షలో 14,482 మందికి 12,076 మంది (83.38 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం తెలుగు భాషా విభాగంలో 16,524 మందికి గాను 15,048 మంది (91.06 శాతం) హాజరయ్యారు. కాగా, సోమవారం సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో ప్రాథమిక కీని విద్యాశాఖ ప్రకటించింది. వారం పాటు అభ్యంతరాలు స్వీకరిస్తామని, అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అభ్యంతరాలను నమోదు చేయాల్సిందిగా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే స్కూల్ అసిస్టెంట్స్ నాన్ లాంగ్వేజెస్ ప్రాథమిక కీని బుధవారం, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ విభాగం ప్రాథమిక కీని 9వ తేదీన విడుదల చేసి వారం పాటు అభ్యంతరాలు స్వీకరించి ఆ తర్వాత తుదికీలను విడుదల చేస్తామని తెలిపారు. పేపర్ 1బీ, 2బీ పరీక్ష మంగళవారం జరగనున్నాయి. వీటి ప్రాథమిక కీని 7న విడుదల చేసి.. ఆ తర్వాత వారం పాటు అభ్యంతరాలను స్వీకరించి తుది కీ విడుదల చేస్తారు. టెట్ కీని https://aptet.apcfss.in/లో అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలను సైతం ఇదే సైట్‌లో తెలపాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నైపుణ్య కేంద్రాలకు నిలయంగా ఏపీ

మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ అండ్ స్కిల్స్ లీడ్ డైరెక్టర్ డాక్టర్ విన్నీ జౌహరి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఏకీకరణ ద్వారా విద్యా ప్రమాణాలను పెంపొందిస్తోందని మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ అండ్ స్కిల్స్ లీడ్ డైరెక్టర్ డాక్టర్ విన్నీ జౌహరి అన్నారు. ఫలితంగా దేశంలోనే నైపుణ్య కేంద్రాలకు ఏపీ నిలయంగా మారుతోందన్నారు. విట్-ఏపీ వర్సిటీలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమవారం ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు సమావేశం నిర్వహించారు. జౌహరి మాట్లాడుతూ.. ఏపీ ఉన్నత విద్యా సంస్కరణలతో వేగంగా ముందుకెళుతోందన్నారు. ఈ క్రమంలోనే 1.25 లక్షల మంది విద్యార్థులు మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్లు సాధించడం అభినందనీయమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రెడీనెస్, పరీక్ష సంస్కరణలు, బోధనాపరమైన మార్పులతో చక్కటి ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించారని కొనియాడారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు, ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి, కార్యదర్శి వై.నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం



సాక్షి, అమరావతి: విద్యాహక్కు చట్టం కింద 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయించామని, అర్హత గల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 25 వరకు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గ్రామ సచివాలయం, కోరుకున్న పాఠశాల లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకావిష్కరణ

సాక్షి, అమరావతి: శాసన మండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ప్రచురించిన బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక అనే పుస్తకాన్ని సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ ప్రవేశిక విశిష్టతపై చిన్నారుల్లో అవగాహన కల్పించేందుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. దీనిని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో తిరిగి ప్రచురించగా.. సీఎస్ ఆవిష్కరించారు. ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని జవహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు గడిచిన సందర్భంగా చిన్నారుల్లో రాజ్యాంగ ప్రవేశిక గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు.

నెల్లూరు జిల్లా విడవలూరు మండలం దండిగుంట గ్రామానికి చెందిన రైతు అనిల్ దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కుమార్తె మధుప్రియ గ్రహణం మొర్రితో పుట్టడంతో వెంటనే తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో మధుప్రియ గుండెకు రంధ్రం కూడా ఉన్నట్టు నిర్ధారణ అయింది. పాప పెద్దయ్యాక గానీ ఆపరేషన్ చేయడానికి వీలుండదని అప్పట్లో చెప్పారు. ప్రస్తుతం మధుప్రియకు మూడేళ్లు నిండాయి. పాప గుండెకు ఆపరేషన్ చేయించాలనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మొదలు పెట్టింది.



ఇందులో భాగంగా వైద్య సిబ్బంది నిర్వహించిన ఇంటింటి సర్వేలో మధుప్రియ సమస్యను తల్లిదండ్రులు తెలియజేశారు. దీంతో వైద్య శిబిరానికి హాజరవ్వమని చెప్పారు. గ్రామంలో శిబిరం నిర్వహించిన రోజు పాపను తీసుకు వెళ్లగా వైద్యులు తొలుత నెల్లూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి మధుప్రియను తిరుపతిలోని చిన్న పిల్లల హృదయాలయానికి తరలించారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ పూర్తయింది. బాలిక పూర్తిగా కోలుకుంది. మధుప్రియ తరహాలోనే వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వేలాది మందికి ఆరోగ్య సురక్ష వరంగా మారింది.

ఇంటింటికీ రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



తొలి దశలో 86,713 మందికి చికిత్సలు అవసరమని గుర్తింపు

- ఇప్పటివరకు 84,982 మందికి చికిత్సలు, ఆపరేషన్లు పూర్తి
- ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున రవాణా ఖర్చులు సైతం చెల్లిస్తున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యల్ని ప్రభుత్వం గుర్తించింది. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారందరికీ ఉచితంగా చికిత్సలు చేయించి సాంత్వన చేకూరుస్తోంది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని సురక్ష క్యాంపుల్లో గుర్తించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత చికిత్సలు చేయించడంతోపాటు బాధితులపై రవాణా ఖర్చుల భారం కూడా పడకుండా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం భరోసా ఇస్తోంది. చికిత్సల అనంతరం కూడా బాధితులకు బాసటగా నిలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే బాధితులను చేయిపట్టి సీఎం జగన్ ముందుకు నడిపిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుస్తున్నారు.

విజయవంతంగా 2.0

ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం ఈ ఏడాది జనవరి నెలలో ప్రారంభించగా విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖ 6,710 శిబిరాలు నిర్వహించగా.. ఒక్కోచోట సగటున 359 చొప్పున 24,11,785 మంది వైద్య సేవలు పొందారు. హైపర్‌టెన్షన్, డయాబెటీస్, హెచ్‌బీ, యూరిన్, మలేరియా, డెంగీ సహా ఇతర 32.64 లక్షల స్పాట్ టెస్ట్‌లను శిబిరాల వద్ద నిర్వహించారు. రెండో దశలో భాగంగా శిబిరాల వద్దకు వచ్చిన ప్రజల్లో 8,179 మందికి తదుపరి వైద్య సేవలు అవసరం ఉన్నట్టుగా వైద్యులు నిర్ధారించి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వీరిలో ఇప్పటికే 2,030 మంది ఆస్పత్రుల్లో చికిత్సలు అందుకున్నారు. ఇక 2.13 లక్షల మందికి కంటి స్క్రీనింగ్ చేపట్టగా.. 60 వేల మందికి మందులతో నయమయ్యే సమస్యలను గుర్తించి అక్కడికక్కడే మందులు అందించారు. మరో 1.50 లక్షల మందికి అద్దాలను, 2,090 మందికి కేటరాక్ట్ సర్జరీలను సూచించారు.

98 శాతం మందికి చికిత్సలు పూర్తి

గత ఏడాది ఆరోగ్య సురక్ష తొలి దశ కార్యక్రమంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 12 వేలకు పైగా శిబిరాలు నిర్వహించింది. వీటిలో 60.27 లక్షల మంది అవుట్ పేషెంట్ సేవలు పొందారు. వీరిలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 86,713 మందిని వైద్యులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వారందరికీ చికిత్సలు చేయించేలా వైద్య శాఖ పర్యవేక్షించింది. వీరిలో ఇప్పటివరకూ 98 శాతం అంటే.. 84,982 మందికి ప్రభుత్వమే చికిత్సలు చేయించింది. చిన్న పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంటేషన్, పుట్టుకతో గుండెలో రంధ్రాలు, ఇతర సమస్యలతోపాటు, పెద్దల్లో న్యూరో, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, వంటి ఇతర సమస్యలకు ఉచిత చికిత్సలు అందించారు. చిత్తూరు, ఏలూరు, కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వంద శాతం మందికి చికిత్సలు చేయించారు. మొత్తం రోగుల్లో 1,731 మందికి చికిత్సలు అందించేలా వైద్య శాఖ పర్యవేక్షిస్తోంది. కాగా.. తొలి దశలో కంటి సమస్యలతో బాధపడుతున్న 80,155 మందికి కేటరాక్ట్ సర్జరీలు అవసరమని వైద్యులు సూచించగా.. 41633 మందికి ఇప్పటికే సర్జరీలు పూర్తి అయ్యాయి. 5.73 లక్షల మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించగా.. 5.63 లక్షల మందికి పంపిణీ పూర్తయింది.

ఏప్రిల్, మే నెలల్లో మంటలే

- రోజు రోజుకు పెరగనున్న ఎండలు
- విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్



తాడేపల్లి రూరల్: ఇప్పటికే వేసవి కాలం ప్రారంభమైందని, రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత పెరగనున్నాయని రాష్ట్ర విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. సోమవారం తాడేపల్లి బైపాస్‌రోడ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎండలు ముదురుతున్నాయని, క్రమేపీ రాష్ట్ర వ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో ఏప్రిల్, మే నెలల్లో ఎండ ప్రభావం ఎక్కువ అవుతుందని, వడగాలుల ప్రభావం కూడా అధికంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఎక్కువగానూ, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, విశాఖ, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే జిల్లాలపై అధికారులు దృష్టి సారించాలని సూచనలు జారీచేశామని అన్నారు. 2016లో 723, 2017లో 236, 2018లో 8, 2019లో 28 వడగాల్పు మరణాలు నమోదయ్యాయని, జిల్లా యంత్రాంగం సమన్వయ చర్యలతో 2020, 2021, 2022లో వడగాల్పుల మరణాలు సంభవించలేదని, 2023లో మూడు వడగాల్పుల మరణాలు సంభవించాయని వివరించారు. ఎండలతోపాటు క్యుములోనింబస్ మేఘాల కారణంగా ఆకస్మికంగా భారీ వర్షాలు, పిడుగులు పడనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండల సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని కోరారు.

కనీసం నాలుగు వారాల గడువు ఉండాలి

- 'కీ'పై అభ్యంతరాల సమర్పణకు కనీసం వారం గడువివ్వండి
- రెండింటి మధ్య గడువు కుదించడం రాజ్యాంగ విరుద్ధం
- టెట్, టీఆర్‌టీలపై హైకోర్టు తీర్పు..
- పరీక్షల షెడ్యూల్ మార్పునకు ఆదేశం
- ఈ ఆదేశాలు ఎస్‌జీటీ అభ్యర్థులకే వర్తిస్తాయన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: ఏపీ టీచర్ అర్హత పరీక్ష (టెట్), ఏపీ ఉపాధ్యాయ భర్తీ పరీక్ష (టీఆర్‌టీ)ల నిర్వహణ మధ్య తగినంత సమయం ఉండి తీరాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. టెట్ పరీక్ష ముగిసిన తేదీ నుంచి టీఆర్‌టీ పరీక్ష మొదలయ్యే తేదీకి మధ్య కనీసం నాలుగు వారాల గడువు ఉండాలని స్పష్టంచేసింది. అలాగే, టెట్, టీఆర్‌టీలకు సంబంధించిన ప్రాథమిక కీ ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, అభ్యంతరాల పరిష్కారం, తుది 'కీ' ప్రచురణకు ఎక్కువ వ్యవధి ఉండాలని కూడా తెలిపింది. 'కీ' విషయంలో అభ్యర్థులు తమ అభ్యంతరాలను సమర్పించేందుకు కనీసం వారం సమయం ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. రెండు పరీక్షల మధ్య సమయాన్ని కుదించడం ఏకపక్షమే కాక, రాజ్యాంగ విరుద్ధం కూడానని ప్రకటించింది. తామిచ్చిన ఈ ఆదేశాలు కేవలం స్పెషల్ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)కు మాత్రమే వర్తిస్తాయని తెలిపింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని అధికారులకు హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు.

రెండింటి మధ్య వ్యవధి కోసం పిటిషన్..

టెట్, టీఆర్‌టీల మధ్య తగిన సమయం ఉండేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం. పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత నోటిఫికేషన్లను రద్దుచేసి, రెండు పరీక్షల మధ్య తగిన సమయం ఇస్తూ తిరిగి నోటిఫికేషన్లు జారీ చేసేలా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించారు. అనంతరం తుది విచారణ జరిపి సోమవారం తన తీర్పును వెలువరించారు.

ప్రస్తుతమున్న కాల వ్యవధి తక్కువ..

టెట్, టీఆర్‌టీలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, అభ్యంతరాల పరిష్కారం, తుది 'కీ' ప్రచురణకు మధ్య ప్రస్తుతమున్న కాలవ్యవధి చాలా తక్కువని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టంచేశారు. ఇది ఏకపక్షమే కాక, అభ్యర్థుల ప్రయోజనాలకు కూడా విఘాతం కలిగించడమేనన్నారు. టెట్ పరీక్ష నోటిఫికేషన్ గతనెల 8న జారీచేయగా, పరీక్ష తేదీని 27–2–24గా నిర్ణయించారన్నారు. అలాగే, టీఆర్‌టీ నోటిఫికేషన్‌ను 12–2–24న జారీచేసి, 15–3–24న పరీక్ష తేదీని ఖరారు చేశారని తెలిపారు. ప్రాథమిక కీ, అభ్యంతరాల సమర్పణ, అభ్యంతరాల పరిష్కారం, తుది 'కీ' ప్రచురణకు మధ్య ఉండే సమయాన్ని కుదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. టెట్, టీఆర్‌టీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తగినంత సమయం ఇవ్వలేదని న్యాయమూర్తి తన తీర్పులో అభిప్రాయపడ్డారు. టెట్‌ను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని, అయితే.. టీఆర్‌టీని మాత్రం చివరిసారిగా 2018లో నిర్వహించారన్నారు. అప్పుడు నోటిఫికేషన్ జారీ, పరీక్ష తేదీకి మధ్య 60 రోజుల గడువు ఉండేదని గుర్తుచేశారు. తాజా పరీక్షల విషయంలో కూడా అధికారులు అంతే కాల వ్యవధిని కొనసాగించి ఉండాల్సిందన్నారు. అయితే, అధికారులు రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకుండా ఎందుకు కుదించారో అర్థంకావడం లేదన్నారు. ఇవి పోటీ పరీక్షలని, ప్రతీ అభ్యర్థి కూడా మరో అభ్యర్థితో తీవ్రంగా పోటీపడుతుంటారని న్యాయమూర్తి తెలిపారు.

సిగ్గు 'ఈడీ'సి రాతలా?

తమిళనాడులో ఈడీ విచారణకు ఏపీలో ఇసుక పాలసీకి సంబంధం ఏమిటీ?

గురివింద చెబుతున్నట్లు గత చంద్రబాబు పాలనలో ఇసుకను ఉచితంగా ఇచ్చి ఉంటే.. చింతమనేని ప్రభాకర్ మహిళా తహశీల్దార్‌ను ఎందుకు జుట్టు పట్టుకుని ఈడ్చినట్లు? అర్ధరాత్రిళ్లు సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి వెనుక ప్రొక్లయినర్లతో ఎందుకు ఇసుక తవ్వకాలు సాగించినట్లు? వీటిని బట్టి బాబు అండ్ గ్యాంగ్ అందినకాడికి దోచుకున్నారని ఈ రాజగురివిందకు తెలీదా? ఈ లెక్కన ఈ ప్రభుత్వంలో ఇసుక విక్రయం వల్ల ఏటా రూ.765 కోట్లు ఆదాయం లభిస్తోంది. ఐదేళ్లలో సుమారు రూ.4 వేల కోట్ల ఆదాయం వస్తోంది. మరోవైపు అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపుతోంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా నిఘా పెట్టింది. ఏకంగా 6.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసింది. ఇదంతా కళ్లెదుటే అందరికీ కనిపిస్తున్నా.. రామోజీకి, పచ్చ మీడియాకు మాత్రం కనిపించదు. తమ చంద్రబాబును అధికారంలోకి తేవడానికి ఎంతకైనా దిగజారుతామని, అవసరమైతే బట్టలిప్పుకుని దుష్ప్రచారం చేస్తామని అనునిత్యం చాటుకోవడం వీరికి పరిపాటిగా మారింది. ఎవరు నవ్విపోతే మాకేంటని నిస్సిగ్గుగా రోజూ రోత రాతలు రాయడం రామోజీకే చెల్లింది.

- ఇసుక తవ్వకాలను అక్కడితో పోల్చడం దిగజారుడుతనమే
- రోజురోజుకీ రామోజీకి పెరిగిపోతున్న అక్కసు
- ఇసుమంతైనా నిజాయతీ లేకుండా నిందలా.?
- పారదర్శక ఇసుక విధానంపై ఈడీ దృష్టి సారించాలని కోరడం సిగ్గుచేటు
- అసలు ఈడీ విచారణ జరగాల్సింది మార్గదర్శి అక్రమాలపైనే
- ఫిలింసిటీ భూ కుంభకోణాలపై జాతీయ స్థాయి దర్యాప్తు అవసరం
- రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా ఇసుక విధానం
- ఉచిత ఇసుక పేరుతో జరిగిన దందాకు చెక్ పెట్టడం వల్లే కడుపు మంట
- ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక ఇస్తుంటే పిచ్చి రాతలు
- నాటి అక్రమాలపై ఈడీ కేసులు పెట్టాలని ఆనాడు ఎందుకు రాయలేదు?

ఈడీ.. ఇటు చూడదా?





టీడీపీ హయాంలో చంద్రబాబు ఇంటి వెనుక యథేచ్ఛగా ఇసుక దోపిడీ (ఫైల్)



ఇసుక దందాను అడ్డుకున్న తహశీల్దార్ వనజాక్షిపై చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యం (ఫైల్)

గత ప్రభుత్వంలో ఆదాయం ఏమైంది ?

ఈ ప్రభుత్వంలో ఇసుక టెండర్ల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న రూ.3,825 కోట్ల ఆదాయం గతంలో ఏమైంది? ఇంత ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం కోల్పోతోందని తెలిసినా ఎందుకు టెండర్లు పిలువలేదు? పారదర్శక విధానాలను ఎందుకు ఎంచుకోలేదు? అప్పుడు రామోజీరావు ఈ అక్రమాలపై ఈడీ విచారణ జరిపించాలని ఎందుకు కోరలేదు.? ప్రస్తుతం పర్యావరణ అనుమతులు ఉన్న రీచ్‌ల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన లేదు. అలాగే సంబంధిత శాఖల అనుమతులతోనే రిజర్వాయర్లలో డీసిల్టింగ్ జరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడా అక్రమ తవ్వకాలు జరగడానికి అవకాశమే లేదు. దీనిపై పర్యవేక్షణకు నిఘా కోసం ఎస్ఈబీని ఏర్పాటు చేసింది. అలాగే జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, గనులశాఖ అధికారులు కూడా తమకు ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి జిల్లాకు ఒక విజిలెన్స్ స్క్వాడ్ కూడా గనులశాఖలో పనిచేస్తోంది. అంతేకాకుండా రాష్ట్ర సరిహద్దులతో పాటు కీలకమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు నిర్వహిస్తున్నారు.

సాక్షి, అమరావతి: మోకాలికి బోడిగుండుకి ముడిపెట్టడం ఎంత తిక్క తనమో ఏపీలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను తమిళనాడుతో పోల్చి అక్కసు వెళ్లగక్కడం అంతకంటే ఎక్కువ పిచ్చితనం. ఈ పిచ్చి రాతలనే నమ్ముకున్న రామోజీ అదే పనిగా ఇసుకపై తనకున్న పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎక్కడో తమిళనాడులో జరిగిన ఇసుక తవ్వకాలపై ఈడీ దృష్టి సారిస్తే, ఇక్కడ కూడా అలాగే జరగాలని కోరుకోవడం సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న కక్ష కాకపోతే మరేమిటి?. ఇసుక తవ్వకాలు సక్రమంగా జరుగుతున్నా అక్కసుతో నిత్యం తాను బురద జల్లడమే కాకుండా ఏకంగా ఈడీ జోక్యం చేసుకోవాలని బరితెగించి అడ్డగోలు రాతలు రాయడం గురువింద రామోజీకి చెల్లింది. నిజానికి ఈడీ దర్యాప్తు జరపాల్సింది డిపాజిటర్లను నిట్టనిలువునా ముంచిన రామోజీ సొంత సంస్థ మార్గదర్శిపైనే. మార్గదర్శికి అక్రమంగా డిపాజిట్లు సేకరించారని సాక్షాత్తూ కోర్టులే స్పష్టం చేశాయి. వేల కోట్లు **దోచేసి** నంగనాచి రాతలు, దొంగ ఏడుపు**లు,** నక్క తెలివి తేటలతో తప్పించుకున్నా**రు.** రామోజీ ఫిలిం సిటీ భూకుంభకోణాల**పై** ఈడీగానీ, సీబీఐగానీ విచారణ **చేస్తే** ప్రపంచం మొత్తం ఉలిక్కిపడేలా ని**జాలు** బహిర్గతమవుతాయి. తన వెనుక ఉన్న **ఈ అక్ర**మాలను దాచిపెట్టుకుని ప్రభుత్వంపై అదేపనిగా బురద చల్లడం రామోజీకి రోజువారీ ప్రక్రియగా మారిపోయింది. విష ప్రచారం ద్వారా చంద్రబాబుకు మేలు చేయాలనే ఆరాటం తప్ప నిజంగా ఇసుక తవ్వకాల వల్ల ప్రజలకు ఎక్కడ ఇబ్బంది వచ్చిందో తెలిపే ఒక్క లైను ఈనాడు రాయలేకపోతోంది. రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, ఇక్కడి ఇసుక విధానం, తమిళనాడులో ఇసుక విధానం, తవ్వకాలకు ఎలాంటి సంబంధం లేకపోయినా రెండు రాష్ట్రాలను పోలుస్తూ ఈనాడు ప్రచురించిన **కథనం**లో అక్కసు మాత్రమే కనిపిస్తోంది.

బాబు హయాంలో జేబుల్లోకి రూ.వేల కోట్లు

వాస్తవానికి గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం పేరుతో కోట్లాది రూపాయల ఆదాయం ప్రభుత్వానికి రాకుండా ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లింది. ఆ దోపిడీని నివారించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత పారదర్శకంగా నూతన ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం రూ.765 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ఈ సొమ్మును తిరిగి ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ డబ్బంతా చంద్రబాబు హయాంలో ఏమైంది? సహజ వనరుల ద్వారా వచ్చే రెవెన్యూ ప్రజా సంక్షేమానికి వినియోగించడానికి బదులు, ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లేలా చేసింది అప్పటి టీడీపీ ప్రభుత్వం. ఇసుక కొనుగోలు చేయడానికి ప్రజలు బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి కల్పించింది చంద్రబాబు. ఆ అరాచక విధానాన్ని రూపు మాపి ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక లభించేలా, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా నూతన ఇసుక పాలసీని వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో ఎక్కడా ఇసుక కొరత లేకుండా, అందుబాటు ధరలోనే, కావాల్సినంత ఇసుకను పొందే వీలు కల్పించారు. టెండర్ల ద్వారా ఇసుక తవ్వకాలను ఏజెన్సీలకు అప్పగించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.765 కోట్లు ఆదాయం లభిస్తోంది. ఐదేళ్లలో రూ.3825 కోట్ల ఆదాయం వస్తోంది. టన్ను ఇసుకను రూ.475కి విక్రయిస్తోంది.

అక్రమ ఇసుక దందాపై ఉక్కుపాదం

రాష్ట్రంలో అక్రమ ఇసుక దందాపైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అక్రమాలకు పాల్పడితే రెండు లక్షల రూపాయల జరిమానా, రెండేళ్ళ వరకు జైలు శిక్షను విధించేలా చట్టాల్లో మార్పులు తీసుకువచ్చింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసి దాదాపు 18 వేల కేసులను ఈ బ్యూరో నమోదు చేసింది. 6.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసింది. ఈ కేసుల్లో చాలా మందికి శిక్షలు కూడా పడ్డాయి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ తీవ్రంగా స్పందించింది. ఏకంగా రూ.100 కోట్లు జరిమానా విధించింది. ఈ తీర్పుకు సంబంధించి వచ్చిన ఆరోపణలు కూడా సీఎంగా చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట ప్రాంతంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపైనే. అంటే ఉచిత ఇసుక విధానం వల్ల అటు ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా, ఇటు పర్యావరణానికి విఘాతం ఏర్పడింది. టీడీపీ హయాంలో ఇసుక మాఫియా ఎలా రెచ్చిపోయిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



న్యూస్‌మేకర్

స్నైపర్ గురి

800 మీటర్ల దూరం..
అంటే ముప్పావు కిలోమీటరు నుంచి కూడా గురి తప్పకుండా కాల్చే రైఫిళ్లు స్నైపర్లు. వీటిని ఉపయోగించే వారిని కూడా స్నైపర్లు అనే అంటారు. ఇంతకాలం మగవాళ్లే స్నైపర్లుగా ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి అత్యంత కఠినమైన శిక్షణ పొంది మన దేశ తొలి మహిళా స్నైపర్‌గా అర్హతను పొందింది.

1984 'ఆపరేషన్ బ్లూస్టార్' తర్వాత రాజీవ్ గాంధీ హయాంలో 1988లో 'ఆపరేషన్ బ్లాక్ థండర్' పేరుతో స్వర్ణదేవాలయంలో మిగిలి ఉన్న సిక్కు వేర్పాటువాదులను ఏరివేసే మిలటరీ చర్య జరిగింది. 'ఆపరేషన్ బ్లూస్టార్' సమయంలో ఇరు వర్గాల్లోనూ ప్రాణనష్టం ఎక్కువ. కాని 'ఆపరేషన్ బ్లాక్ థండర్'లో మిలటరీ సిబ్బంది ప్రాణనష్టం జరక్కుండా సిక్కు వేర్పాటువాదులను అణిచివేయగలిగారు. దీనికి కారణం స్వర్ణ దేవాలయాన్ని మారణాయుధాలతో పై నుంచి కాపలాకాస్తున్న ఐదుగురు వేర్పాటువాదులను చాలా దూరం నుంచి కాల్చి చంపడం. మొదటిసారి 'స్నైపర్స్' ఉపయోగం వల్ల కలిగిన ప్రయోజనం అది.

స్నైపర్ అంటే శత్రునిర్మూలన

ఏదో సినిమాలో 'నన్ను చూడాలంటే నీ జీవితం సగం తగలడిపోయి ఉండాలి' అని బ్రహ్మానందం అంటాడు. స్నైపర్ రంగంలో దిగాడంటే శత్రువు జీవితం ముగింపు దశలో ఉందని అర్థం. స్నైపర్లు శత్రువును బంధించడానికి కాదు. నిర్మూలించడానికి. మనదేశంలో ముందు నుంచి కూడా అత్యాధునిక ఆయుధాల పట్ల కాకుండా సంప్రదాయ ఆయుధాల పట్ల మొగ్గు ఉండటం వల్ల స్నైపర్లను ఆదరించింది లేదు. కిలోమీటరు నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరం వరకూ కూడా శత్రువును కాల్చి చంపగల స్నైపర్ రైఫిల్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలియడానికి ఆ కాలంలో మన మిటలరీ యోధులు ఇజ్రాయిల్, ఫ్రాన్స్ వెళ్లాల్సి వచ్చేది. 1980లలోనే కొద్దిగా స్నైపర్స్ ఉపయోగం తెలిసింది. ఇటీవల సరిహద్దుల వెంబడి వివిధ దేశాల దాడులను ప్రతిఘటించడానికి స్నైపర్లు సమర్థంగా ఉపయోగపడుతున్నాయని వాటిని ఉపయోగించే నిపుణులను తయారు చేస్తున్నారు. మధ్యప్రదేశ్– మహౌలోని 'ఇన్‌ఫాంట్రీ స్కూల్'లో, 'ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్' కేంద్రంలో స్నైపర్స్ శిక్షణ ఇస్తున్నారు. ఇంతవరకూ మగవాళ్లకే సాగిన ఈ శిక్షణ సుమన్ కుమారి వల్ల స్త్రీలకు కూడా ఇవ్వడం మొదలైంది.

పంజాబ్‌లో చూసి

హిమాచల్ ప్రదేశ్‌లో మండి జిల్లాకు చెందిన సుమన్ కుమారి 2021లో బి.ఎస్.ఎఫ్.లో ఇన్‌స్పెక్టర్ హోదాలో చేరింది. పంజాబ్‌లో ఆమెకు విధులు కేటాయించారు. అక్కడ ఉండగా సరిహద్దు దేశాల నుంచి శత్రువులు స్నైపర్లతో మన వారి మీద దాడులు చేయడం సుమన్ గమనించింది. మన వద్ద తగినంత మంది స్నైపర్లు లేరని కూడా అవగాహన చేసుకుంది. అంతే. తనకు తానే స్నైపర్‌గా శిక్షణ తీసుకునేందుకు అనుమతి అడిగింది. 'సాధారణంగా స్నైపర్‌గా తీసుకునే శిక్షణ కఠినమైనది. మగవారే వెనకాడుతారు. శిక్షణలో సగం మంది వెనుతిరుగుతారు. కాని సుమన్ 8 వారాల పాటు శిక్షణను సమర్థంగా పూర్తి చేసింది. 56 మంది ఉన్న బ్యాచ్‌లో ఆమె మాత్రమే మహిళ. శిక్షణ బాగా పూర్తి చేసిన వారిని 'ఆల్ఫా' అని, 'బ్రేవో' అని నైపుణ్యాన్ని బట్టి విభజిస్తాం. కాని సుమన్ ప్రతిభ అంతకు మించింది. అందుకే ఆమెకు ఇన్‌స్ట్రక్టర్ హోదా ఇచ్చాం. దాని అర్థం ఆమె స్నైపర్ మాత్రమే కాదు స్నైపర్ శిక్షకురాలు కూడా' అని ఒక మిలటరీ అధికారి తెలియచేశారు.


ఎప్పుడెప్పుడు

హైజాక్‌లు, కిడ్నాప్‌లు, టెర్రరిస్ట్ అటాక్‌లు, ముఖ్య నేతలను బందీలుగా పట్టుకోవడం, సరిహద్దులు దాటి శత్రువులు రావడం వంటి సందర్భాలలో స్నైపర్లు రంగంలో దిగుతారు. పరిసరాలకు తగినట్టుగా పై తొడుగులు (కామూఫ్లాజ్) ధరించి శత్రువుకు వీలైనంత దగ్గరగా వెళ్లి తూటాతో సమాధానం చెప్పడమే వీరు చేసేపని. సుమన్ సేవలు ఇకపై దేశానికి రక్షణ ఇస్తాయి. 'నేను స్నైపర్ కావడం స్త్రీలకు స్ఫూర్తినిస్తుందనే అనుకుంటున్నాను. మిలటరీలోకి మరింతమంది మహిళలు రావాలని కోరుకుంటున్నాను' అందామె.

సేవాపథం

దానానికి దగ్గరి దారి

● షేర్ ఎట్ డోర్ స్టెప్



దానాలు, విరాళాల ప్రక్రియను సులభతరం చేయదానికి 'షేర్ ఎట్ డోర్ స్టెప్' అనే సోషల్ వెంచర్‌కు శ్రీకారం చుట్టింది ఢిల్లీకి చెందిన అనుష్క జైన్. దాతల ఇంటికి వెళ్లి వారు ఇచ్చే దుస్తులు, పుస్తకాలు... మొదలైన వాటిని తీసుకొని ఎన్జీవోలకు పంపిణీ చేస్తుంది షేర్ ఎట్ డోర్ స్టెప్. ఏఐ టెక్నాలజీ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలతో కనెక్ట్ అవుతోంది....

'ప్రతిరోజు పిల్లల బట్టలు, యూనిఫాంను చేతితో ఉతికేదాన్ని. షేర్ ఎట్ డోర్ స్టెప్ ద్వారా వాషింగ్ మెషిన్ అందిన తరువాత నాకు చాలా శ్రమ తప్పింది. ఎంతో టైమ్ మిగులుతోంది. ఈ టైమ్‌లో పిల్లలకు కథలు చెబుతున్నాను' అంటోంది బెంగళూరుకు చెందిన ఒక బామ్మ. బెంగుళూరు నుంచి జైపూర్ వరకు 'షేర్ ఎట్ డోర్ స్టెప్'ను ఎంతోమంది ప్రశంసిస్తున్నారు.

ఢిల్లీకి చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్ అయిన అనుష్కకు 'షేరింగ్' కాన్సెప్ట్ కొత్త కాదు. గతంలోకి వెళితే...

తన ప్రతి పుట్టినరోజుకి 'ఇవి కావాలి అవి కావాలి' అని కాకుండా 'ఈరోజు ఏ ఎన్జీవోకు వెళదాం' అని తల్లిని అడిగేది. నగరంలో ఉన్న ఏదో ఒక ఎన్జీవోకు వెళ్లి అక్కడ ఉన్నవారికి స్వీట్లు పంచేది. అలా 'షేరింగ్' అనే కాన్సెప్ట్ తనతో పాటు పెరిగి పెద్దదైంది.

దాతృత్వానికి సంబంధించి కాలేజీ రోజుల్లో తనకు స్పష్టత వచ్చింది.

చాలామందికి దానం చేయాలనే కోరిక ఉన్నా, సమయం లేకపోవడం వల్ల దూరభారం వల్ల చేయలేకపోతున్నారు.

'డొనేషన్ ఏ స్వచ్ఛంద సంస్థకు ఇస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది;' అనే విషయంలో చాలామందికి అవగాహన ఉండదు' అంటున్న అనుష్క ఈ సమస్యకు ఒక పరిష్కారం వెదకాలనుకుంది. తన డ్రీమ్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన అనుష్క నైట్‌షిఫ్ట్‌లో డ్యూటీ చేసేది. పగటిపూట సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టేది.

ఉద్యోగంలో చేరినా ఎన్జీవోలకు డొనేట్ చేయాలనే ఆలోచన అనుష్కను వదలలేదు. దీంతో ఒక వెబ్‌సైట్ రూపొందించి డొనేట్ చేయాలనుకుంటున్నవారు తమ ఐటమ్స్‌ను రిజిస్టర్ చేసుకోవాలని కోరింది. రిజిస్టర్ కాగానే పొద్దున్నే వెళ్లి వాటిని కలెక్ట్ చేసుకొని వచ్చేది. పికప్స్ రెండు వందలు దాటిన తరువాత 'ఇంకా ఏదైనా చేయాలి' అనే ఆలోచనతో బెంగళూరులోకి అడుగుపెట్టింది అనుష్క. అక్కడ మరో కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరింది. 2018లో 'షేర్ ఎట్ డోర్ స్టెప్'కు పూర్తి సమయాన్ని కేటాయించింది.

'ఇంకా ఏదైనా చేయాలి' అనే ఆలోచనతో బెంగళూరులోకి అడుగుపెట్టింది అనుష్క. 2018లో 'షేర్ ఎట్ డోర్ స్టెప్'కు పూర్తి సమయాన్ని కేటాయించింది. 'మా వెబ్‌సైట్‌లోకి వచ్చి పికప్ బుక్ చేయండి. మీరు విరాళంగా ఇవ్వాలనుకుంటున్న వస్తువు, అది తేలికైనదా, బరువైనదా అనేది తెలియజేయండి. మా ఏజెంట్లు నిర్ణీత సమయంలో మీ ఇంటి ముందు ఉంటారు. మీ విరాళాన్ని మాకు అనుబంధంగా ఉన్న ఎన్జీవోలలో ఒకదానికి పంపిస్తాం' అంటూ అనుష్క చేసిన ప్రకటనకు అద్భుత స్పందన వచ్చింది.

ఏ వస్తువులు ఏ ఎన్జీవోకు వెళ్లాలి... అనే విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికత సహాయం తీసుకుంటుంది అనుష్క.

'షేర్ ఎట్ డోర్ స్టెప్' ద్వారా కంపెనీలకు మార్కెటింగ్ సొల్యూషన్స్‌ను అందించడంతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)కు సంబంధించిన కార్యక్రమాలకు సహకారం అందిస్తోంది. ఇండివిడ్యువల్స్‌తో పాటు కార్పొరేట్ డోనర్స్ కోసం డోర్‌స్టెప్ డొనేషన్ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చింది. 'షేర్ ఎట్ డోర్ స్టెప్' దేశీయంగా తిరుగులేని విజయం సాధించిన తరువాత ఈ కాన్సెప్ట్‌ను విదేశాలలో ప్రచారం చేయాలని ఆలోచన చేసింది. తొలి అడుగుగా సింగపూర్‌లో ప్రచారం చేసింది. అక్కడ లభించిన స్పందన అమితమైన ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో మరింత వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది అనుష్క.

ఎంతో శక్తి ఇస్తుంది

దానం చేయడానికి అవసరమైన స్ఫూర్తి ఒక్కో దేశంలో ఒక్కోరకంగా ఉండవచ్చు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే ఉన్నత ఆలోచన మాత్రం దేశాల సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒకటి చేస్తుంది. ఇతరులకు సహాయం చేయడం అనే పని మనకు ఎంతో శక్తి ఇస్తుంది.

– అనుష్క జైన్



● డొనేషన్ అందుకున్న బాలల మోముల్లో నవ్వులు పూయిస్తూ...

బ్యూటిప్స్



కేశ సౌందర్యం

అరకప్పు కొబ్బరి నూనెలో నాలుగు టీస్పూన్ల గుంటగలగర పొడి వేసి మీడియం మంట మీద వేడిచేయాలి. నూనె వేడెక్కిన తరువాత దించేసి కురులు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి, అరగంట తరువాత షాంపుతో కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే... ప్రొటీన్‌లు కుదుళ్లకు అంది తెల్ల జుట్టు నల్ల బడటంతోపాటు జుట్టు రాలడం కూడా తగ్గుతుంది.



ముఖం మిలమిలా

పచ్చిపాలు, రోజ్‌వాటర్‌ను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాటన్ బాల్‌తో ముఖానికి రాసుకోవాలి. ఉదయాన్నే గోరు వెచ్చని నీటితో కడిగేస్తే ముఖం కాంతిమంతమవుతుంది.

- విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలో ప్రకృతి సేద్యం
- రైతు ఉత్పత్తిదారుల సంస్థతో కలిసి ఇంటిపంటల సాగుకు శ్రీకారం
- వాలంటీర్లు, విద్యార్థులకు ప్రకృతి సేద్య పనులు చేస్తూ నేర్చుకునే అవకాశం

ఆంధ్రా వర్సిటీలో ఆర్గానిక్ పంటలు!

నగరవాసులకు ఆరోగ్యదాయకమైన సేంద్రియ ఇంటిపంటలను, ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్పించడానికి విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థతో కలిసి యూనివర్సిటీ ఆవరణలో అర్బన్ గార్డెనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసింది. అనేక రకాల ఆకుకూరలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నగరంలోనే పండించి తాజాగా నగరవాసులకు అందిస్తోంది. నగరంలో పుట్టి పెరిగే విద్యార్థులకు మట్టి వాసనను పరిచయం చేయటం.. సేంద్రియ ఇంటిపంటల సాగు పనులను చేస్తూ నేర్చుకునే వినూత్న అవకాశాన్ని నగరవాసులకు కల్పించటం ప్రశంసనీయం. ఈ సామాజిక కార్యక్రమంలో కీలకపాత్ర పోషిస్తున్న 'ఏయు- అవని ఆర్గానిక్స్ అర్బన్ గార్డెనింగ్ హబ్' నిర్వాహకులు ఉషా రాజు, హిమబిందు కృషిపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ప్రత్యేక కథనం.











పదిహేనేళ్లుగా సేంద్రియ టెర్రస్ కిచెన్ గార్డెనింగ్, ప్రకృతి వ్యవసాయంలో అనుభవం ఉన్న పోషికాహార నిపుణురాలు ఉషా రాజు, హిమబిందు ఆంధ్రా యూనివర్సిటీతో కలసి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. మన మన్యం రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వాహకులు కూడా అయిన వీరు విశాఖపట్నం నగరం మధ్యలోని ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలోనే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రజలకు ప్రకృతితో కలసి జీవించడం నేర్పుతున్నారు. వాలంటీర్లు పాల్గొనేందుకు అవకాశం ఇస్తూ అర్బన్ కమ్యూనిటీ ఫార్మింగ్‌ని ఆచరించి చూపుతున్నారు. నగర వాసులు తమ ఇంటిపైన కూడా ఆరోగ్యదాయకమైన సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు.

గత ఏడాది నవంబర్‌లో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని కలిసి వర్సిటీలో అర్బన్ గార్డెనింగ్ హబ్‌కు అనువైన స్థలం కేటాయించాలని ఉషా రాజు, హిమబిందు కోరారు. ప్రజలకు ఆరోగ్యదాయకమైన ఆకు కూరలు అందుబాటులోకి రావటంతో పాటు ప్రకృతి సేద్యంపై అవగాహన కలుగుతుందన్న ఆశయంతో ఆయన అందుకు అంగీకరించారు. వృక్షశాస్త్రం, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ విద్యార్థులను ఈ అర్బన్ సాగులో భాగస్వాముల్ని చేయాలని వీసీ సూచించారు.

ఆకుకూరలను నగరంలోనే పండిస్తున్నాం..!



మా 'మన మన్యం ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో 4 జిల్లాలకు చెందిన 120 మంది రైతులు సభ్యులు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు తదితర ఉత్పత్తులను 'అవని ఆర్గానిక్స్' పేరుతో విశాఖ నగరంలోని 4 రైతు బజార్లలోని మాకు కేటాయించిన స్టోర్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. అయితే, ఆకుకూరలను నగరానికి దూరంగా పొలాల్లో పండించి ఇక్కడికి తెచ్చి వినియోగదారులకు అందించేటప్పటికి కనీసం 25% పోషకాలు నష్టం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి తాజా ఆకుకూరలను నగరంలోనే ప్రకృతి వ్యవసాయంలో పండించి వినియోగదారులకు అందించాలని తలచాం. మా ఆలోచనను ప్రోత్సహించిన ఆంధ్రా యూనివర్సిటీ సహకారంతో 80 సెంట్ల ఖాళీ స్థలంలో అనేక రకాల సాధారణ ఆకుకూరలతో పాటు కలే, లెట్యూస్, బాక్‌చాయ్ వంటి విదేశీ ఆకుకూరలను, కనుమరుగైన కొన్ని రకాల పాతకాలపు ఆకుకూరలను సైతం పండించి, ప్రజలకు తాజాగా విక్రయిస్తున్నాం. స్థలంతోపాటు నీటిని యూనివర్సిటీ ఇచ్చింది. వైర్ ఫెన్సింగ్, డ్రిప్‌లు, సిబ్బంది జీతాలను మా ఎఫ్.పి.ఓ. సమకూర్చుతోంది. నగరంలో పుట్టి పెరిగే పాఠశాల విద్యార్థులకు, నగరవాసులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఇంటిపంటల సాగును నేర్పించాలన్నది మా లక్ష్యం. వాలంటీర్లు ఎవరైనా ప్రతి రోజూ ఉదయం 7-9 గంటల మధ్యలో నగరం మధ్యలో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీకి వచ్చి, గార్డెనింగ్ పనులను చేస్తూ నేర్చుకోవచ్చు. నచ్చిన ఆకుకూరలు తామే కోసుకొని కొనుక్కెళ్ల వచ్చు. స్కూలు విద్యార్థులకు ఇంటిపంటలు, ప్రకృతి వ్యవసాయ పనులను పరిచయం చేయడానికి ఇదొక మంచి అవకాశమని మేం భావిస్తున్నాం. యూనవర్సిటీలో ఈ పంటలను 2 ఎకరాలకు విస్తరించే ఆలోచన ఉంది.

– **ఉషా రాజు**, ఎయు–అవని ఆర్గానిక్స్ అర్బన్ గార్డెనింగ్ హబ్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం

80 సెంట్లలో బహుళ పంటల సాగు

ఆ విధంగా 2023 నవంబర్ చివరి నాటికి ఏయూ ఫార్మ్ టెస్టింగ్ లాబరేటరీ (ఎలిమెంట్) ఎదురుగా ఉన్న సుమారు 80 సెంట్ల ఖాళీ స్థలంలో ఏర్పాటైన అర్బన్ గార్డెనింగ్ హబ్‌లో ప్రకృతి సేద్యం ప్రారంభమైంది. కలుపు మొక్కలను తొలగించి నేలను సాగుకు అనుకూలంగా మార్చటానికి దాదాపు మూడు వారాల సమయం పట్టింది. తొలుత ఆకు కూరల సాగును ప్రారంభించారు. పాలకూర, తోటకూర, మెంతి కూర, చుక్కకూర, బచ్చలి, గోంగూర, పొన్నగంటి, గలిజేరు, ఎర్రతోటకూర, పుదీనా వంటి పది రకాల ఆకుకూరలను చిన్నమడులుగా చేసుకొని సాగు చేస్తున్నారు.

సలాడ్‌లలో వినియోగించే అరుదైన బాక్ చాయ్ వంటి మొక్కలతో పాటు గోధుమ గడ్డి, ఆవ ఆకులు, చేమదుంపలు, కేరట్, బీట్‌రూట్, చిలగడదుంప వంటి దుంప పంటలనూ ఇక్కడ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రాడ బీర, వంగ, బొప్పాయి కాత దశకు వస్తున్నాయి. త్వరలో దొండ పాదులు సైతం నాటబోతున్నారు. ప్రతీ మూడు నెలలకు నాలుగైదు రకాల కూరగాయలు పెంచే విధంగా వీరు ప్రణాళిక చేసుకుని పనిచేస్తున్నారు.



ఆకర్షితులవుతున్న ప్రజలు

పశువుల పేడ తదితరాలతో తయారు చేసిన ద్రవ జీవామృతం, ఘనజీవామృతంతో ఇక్కడ పూర్తి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్‌లు ఏర్పాటు చేసుకుని పొదుపుగా నీటిని వాడుతున్నారు. అనేక రకాల పంటలను కలిపి పండించటం వల్ల ఆకుకూరలు, కూరగాయ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. పెద్దగా పురుగు పట్టడం లేదు. తమ కళ్ల ముందే ఆరోగ్యదాయకంగా సాగవుతున్న పంటలు వర్సిటీ ఆవరణలో నిత్యం వాకింగ్‌కు వచ్చే వందలాది మందిని ఆకర్షిస్తున్నాయి. కొద్దిసేపు ఈ ప్రాంగణంలో గడుపుతూ.. ఆకుకూరలు, కూరగాయలను ఎలా పెంచుతున్నారో అడిగి తెలుసుకుంటూ.. కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

కమ్యూనిటీ ఫార్మింగ్

ప్రతీ ఆదివారం కమ్యూనిటీ ఫార్మింగ్‌ని ప్రోత్సహిస్తున్నారు. నగరవాసులు స్వచ్ఛందంగా ఇక్కడకు వచ్చి కొద్దిసేపు వ్యవసాయం నేర్చుకోవడం కోసం భాగస్వాములయ్యేందుకు అవకాశం కల్పించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు ఇక్కడకు వచ్చి కాసేపు పంట మొక్కల మధ్య సరదాగా గడుపుతున్నారు. దీనితో వారికి ఒత్తిడి నుంచి ఉపశమనం, మానసిక ప్రశాంతత లభిస్తోందని చెబుతున్నారు.

వలంటీర్లకు అవకాశం..

అర్బన్ కిచెన్ గార్డెనింగ్, ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న నగరవాసులకు ఇక్కడ వలంటీర్లుగా పని చేసే అవకాశం కల్పిస్తున్నారు. వీలైనంత ఎక్కువ మందికి ప్రకృతి వ్యవసాయం అలవాటు చేయడం, ప్రతీ ఇంటిలో టెర్రస్ గార్డెన్‌లు అభివృద్ధి చేసుకునే విధంగా ప్రోత్సహించడం లక్ష్యంగా పని చేస్తున్నామని నిర్వాహకులు ఉమా రాజు, హిమ బిందు చెబుతున్నారు.

ప్రస్తుతం ఏయూలో చదువుకుంటున్న కొంత మంది విద్యార్థులు ఇక్కడ పనిచేస్తున్నారు. మొక్కలపై తమకున్న ఆసక్తితో స్వచ్ఛందంగా ఉదయపు వేళల్లో రెండు గంటల సమయం వెచ్చిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి అవని ఆర్గానిక్స్ ప్రత్యేకంగా స్టైఫండ్‌ను అందిస్తోంది. కూరగాయల మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్‌ను విశాఖ వాసులకు అందుబాటులో ఉంచే విధంగా నర్సరీని ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రకృతి వ్యవసాయం, ప్రజల ఆరోగ్యంపై ఏయూ ఉన్నతాధికారులతో పాటు అవని ఆర్గానిక్స్ నిర్వాహకులకు శ్రద్ధ ఉండటం, సామాజిక బాధ్యతగా అర్బన్ గార్డెనింగ్ హబ్‌ను ప్రారంభించటం ఆదర్శప్రాయం మాత్రమే కాదు, ఇతరులకు అనుసరణీయం కూడా!

– **వేదుల నరసింహం**, సాక్షి, విశాఖపట్నం
ఫోటోలు: పి.ఎల్.మోహన్ రావు, సాక్షి, విశాఖపట్నం

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 4 నుంచి

తిరుపతిలో 9 నుంచి ఆర్గానిక్ మేళా

తిరుపతి గవర్నమెంట్ యూత్ హాస్టల్ గ్రౌండ్స్ (పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ వెనుక)లో మార్చి 9,10,11 తేదీల్లో ఉ.6.30– రాత్రి 8 గం. వరకు 'కనెక్ట్ 2ఫార్మర్' సంస్థ ఆధ్వర్యంలో ఆర్గానిక్ మేళా జరగనుంది. రైతులు తమ సేంద్రియ/ప్రకృతి వ్యవసాయోత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు సహకరించటం.. దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్గానిక్ ఆహారోత్పత్తులను అందుబాటులోకి తేవటం తమ ముఖ్య ఉద్దేశమని కనెక్ట్ 2ఫార్మర్ ప్రతినిధి శిల్ప తెలిపారు. ప్రతి నెలా రెండో శని,ఆదివారాల్లో తిరుపతిలో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ నెల ప్రత్యేకంగా 3 రోజుల మేళా నిర్వహిస్తున్నామన్నారు.

9న మొక్కల గ్రాఫ్టింగ్, 5 అంచెల పంట విధానంపై శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల రైతులు, ఇంటిపంటల సాగుదారులు 63036 06326 నెంబర్‌కు వివరాలు వాట్సాప్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. 11న గృహిణులకు సిరిధాన్యాల వంటల పోటీ ఉంది. 830 91 45655 నెంబర్‌కు వివరాలు వాట్సాప్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఆంధ్ర, తెలంగాణ నుండి 12 చేనేత సంఘాలు చేనేత వస్త్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. పిల్లల కోసం భారతీయ సాంప్రదాయ యుద్ధ కళ అయిన కలరీ, వంటింటి వ్యర్థాలతో కంపోస్ట్, పెన్ కలంకారీ పై వర్క్‌షాప్‌లు జరుగనున్నాయి. ఇతర వివరాలకు.. 91330 77050.

7న మిద్దెతోట రైతులకు పురస్కారాలు

ఈ నెల 7న ఉ. 11 గం.కు హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పట్టణ ప్రాంతాల్లో మిద్దెతోటలు, ఇంటిపంటలు సాగు చేసుకునే 24 మంది అర్బన్ రైతులకు 'తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోట పురస్కారాల' ప్రదానోత్సవం జరగనుందని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ సమాచార కమిషనర్ ఎం. హనుమంతరావు, మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి అతిథులుగా పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.



మెజారిటీ వైపు ఉండటమే జీవితపు ఉద్దేశం కాదు.
వెర్రివాళ్లలో కలిసిపోకుండా తప్పించుకోవడం!
- మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 5 మార్చి 2024

ఎన్నదగిన తీర్పు

చట్టసభల సభ్యులు చెట్లకూ, పుట్లకూ ప్రాతినిధ్యం వహించరు. ఓటు హక్కున్న పౌరులు వారిని ఎన్నుకుంటారు. తమ ప్రతినిధులుగా చట్టసభలకు పంపుతారు. అలా ఎన్నికైనవారి ప్రవర్తన అందరికీ ఆదర్శనీయంగా వుండాలనీ, వుంటుందనీ జనం ఆశిస్తారు. అందుకు భిన్నంగా వున్నపక్షంలో ఆ సభ్యులపై మాత్రమే కాదు... ఆ చట్టసభలపైనే ప్రజలు నమ్మకం కోల్పోతారు. కనుకనే సోమవారం సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. చట్టసభల్లో ఓటేయటానికీ లేదా ప్రసంగించటానికీ లంచం తీసుకునే ప్రజాప్రతినిధులు చట్టపరమైన చర్యలనుంచి తప్పించుకోలేరంటూ ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన ఈ ఏకగ్రీవ తీర్పు మన ప్రజాస్వామ్యానికి పట్టిన అనేకానేక చీడల్లో ఒకదాన్ని తొలగించటానికి దోహదపడుతుందని భావించాలి. 1993 సంవత్సరంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై లోక్‌సభలో వచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించటానికి అయిదుగురు జేఎంఎం సభ్యులు, జనతాదళ్ (ఏ) సభ్యుడొకరు లక్షలాది రూపాయలు లంచం తీసుకున్నారన్నది ప్రధానమైన ఆరోపణ. నాటి ప్రధాని పీవీ, ఈ ఆరుగురు సభ్యులూ ఆ తీర్మానాన్ని ఓడించటానికి ఉమ్మడిగా నేరపూరిత కుట్రకు పాల్పడ్డారన్నది ఆ ఆరోపణ సారాంశం.

లంచావతారాలైన ప్రభుత్వోద్యోగులు ముడుపులు తీసుకుంటే అవినీతి నిరోధక విభాగాలు అరెస్టు చేస్తాయి. వారి నేరం రుజువైన పక్షంలో శిక్ష కూడా పడుతుంది. ఇదే పని మరింత భారీ స్థాయిలో చేసే ప్రజాప్రతినిధి చట్టపరిధిలోకి ఎందుకు రారన్నది సామాన్యులకొచ్చే సందేహం. నిజానికి 1998లో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇలాంటి ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పిస్తూ తీర్పు వెలువరించినప్పుడు రాజ్యాంగ నిపుణులు నివ్వెరపోయారు. ఈ తీర్పు పార్లమెంటరీ వ్యవస్థ పనితీరును తీవ్రంగా దెబ్బతీస్తుందనీ, ప్రజాస్వామ్యం పతనమవుతుందనీ హెచ్చరించారు. నాటి సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును అర్థం చేసుకున్న తీరూ, చట్టసభల సభ్యులకు రక్షణకల్పించే రాజ్యాంగ అధికరణ 105కు చెప్పిన భాష్యమూ లోపభూయిష్టం. పార్లమెంటు నిర్వహణ ప్రక్రియకు సంబంధించిన నిబంధనలూ, ఇతరత్రా ఆదేశాలకు లోబడి పార్లమెంటు సభ్యులకు వాక్ స్వాతంత్ర్యం వుంటుందన్నది 105(1) అధికరణ చెప్పిన మాట. సభలో సభ్యులు చేసే ప్రసంగాలు, ఏదైనా అంశంపై వారు వేసే ఓటు, సమర్పించే నివేదికలు న్యాయస్థానాల్లో సవాలు చేయటానికి అతీతమైనవని 105(2) అధికరణ చెబుతోంది. కానీ వారు చేసే ప్రసంగాలూ, వేసే ఓటూ వెనక ముడుపుల ప్రమేయం వున్నప్పుడు కూడా రక్షణ పొందగలరా అన్నదే ప్రధాన ప్రశ్న. అయితే చిత్రంగా నాటి ధర్మాసనంలోని మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన అయిదుగురు జేఎంఎం ఎంపీలకూ 105(2) అధికరణ కింద రక్షణ వుంటుందని భావించారు. అయితే అదే తరహాలో లంచం తీసుకుని కూడా ఓటింగ్‌కు గైర్హాజరైన జనతాదళ్(ఏ) సభ్యుడు అజిత్ సింగ్‌కు మాత్రం ఆ రక్షణ వర్తించదని తీర్పునిచ్చారు. నాటి ముడుపుల కేసులో ఆరోపణ లెదుర్కొన్న అయిదుగురు జేఎంఎం సభ్యుల్లో ఒకరైన శిబూ సోరెన్ కుమార్తె సీతా సోరెన్ ఎమ్మెల్యేగా వుంటూ 2012లో రాజ్యసభ ఎన్నికల్లో ఒక స్వతంత్ర సభ్యుడికి ఓటేస్తానని మాటిచ్చి ముడుపులు తీసుకున్నారు. అయితే ఎన్నిక బహిరంగ విధానంలో జరగటంతో గత్యంతరం లేక తన పార్టీ ఎంపిక చేసిన సభ్యుడికి అనుకూలంగా ఓటేశారు. దానిపై నమోదైన కేసులో తనకు పీవీ కేసు తీర్పే వర్తిస్తుందనీ, కేసు కొట్టేయాలనీ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ లంచం తీసుకుని కూడా అప్పట్లో ఓటింగ్‌కు గైర్హాజరైన అజిత్ సింగ్ విషయంలో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయమే సీతా సోరెన్‌కు కూడా వర్తిస్తుందని హైకోర్టు భావించి ఆ పిటిషన్‌ను తోసిపుచ్చటంతో 2014లో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఏదైనా కొత్త అంశం తెరపైకొచ్చినప్పుడు గత తీర్పులు నిశితమైన పరీక్షకు నిలబడక తప్పనిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు సీతా సోరెన్ అప్పీల్ సర్వోన్నత న్యాయస్థానానికి ఆ మాదిరి అవకాశాన్నిచ్చింది. పౌరస్వేచ్ఛ పౌరులకు చట్టం ఇచ్చిన బహుమతి మాత్రమేననీ, ఆత్యయిక పరిస్థితి వున్నప్పుడు దాన్ని వెనక్కి తీసుకునే హక్కు రాజ్యానికుంటుందనీ ఏడీఎం జబల్‌పూర్ కేసుగా ప్రసిద్ధిచెందిన హెబియస్ కార్పస్ పిటిషన్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం మెజారిటీ తీర్పు వెలువరించింది. ధర్మాసనంలోని జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా ఒక్కరే దాంతో విభేదించారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఈ తీర్పును అడ్డం పెట్టుకుని దేశవ్యాప్తంగా వేలాదిమంది పౌరులను జైళ్లపాలు చేసింది. ఆ తీర్పును 1978లో సుప్రీంకోర్టు సవరించుకుంది. అలాగే 2017లో పుట్టస్వామి కేసులో గోప్యత హక్కుపై వెలువరించిన తీర్పు సందర్భంగా ఏడీఎం జబల్‌పూర్ కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తమ తీర్పు ఏ పర్యవసానాలకు దారితీస్తుందో, ఎలాంటి దుస్సంప్రదాయాలకు సాకుగా మారుతుందో గమనించుకోవటం న్యాయస్థానాలకు తప్పనిసరి. ప్రజాప్రతినిధులు పార్లమెంటులో వ్యవహరించే తీరుపై లంచాల ప్రభావంవున్నా వారు చర్యకు అతీతులన్న గత భావనను ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చటం హర్షించదగింది. ముడుపులు ఎక్కడైనా ముడుపులే. ప్రజాప్రతినిధులు అటువంటి ప్రలోభాలకు లొంగితే వారి అనైతికత మొత్తం వ్యవస్థనే నాశనం చేస్తుంది. చట్టసభలపై ప్రజానీకానికుండే విశ్వాసం కుప్పకూలుతుంది. అవినీతి కేసుల్లో దోషులందరికీ ఒకే చట్టం, న్యాయం వర్తిస్తుందన్న తాజా తీర్పు ఎన్నదగింది.

అమెరికా రాజకీయాల్లో భారతీయులు

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

సిద్ధాంతపరంగా అమెరికా రెండు పార్టీల రాజకీయ వ్యవస్థను కలిగి ఉంది. కానీ ఆచరణలో, రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలు రెండూ తమలో తామే సంకీర్ణాలుగా ఉంటున్నాయి. రిపబ్లికన్ పార్టీ దాని ఆధిపత్య స్థానంలోని కరడుగట్టిన మితవాదులకూ, పార్టీ లోపలే తమ వాణిని అట్టిపెట్టుకోవడానికి ఘర్షణ పడుతున్న గతకాలపు సంప్రదాయవాదులకూ మధ్య గొప్ప అంతర్యుద్ధానికి సాక్షీభూతంగా ఉంది. ఇక డెమొక్రటిక్ పార్టీ శిబిరం...సెంట్రిస్టులు, సెంటర్–లెఫ్టిస్టులు, లెఫ్టిస్టులకు నిలయంగా ఉంటోంది. అయితే, మితవాద పక్షం నుంచి ప్రగతిశీల వామపక్షాల వరకు, అమెరికాకు చేతనత్వం కలిగిస్తున్న ఐదు రాజకీయ పక్షాలలోనూ భారతీయ అమెరికన్ నాయకులు ప్రధాన పాత్రధారులుగా ఉండటమే ఇప్పుడు ప్రత్యేకంగా ప్రస్తావనార్హం.

కరుడుగట్టిన మితవాదం (ఫార్–రైట్)తో ప్రారంభిద్దాం. ఈ రాజకీయ ధోరణి, కింది విధానాలను కలిగివుంది. 1.కార్పొరేట్ పన్ను తగ్గింపుల ద్వారా ఆర్థిక స్థితిస్థాపకతను నిర్మించడంపై అమెరికా దృష్టి కేంద్రీకరించాలి. ఇంధన వాడకాన్ని ఎంతకైనా పెంచాలి. ఇప్పటికే ఉన్న ట్రేడింగ్ ఏర్పాట్లపై పూర్తిగా తిరోగమించాలి. 2. అమెరికా తన అంతర్జాతీయ కట్టుబాట్లను తగ్గించుకోవాలి. ఐరోపా నుండి వెనక్కి తగ్గాలి. ఎక్కువగా చైనాపై దృష్టి పెట్టాలి. 3. అమెరికా తన సరిహద్దులను పటిష్ఠంగా కాపాడుకోవాలి. సామాజిక జనాభా మార్పులు సంఘర్షణలను ఆహ్వానిస్తున్నాయి. వలసదారులు శ్వేత క్రైస్తవ జనాభా రాజకీయ ఆధిపత్యానికి కలగబోయే ముప్పును సూచిస్తున్నారు. 4. అమెరికా 'మేలుకొలుపు' (వోకిజం) రాజకీయాలను తిప్పికొట్టాలి. అవి లైంగికత లేదా జాత్యహంకారంపై విద్యా బోధన లేదా నిశ్చయాత్మక చర్య లేదా యుద్ధ వ్యతిరేక ఉద్యమాలు వంటివి ఏవైనా కావచ్చు. 5. అమెరికన్ ఫెడరల్ ప్రభుత్వం, నిఘా సంస్థలు రాజకీయంగా రాజీ పడ్డాయి. వీటి సిబ్బందిని తగ్గించడంతో సహా నాటకీయంగా రీబూట్ చేయడం అవసరం.

డోనాల్డ్ ట్రంప్ ఈ ధోరణికి నిజమైన మార్గదర్శకుడు, ముఖచిత్రం కూడా. అయితే, ఈ రోజు ఈ ఉద్యమం తదుపరి తరం ముఖాలలో వివేక్ రామస్వామి కూడా ఉన్నారు. నిజానికి, వాషింగ్టన్ డీసీలో జరిగిన కన్జర్వేటివ్ రాజకీయ కార్యాచరణ సమావేశంలో, ట్రంప్ ఉపాధ్యక్షుడి ఎంపికగా రామస్వామి కూడా ఫేవరెట్‌లలో ఒకరుగా ఉద్భవించారు.

మధ్యేవాద–సంప్రదాయవాద ధోరణిని పరిశీలిద్దాం. ఈ అంతరిస్తున్న మితవాద రిపబ్లికన్‌ల తరం మూడు కీలక అంశాలలో, కరుడుగట్టిన మితవాదం నుండి భిన్నంగా ఉంటుంది. 1. అంతర్జాతీయ కట్టుబాట్ల పరంగా, అమెరికా బలం... పొత్తులపై, 'నాటో' కూటమి పట్ల నిబద్ధతపై, భాగస్వామ్యాలపై ఆధారపడి ఉంటుందని ఈ స్కూల్ విశ్వసిస్తుంది. ఐరోపాలో రష్యా సవాలును, ఇండో–పసిఫిక్‌లో చైనా సవాలును, పశ్చిమాసియాలో ఇరాన్‌ను అమెరికా కలిసి ఎదుర్కోవాలని నమ్ముతుంది. 2. సంస్కృతీ యుద్ధాల పరంగా – మితవాద రిపబ్లికన్ లు అబార్షన్, తుపాకీ హక్కులు, విద్యపై పార్టీ ఎజెండాతో సరిపెట్టుకుంటారు. అన్నింటికీ మరీ ఎక్కువ ఆందోళన చెందకుండా విభిన్న దృక్కోణాల పట్ల అంగీకారంగా ఉంటారు. 3. మితవాద రిపబ్లికన్‌లు అమెరికన్ సంస్థలపై విశ్వాసం కలిగి ఉంటారు. అలాగే ప్రజాస్వామ్య నియమాలకు కట్టుబడి ఉంటారు. ఇది యునైటెడ్ స్టేట్స్ క్యాపిటల్ మీద జనవరి 6న జరిగిన మూక దాడి సమర్థకుల నుండి వైరుధ్యాన్ని సూచిస్తుంది.

సెనేట్‌లో మిచ్ మెక్‌కానెల్ ఈ విభాగానికి నాయకత్వం వహిస్తుండగా, నిక్కీ హేలీ ఇప్పుడు మితవాద రిపబ్లికన్ పార్శ్వానికి ప్రజాముఖంగా ఉన్నారు. ఆమె అయోవా, న్యూ హాంప్‌షైర్ ప్రైమరీలలో ట్రంప్ చేతిలో ఓడిపోయారు. తన సొంత రాష్ట్రం సౌత్ కరోలినాలోనూ ఓడారు. నెవాడాలో అయితే 'ఈ అభ్యర్థులు ఎవరూ కారు' విభాగంలో పోల్ అయిన ఓట్ల కంటే తక్కువ ఓట్లను పొందడం అనేది ఈ భావజాలం ఈరోజు రాజకీయంగా ఎంత బలహీనంగా ఉందో చూపిస్తుంది. కానీ మొత్తంగా నియోజకవర్గాల పరంగా ఈ వర్గం ప్రభావం చూపుతుంది. న్యూ హాంప్‌షైర్‌లో హేలీకి వచ్చిన 43 శాతం ఓట్లు, సౌత్ కరోలినాలో వచ్చిన 39 శాతం ఓట్లలో ఇది కనిపిస్తుంది. గెలవడానికి సరిపోదు కానీ, ఈ వర్గాలు ఇంటిలోనే ఉంటే మాత్రం సార్వత్రిక ఎన్నికల్లో ట్రంప్ అవకాశాలు నాటకీయంగా మసకబారుతాయి.



వివేక్ రామస్వామి



కమలా హారిస్



రో ఖన్నా



నిక్కీ హేలీ



రాజా కృష్ణమూర్తి



ప్రమీలా జయపాల్

డెమొక్రాట్లలో సెంట్రిస్టులు, సెంటర్ లెఫ్టులు, లెఫ్టులు...

ఇక మనం డెమొక్రటిక్ పార్టీ శిబిరానికి మరలుదాం. డెమొక్రటిక్ సెంట్రిస్ట్‌లకు, సెంటర్–లెఫ్ట్‌కు అధ్యక్షుడు జో బైడెన్ నాయకత్వం వహిస్తున్నారు. వివిధ ప్రపంచ రంగాల్లో అమెరికా పాత్రకు సంబంధించి మధ్యేవాద రిపబ్లికన్‌ల నిబద్ధతను ఈ స్కూల్ కూడా పంచుకుంటుంది. ఇది కరుడుగట్టిన మితవాద, ప్రగతిశీల భావజాలాలు రెండింటినీ కలుపుకొని, అమెరికాలో పెట్టుబడి వికాసంతో కొత్త పారిశ్రామిక విధానాన్ని నడిపించింది. ఇది అబార్షన్ హక్కులపై ప్రగతిశీల దృక్పథాన్ని కనబరుస్తుంది. అయితే దీనిని ప్రజారోగ్య సమస్యగా, మహిళల హక్కుల సమస్యగా చూస్తుంది. ఇది నిర్మాణాత్మక జాతి వివక్షను గుర్తిస్తుంది కానీ పెరుగుతున్న సంస్కరణలను కూడా విశ్వసిస్తుంది. అధిక లోటును దృష్టిలో ఉంచుకుని సామాజిక భద్రతా వలయాన్ని విస్తరించేందుకు ఇది కట్టుబడి ఉంది. వలసలపై, మరింత కఠినమైన చట్ట అమలు, మరింత మానవీయ విధానం రెండింటి మధ్య సమతుల్యతను సాధించడానికి ప్రయత్నిస్తుంది.

భారతీయ అమెరికన్లలో, ఇల్లినాయికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మధ్యేవాది(సెంట్రిస్ట్). కానీ సిలికాన్ వ్యాలీ నుండి హౌస్ రిప్రజెంటేటివ్‌గా ఉన్న రో ఖన్నా మాత్రం సెంటర్–లెఫ్ట్ వర్గానికి చెందిన అత్యంత ప్రముఖ హక్కుదారు. ఆయన మధ్యేవాదులకు, అభ్యుదయవాదులకు కుడివైపున ఉన్న స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. పైగా 2028లో అధ్యక్ష ఎన్నికల కోసం తానూ ఒక రాయి విసరాలని భావిస్తున్నారు. మార్కెట్‌కు సాంకేతిక పరిజ్ఞానం, మధ్య అమెరికాలో శ్రామిక వర్గానికి ఆర్థిక దేశభక్తి గురించి ఈయన మాట్లాడతారు. బహుళవాదం, మైనారిటీలకు ప్రాతినిధ్యం గురించి మాట్లాడతారు. చైనాపై కఠినమైన జాతీయ భద్రతా చర్యలు, గాజాలో కాల్పుల విరమణ, కార్పొరేట్ దోపిడీ, ప్రచార సంస్కరణల భాష గురించి కూడా మాట్లాడతారు.

చివరగా, ప్రగతిశీల ధోరణిలోకి వెళ్లి చూడండి. వారు తమ సొంత అంతర్గత వైరుధ్యాలను కలిగి ఉన్నప్పటికీ, విస్తృతంగా చెప్పాలంటే, ప్రగతిశీలురు స్వేచ్ఛా వాణిజ్యంపై సందేహాస్పదంగా ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ చర్యలను సైనిక–పారిశ్రామిక సముదాయం నడపడాన్ని వ్యతిరేకిస్తారు. అసమానత, దాన్ని ఎదుర్కొనే విధానపరమైన నిర్ణయాల్లో జాతి, లింగవివక్షలను ప్రాథమిక అంశాలుగా తీసుకుంటారు. కార్పొరేట్ అధికారానికి బలమైన ప్రత్యర్థులు. అధిక పన్నుల ప్రతిపాదకులకు వ్యతిరేకులు. తీవ్రమైన వాతావరణ విధాన రక్షకులు. ప్రపంచంలోని మానవ హక్కుల వంటి సమస్యలపై మరింత చురుకైన అమెరికన్ జోక్యానికి లాబీయిస్టులు.

ఈ విభాగంలోని ప్రముఖ ముఖాలు దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, హౌస్ ప్రోగ్రెసివ్ కాకస్ చైర్ ప్రమీలా జయపాల్. పురోగామి విశ్వాసాలను కమలా హారిస్ పంచుకుంటున్నప్పటికీ, విదేశాంగ విధానాల విషయంలో మాత్రం ఆమె సెంట్రిస్ట్ వైఖరికి మారినట్టు కనిపిస్తోంది.

ఈ ఐదు రకాల ధోరణులు... అమెరికా రాజకీయాలు ఈరోజు ఎందుకు సందడిగా విభజించబడి ఉన్నాయో, పైగా మునుపెన్నడూ లేనంత సంక్లిష్టంగా ఎందుకు ఉన్నాయో వివరించడంలో సహాయపడవచ్చు. పైగా భారతీయ అమెరికన్లు అక్కడ తమ కొత్త నేల భవిష్యత్తు గురించి ప్రజాస్వామ్యబద్ధంగా, తరచుగా ఒకరితో ఒకరు వాదించుకుంటున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్
('ది హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా మురికి...



నేను చెప్పినట్టుగా, బీజేపీ ఇంకేమాత్రమూ వాషింగ్ మెషీన్ కాదు. అవినీతి పరులని ముద్ర పడిన అందరినీ ఏరుకుంటున్న డస్ట్‌బిన్. అవినీతిపరులను చేర్చుకునే బీజేపీ శాఖ లాగానూ, వాళ్ల తరఫున బలవంతపు వసూళ్లకు పాల్పడే శాఖ గానూ 'ఈడీ' ద్విపాత్రాభినయం చేస్తోంది.

– ప్రియాంక చతుర్వేది, మహారాష్ట్ర రాజ్యసభ ఎంపీ

పశువులు



జార్ఖండ్‌లో స్పెయిన్ యాత్రికురాలి మీద జరిగింది దారుణాతి దారుణం. 'జాతి గర్వం' కోసం పోరాడే సమయం ఇది కానేకాదు. ఏ సమాజంలోనైనా దుర్నీతికీ, హింసకూ తావులేదు. ఆమె కోలుకోవాలి. ఒక ఉదాహరణగా నిలిచేలా నిందితులకు వేదన కలగాలి. (ఏడుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని వార్త.)

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

ఎందుకు సిగ్గు?



చరిత్ర ప్రకారం, హిందూ దేవతలు, వారి లైంగికత పట్ల సిగ్గుపడేవారు మూడు రకాల జనాలు: 1. ముస్లిం పాలకులు. 2. వలసవాద పాలకులు. 3. జాతీయవాద పురుషులు (ఎక్కువగా సాత్విక శాకాహారులు).

– దేవ్‌దత్ పట్నాయక్, మైథాలజిస్ట్

ముందు దేశం



మీరు బీజేపీ క్రైస్తవ ముఖమా అని ఒకరు నన్ను చీదర పుట్టించేలా అడిగారు. బీజేపీకి హిందూ, క్రైస్తవ, ముస్లిం, సిక్కు ముఖాలు లేవనీ, మేమందరమూ ఇండియా ముఖాలమనీ బదులిచ్చాను.

– సేవియో రోడ్రిగ్స్, బీజేపీ గోవా నాయకుడు

ఉండకూడని అధికారం



అంతర్జాతీయ సంబంధాల్లో రావాల్సిన మార్పు ఏదైనా ఉంది అంటే అది, ఐక్యరాజ్య సమితిలో వీటోను వీటో చేయడం. ఉమ్మడి కార్యాచరణను నిలపగలిగే అధికారం ఏ ఒక్క దేశానికో ఉండకూడదు.

– ప్రియంవద గోపాల్, ప్రొఫెసర్

ఇన్ బాక్స్

సముచిత పురస్కారం

మల్టీమీడియా జర్నలిస్ట్, 'ఇండియా టుడే' మాజీ సీనియర్ ఎడిటర్ ఎస్. వెంకట్ నారాయణ్ అర్ధ శతాబ్దం పైగా దేశ విదేశాలలో గణుతికెక్కిన ప్రముఖ పాత్రికేయులు. 1979–84 మధ్యకాలంలో ఇండియా టుడేలో ఆయన పనిచేశారు. ఆయన జర్నలిస్ట్‌గా ప్రపంచంలో 65 దేశాలు పర్యటించారు. పాత్రికేయునిగా ఆయన 1968లో గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా' విలేఖరిగా తన ప్రస్థానం ప్రారంభించారు. 'లండన్ సండే టైమ్స్'లో 1975లో సమ్మర్ స్కాలర్‌గా, 1978లో అమెరికా 'బోస్టన్ గ్లోబ్'లో గెస్ట్ రైటర్‌గా ప్రతిభ కనబరిచారు.

తెలంగాణ హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో 1943 సెప్టెంబర్ 6వ తేదీన ఎస్. వెంకట్ నారాయణ్ జన్మించారు. హైదరాబాద్ నిజాం కళాశాలలో పట్టభద్రులై, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచీ 1967లో జర్నలిజంలో పీజీ కోర్స్‌లో ప్రథమ స్థాయిలో నిలచి 'షోయబుల్లా ఖాన్ స్వర్ణ పతకం' అందుకున్నారు. శ్రీలంకలోని 'ది ఐలాండ్' వార్తా పత్రిక కోసం రాసిన నారాయణ్, విదేశాలలో అనేక టీవీ, రేడియో నెట్‌వర్క్‌ల కోసం పని చేస్తున్నారు. 1999లో ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్‌కు నాయకత్వం వహించిన మొదటి భారతీయుడు వెంకట్ నారాయణ్. ప్రస్తుతం అనేక జాతీయ అంతర్జాతీయ పత్రికలు, మేగజీన్లకు అనేక అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు.



ఎస్. వెంకట్ నారాయణ్

భారత ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వీపీ సింగ్, ఐకే గుజ్రాల్; పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ జియా ఉల్ హక్, పాకిస్తాన్ ప్రధానులు బేనజీర్ భుట్టో, ఇమ్రాన్ ఖాన్; శ్రీ లంక అధ్యక్షులు జేఆర్ జయవర్ధనే, చంద్రికా కుమారతుంగ, మహింద రాజపక్స; జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబె, భూటాన్ రాజు జిగ్మె సింఘె వాంగ్చుక్ సహా వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానులు, రాజులనూ, ఉన్నత స్థాయి మంత్రులనూ, ఇతర ప్రముఖులనూ ఇంటర్వ్యూ చేసిన ఘనత సాధించారు. 1998లో కాకతీయ విశ్వ విద్యాలయం నుంచీ జర్నలిజంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1983లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ సాధించిన అద్భుతమైన ఎన్నికల విజయాన్ని తనదైన శైలిలో 131 పేజీల పుస్తకంలో ఆవిష్కరించారు వెంకట్ నారాయణ్. బహుముఖ సమర్థత కలిగిన ఎన్టీఆర్ వ్యక్తిత్వాన్ని సింహావలోకనం చేశారు.

– నందిరాజు రాధాకృష్ణ

(నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రముఖ పాత్రికేయుడు ఎస్. వెంకట్ నారాయణ్‌కు పొత్తూరి స్మారక పురస్కార ప్రదానం)

ఇతరుల మంచిని గ్రహించిన జీవధార...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మహాకవులు విశ్వనాథ, సురవరం ప్రతాపరెడ్డి దృష్టిలో రాయలు కళింగాంధ్రం నుంచి పెనుగొండ వరకు విస్తరించిన మహా సామ్రాజ్య వైభవానికి శ్రీకాకుళం కేంద్రమయింది. కాబట్టే – సకల దోషాలకు శ్రీకాకుళం 'పిడుగుపాటు'గా తోచింది!

కనుకనే –

''ఇమ్మగం గాకుళమ్ము మొదలీవరకుంగల యాంధ్ర పూర్వరా / జ్యమ్ముల పేరు చెప్పిన హృదంతరములో చలించిపోవు నా / ద్రమ్మగు చిత్తవృత్తుల పురాభవ నిర్ణయమేని ఎన్ని జ / న్మమ్ములుగాగ నీతనువునన్ బ్రవహించునా యాంధ్రరక్తముల్''

అని విశ్వనాథ కీర్తిస్తే... తెలుగు తెలంగాణ ప్రాంతం నుంచి సురవరం వారు ప్రాంతీయ భేదాలకు అతీతంగా యావదాంధ్రులకు నిష్కల్మషమైన ఆత్మీయ ఆశీస్సులతో ప్రాతినిధ్యం వహించిన మహనీయుడు. తెలుగువారి ఉనికిపట్టుల సుదీర్ఘ చారిత్రక ఆధారాలను అందించిన చారిత్రికుడు సురవరం వారు. క్రీ.శ. 1000 నుండి 1907 దాకా ఎనిమిది యుగాల తెలుగువారి ఆచార వ్యవహారాలను వెల్లడించిన సంస్కర్త. రాజరాజ నరేంద్రునికి 400 ఏండ్లకు ముందే తెలుగుదేశంలో విరివిగా వ్యాపించిన హేతువాద బౌద్ధ ధర్మం ఎందుకు మాయమై పోయిందో తేట తెల్లం చేసిన పండితుడు సురవరం. ఆంధ్రుల తొమ్మిది శతాబ్దాల సాంఘిక చరిత్ర సంగ్రహంగానే అందించినా తెలుగు వారి భాషా సంస్కృతుల ఖ్యాతిని ఎన్ని పోలికలతో, ఎంత గంభీరంగా ఆయన చాటారో అందమైన ఈ క్రింది పద్యం తెలుపుతుంది:

**''పరిపూర్ణ పావనాంభస్త రంగోద్వేగ
గౌతమీ గంభీరగ మనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్గోబ ఫలరాజ మధుర రుచికి
ఆంధ్రీకుమారీ సమాయుక్త పరిపూత
తుంగా పయస్సు మాధుర్యమునకు
ఖండశర్కరజాతి, ఖర్జూర, గోక్షీర,
ద్రాక్షాదియుత రామరసమునకును
అమృత నిష్యంది పల్లకీ హ్లాదమునకు
రాగిణీ దివ్య సమ్మోహరావమునకు
తేనెతేటల ననకంపు సోనలకును
సాటియగును మా తెనుగు భాషామతల్లి!**

(ఆంధ్రీనది = తుంగభద్రకు ఉపనది; రామరసం = మహారాష్ట్ర వారి మధుర రసం; జాజికాయ, జాపత్రి, ఏలకులు, బాదం, ద్రాక్ష, పాలు, దోస, సార, కరెపుచ్చ మున్నగు వాటి విత్తులు, సొంఠి, చక్కెర, కుంకుమ పువ్వు వగైరా వస్తువులు నూరి కలిపినదాన్ని రామరసం అంటారు. అలాగే ఆలంపూరు, బనగానపల్లె – మల్గోబ, దిల్ పసందు అనే మామిడిపండ్లకు ప్రసిద్ధ స్థలాలు)

రెండో మాట



తెలుగు వారికి ఇంత ప్రాచీన చరిత్ర, సంస్కృతీ వైభవం ఉన్నా పరాయి పాలనలో సుద్దీ కాలం పాటు కాలం వెళ్లబుచ్చవలసి రావడాన్ని జాతి ఈసడించుకొంది. అందుకే అస్వతంత్రతా బతుకును తెలుగు వారు 'ఇంక భరించలేరని' తీర్మానించుకుని తెగబడవలసి వచ్చింది. అప్పుడు గానీ, విశ్వనాథ అన్నట్టు ఆంధ్రులు ఇళ్ల ద్వారబంధాలపై ఏనాటినుంచో అజాపజా లేకుండా మూలుగుతున్న 'తొలి తెలుగు లిపిని పోల్చుకుని కూడబలుకు కోలేక పోయారు'! ఇలాంటి అస్వతంత్రతా బతుకు తెలుగువారి కెందుకు అని తీర్మానించుకుని తిరగబడాల్సి వచ్చింది. పొట్టి శ్రీరాముల ఆత్మార్పణంతోగాని ఆంధ్ర రాష్ట్ర అవతరణ సిద్ధించలేదనీ విశ్వనాథ ప్రకటించారు. కనుకనే శ్రీకాకుళాన్ని 'కలుషములకెల్ల పిడుగు' అని చాటాడు. ఎలా? తెలుగుతల్లులు శౌర్య రసాన్ని ఉగ్గుపాలతో రంగరించి మరీ 'బొడ్డు కోయని కూనకే' పోసి పెంచినవాళ్లు గనుక!

అందుకే 300 ఏళ్ల కిందటనే తమిళ పండితుడైన అయ్యప్ప దీక్షితులు... తమిళం సహా ఇతర భారతీయ భాషల వారికి లేని ప్రత్యేక సంస్కృతి ఆంధ్రులకు ఉందని అన్నారు. 'ఆంధ్రుల నుండి వారి భాష, భాషలోని నుడికారం, వారి భావాలు, వారి శిల్పకళలు, వారి పల్లెపాటలు, కథలు, విశ్వాసాలు, వారి చరిత్ర, సాంఘిక ఆచారాలను తీసివేస్తే, రేపే వారు అడవి జాతులతో కలిసిపోయే ప్రమాదం ఉంద'ని హెచ్చరించారు. ఇతరులలోని ఉత్తమ కళ లను స్వీకరించి తమ వాటితో మేళవించుకోగల్గడం నాగరిక లక్షణం. కనుకనే ఆంధ్రులు తమ భాషకు శ్రావ్యతను సమకూర్చి కర్ణాటక సంగీతమనే పేరుతో ఉత్తమ కళను మొత్తం దక్షిణాపథానికే వ్యాప్తి చేయగలిగారు. ఈ కారణం చేతనే కూచిపూడి నృత్యం, రామప్పగుడిలోని నృత్య శిల్పాలు ప్రసిద్ధిలోకి వచ్చాయి. అందువల్లనే శ్రీకాకుళానికి అంత పేరూ, ప్రతిష్ఠా! కనుకనే అప్పటికీ, ఇప్పటికీ, మరెప్పటికీ –

'చిరు తరంగముల్ కలిసి, జీబులుకట్టిన వంశధారలో /తరుముకు వచ్చె తెల్గుల ప్రతాప శిఖల్....'

abkprasad2006@yahoo.co.in

మార్గదర్శకత్వం అవసరం

భగవత్తత్త్వం బోధపరుచుకోవడానికి అడ్డదారి మార్గాలంటూ ఏవీ లేవని, వ్యక్తిలో లేనిది ఏదీ విశ్వంలో లేదు గనుక, ఏ వ్యక్తికైనా అందుకు అంతర దృష్టి ఒకటే సరియైన మార్గమని తత్త్వవేత్తలు చెబుతారు. జ్ఞాన సముపార్జనకు అడ్డదారి ప్రయత్నాల వలన ఉపయోగం ఉండదు సరికదా ఎంతో విలువైన సమయం వృథా అవుతుంది. అదేగాకుండా తగిన ఫలితం లభించక నిరాశ మొదలై, వ్యక్తిత్వాన్ని మరింతగా కృంగదీసేదిగా పరిణమిస్తుందనీ పెద్దల బోధనలు చెబుతాయి. పెద్దలు నిర్దేశించిన ఒక క్రమమైన పద్ధతిలో ప్రయత్నించి సాధన చేయడం వలననే వేదాంత విషయక జ్ఞాన సముపార్జన సాధ్యమౌతుందని మహా భారతం కూడా బోధించింది. ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, చతుర్థాశ్వాసంలోని ఈ క్రింది పద్యంలో మనసుకు హత్తుకునే ఒక అర్థవంతమైన ఉదాహరణతో ఈ సంగతి విశదీకరించబడింది.

జ్యోతిర్మయం

**అనలము దోచునే తరువునందు గుఠారముఖంబు లైన సా
ధనముల ద్రెవ్వ? సజ్జనహితా! తగ ద్రచ్చిన గాక; యట్ల యి
త్తనువు నలంగ జేసి పరతత్త్వము గాంతు మనంగ రాదు; వి
న్ననువున నాగమోక్తమథనం బొనరించిన గాని యారయన్.**

చెట్టులో అగ్ని నిక్షిప్తమై ఉంటుంది. అలాగని గొడ్డలితో నరికి చెట్టు లోపలి అగ్నిని చూద్దామని ప్రయత్నిస్తే కనబడుతుందా? కనపడదు కదా! కానీ ఒక చెట్టుకు మరొక చెట్టు రాపిడి వలన అగ్ని పుట్టి అడవులను దహించి వేయడం తెలిసిందే. అలాగే ఆగమ కర్మలలో అగ్నిని రాజెయ్యడానికి ఎండిన రెండు చెట్టు కొమ్మల ముక్కలతో (అరణులు) రాపిడి ద్వారా నిప్పును పుట్టించడం కూడా చూస్తూవుంటాం. ఇది దేనిని చెబుతుంది అంటే, ఏ విషయాన్నైనా ఎలా గ్రహింపుకు తెచ్చుకోవాలో అలా ప్రయత్నం చేస్తే ఆ ప్రయత్నం సఫలం అవుతుంది కాని, అడ్డదిడ్డమైన పద్ధతులు అవలంబించడం వలన ప్రయోజనం వుండదు అన్న సంగతిని చెబుతుంది. శరీరాన్ని నిద్రాహారాలకు దూరం చేసినందువలన పరమమైన జ్ఞానం లభిస్తుందని చేసే ప్రయత్నం ఆ కారణం చేతనే సరైనది కాదని పెద్దలు చెబుతారు. గురువు మార్గదర్శకత్వంలో నిర్దేశిత పద్ధతులలో ప్రయత్నించడం వలననే అది సాధ్యపడుతుంది అని పై పద్యంలో భావం. ఒక సందర్భంలో మనువుకు దేవగురువైన బృహస్పతికి జరిగిన సంభాషణలో, బృహస్పతి మనువుకు చెప్పిన మాటలు ఇవి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.దశమి రా.1.43 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల ఉ.11.23 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.50 నుండి 11.22 వరకు, తదుపరి రా.8.46 నుండి 10.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.39 నుండి 9.27 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.47 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
66	27
73,872	22,406

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,231	▽	44
డోజోన్స్	38,996	▽	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,634	▽	48
డాక్స్	17,716	▽	19
షాంఘై	3,039	▲	12
నికాయ్	40,109	▲	198

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,480
బంగారం (99.5 స్వచ్ఛత)	63,226
వెండి (కేజీ)	70,777

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.46	83.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.80	106.35
€	యూరో	ఎస్‌బీఐ	88.78	91.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.64	55.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.16	55.11
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.41	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.45
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

మాస్‌మెడిక్‌లో సైయంట్‌కు సభ్యత్వం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రతిష్ఠాత్మకమైన మసాచుసెట్స్ మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ కౌన్సిల్ (మాస్‌మెడిక్)లో తమకు సభ్యత్వం లభించినట్లు ఇంజినీరింగ్, టెక్నాలజీ సేవల సంస్థ సైయంట్ వెల్లడించింది. మాస్‌మెడిక్ అమెరికాలో ప్రాంతీయంగా అతిపెద్ద మెడ్‌టెక్ అసోసియేషన్ అని వివరించింది. హెల్త్‌కేర్ రంగ అభివృద్ధికి దోహదపడేందుకు కట్టుబడి ఉన్నామన డానికి ఈ భాగస్వామ్యం నిదర్శనమని సైయంట్ ప్రెసిడెంట్ ఆనంద్ పరమేశ్వరన్ తెలిపారు. నవకల్పనలపై నిబద్ధత గల సైయంట్‌తో భాగస్వామ్యం ఎంతో విలువైనది కాగలదని మాస్‌మెడిక్ సీవోవో రేచల్ రాబిన్సన్ తెలిపారు.

మార్కెట్లోకి పల్సర్ ఎన్‌ఎస్ 2024 సిరీస్ బైకులు



పుణే: దేశీయ వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తమ పల్సర్ ఎన్‌ఎస్ 125 మోడల్‌ను అప్‌డేట్ చేసి పల్సర్ ఎన్‌ఎస్ 2024 సిరీస్ పేరుతో కొత్త బైకులు తీసుకొచ్చింది. ఎన్‌ఎస్200, ఎన్‌ఎస్160, ఎన్‌ఎస్ 125 మూడు వేరియంట్లలో లభించనున్న ఈ బైకుల ధర వరుసగా రూ.1,57,427, రూ.1,45,792, రూ.1,04,922గా ఉన్నాయి. వీటిని నూతన డిజిటల్ కన్సోలెస్ అండ్ ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్‌తో తీర్చిదిద్దారు. సెమీ–డిజిటల్, బ్లూటూత్ కనెక్టివిటీ, ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్‌ఎంఎస్ అలర్ట్, ఫోన్ బ్యాటరీ సామర్థ్యం, సిగ్నల్ లెవల్, నావిగేషన్ కూడా తెలుసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-3-2024	
విశాఖ	500-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
4-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469-00
వరంగల్	471-00
రిటైల్ ధర	5.30

రెండు కంపెనీలుగా టాటా మోటార్స్

ప్యాసింజర్ వాహనాలతో ఒక బిజినెస్ ● వాణిజ్య వాహనాలతో మరో యూనిట్

టాటా గ్రూప్ దిగ్గజం టాటా మోటార్స్ రెండు లిస్టెడ్ కంపెనీలుగా విడిపోనుంది. వాణిజ్య వాహనాలు ఒక సంస్థగా, ప్రయాణికుల వాహనాలు మరో కంపెనీగా ఏర్పాటుకానుంది. తద్వారా వృద్ధి అవకాశాలను మరింత బలంగా అందిపుచ్చుకోనున్నట్లు కంపెనీ పేర్కొంటోంది.

న్యూఢిల్లీ: ఆటో రంగ లిస్టెడ్ దిగ్గజం టాటా మోటార్స్ రెండు కంపెనీలుగా విడిపోయేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. వీటి ప్రకారం సంబంధిత పెట్టుబడులతో కలిపి వాణిజ్య వాహన విభాగం ఒక సంస్థగా ఏర్పాటుకానుంది. విలాసవంత కార్ల యూనిట్ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌సహా ప్యాసింజర్ వాహనాల(పీవీ) బిజినెస్ మరో కంపెనీగా ఆవిర్భవించనుంది. దీనిలో సంబంధిత పెట్టుబడులతోపాటు ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) విభాగంసైతం కలసి ఉంటుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు టాటా మోటార్స్ తెలియజేసింది. ఎన్‌సీఎల్‌టీ నిబంధనలకు అనుగుణంగా విడదీతను చేపట్టనున్నట్లు పేర్కొంది. టాటా మోటార్స్ వాటాదారులు 2 లిస్టెడ్ సంస్థలలోనూ యథాతథంగా వాటాలను పొందుతారని స్పష్టం చేసింది.





టర్న్ అరౌండ్

గత కొన్నేళ్లలో కంపెనీ బలమైన టర్న్‌అరౌండ్‌ను సాధించింది. మూడు ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్లూ స్వతంత్ర నిర్వహణలో కొనసాగుతూ నిలకడైన పనితీరును చూపుతున్నాయి. తాజా విడదీతతో మార్కెట్ కల్పించే అవకాశాలను అందిపుచ్చుకోనున్నాయ్. – ఎన్.చంద్రశేఖరన్, చైర్మన్, టాటా మోటార్స్







12-15 నెలలు

కంపెనీ విడదీతతో కస్టమర్లకు సేవలు విస్తృతమవుతాయని టాటా మోటార్స్ చైర్మన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఉద్యోగులకు అవకాశాలు పెరుగుతాయని, వాటాదారులకు మరింత విలువ చేకూరుతుందన్నారు. విడదీత ప్రణాళికకు రానున్న నెలల్లో బోర్డుసహా.. వాటాదారులు, రుణదాతలు, నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు పొందనున్నట్లు తెలియజేశారు. విడదీత పూర్తికి 12–15 నెలలు పట్టవచ్చని అంచనా వేశారు. కంపెనీ విడదీత ఉద్యోగులు, కస్టమర్లు, వ్యాపార భాగస్వాములపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్నీ చూపబోదని స్పష్టం చేశారు. కాగా.. వాణిజ్య, ప్రయాణికుల వాహన విభాగాల మధ్య పరిమితమైన ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని టాటా మోటార్స్ పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలు 88 అనుబంధ సంస్థలు, మూడు సంయుక్త కంపెనీలు, రెండు సంయుక్త కార్యకలాపాలు తదితరాలతో విస్తరించాయి.

తాజా వార్తల నేపథ్యంలో కంపెనీ షేరు రూ. 996 వరకూ ఎగసింది. ఇది 52 వారాల గరిష్టం. చివరికి నామమాత్ర నష్టంతో రూ. 987 వద్ద ముగిసింది.

ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ పసిడి రుణాలపై ఆర్‌బీఐ నిషేధం



ముంబై: పర్యవేక్షణ లోపాల కారణంగా ఆర్థిక సేవల సంస్థ ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ బంగారం రుణాలు ఇవ్వకుండా రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించింది. ఇది తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఆర్‌బీఐ తెలిపింది. అయితే, ప్రస్తుత గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోకి సంబంధించిన వసూళ్లు, రికవరీ ప్రక్రియలను యథావిధిగా కొనసాగించవచ్చని పేర్కొంది. పసిడి రుణాలిచ్చేటప్పుడు, డిఫాల్ట్ అయిన సందర్భాల్లో వేలం వేసేటప్పుడు బంగారం స్వచ్ఛత, బరువును విలువ కట్టడంలో లోపాలు, పరిమితికి మించి నగదు రూపంలో రుణ మొత్తాన్ని మంజూరు చేయడం .. వసూలు చేయడం తదితర తీవ్ర ఉల్లంఘనలను కంపెనీ ఆడిట్‌లో గుర్తించినట్లు రిజర్వ్ బ్యాంక్ వివరించింది. అలాగే, ప్రామాణిక వేలం ప్రక్రియలను పాటించకపోవడం, కస్టమర్లకు విధించే చార్జీలపై పారదర్శకత లోపించడం మొదలైనవి కూడా కస్టమర్ల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం చూపేవేనని ఆర్‌బీఐ తెలిపింది. సంస్థపై చేపట్టిన ప్రత్యేక ఆడిట్ పూర్తయ్యాక పర్యవేక్షణపరమైన ఆంక్షలను సమీక్షించనున్నట్లు వివరించింది.

కొనసాగిన బుల్ రికార్డులు

- సూచీలకు నాలుగో రోజూ లాభాలే
- ఇంధన, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్

ముంబై: పరిమిత శ్రేణి ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ.., స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ సోమవారమూ కొనసాగింది. ఆకర్షణీయ స్థూల ఆర్థిక డేటా నమోదు కారణంగా అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ 2024 ఏడాదికి గానూ భారత జీడీపీ వృద్ధి రేటును 6.1% నుంచి 6.8 శాతానికి పెంచింది. మూడీస్ అప్‌గ్రేడ్ రేటింగ్‌తో బ్యాంకింగ్, ఇంధన, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 243 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 66 పాయింట్ల లాభంతో 73,872 వద్ద ముగిసింది. ఒక దశలో 184 పాయింట్లు బలపడి 73,990 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. నిఫ్టీ 63 పాయింట్లు పెరిగి 22,441 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 27 పాయింట్లు లాభంతో 22,406 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ముగింపు స్థాయిలు సరికొత్త రికార్డుతో పాటు వరుసగా నాలుగో రోజూ లాభాల ముగింపు. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.564 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.3,543 కోట్ల షేర్లు కొన్నారు.



గో డిజిట్ ఐపీవోకు గ్రీన్ సిగ్నల్

గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ (ఐపీవో)కి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఇష్యూ కింద రూ. 1,250 కోట్ల విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు.. ప్రస్తుత షేర్‌హోల్డర్లు 10.94 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో విక్రయించనున్నారు.

పబ్లిక్ ఇష్యూకి బ్లాక్‌బక్

లాజిస్టిక్స్ అంకుర సంస్థ బ్లాక్‌బక్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో ఉంది. ఐపీవో ద్వారా కంపెనీ సుమారు 300 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2,500 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ప్రస్తుత ఇన్వెస్టర్లు కొన్ని షేర్లు విక్రయించనుండగా, కొత్తగా మరికొన్ని షేర్లను కూడా సంస్థ జారీ చేయనున్నట్లు వివరించాయి. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను సర్వీసుల వ్యాపార విభాగాన్ని విస్తరించేందుకు బ్లాక్‌బక్ వినియోగించుకోనుంది. బ్లాక్‌బక్‌ను నిర్వహించే జింకా లాజిస్టిక్ సొల్యూషన్స్‌లో ఫ్లిప్‌కార్ట్ పెట్టుబడులు ఉన్నాయి.

2024 వృద్ధి 6.8 శాతం: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ 2024 క్యాలెండర్ ఇయర్ వృద్ధి అంచనాను గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ 70 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఇంతక్రితం 6.1 శాతం అంచనాలను 6.8 శాతానికి పెంచుతున్నట్లు వివరించింది. ''అంచనాల కంటే బలమైన'' ఆర్థిక గణాంకాలు తమ తాజా అంచనా పెంపునకు కారణంగా పేర్కొంది. జీ20 దేశాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించింది. 2025లో దేశ వృద్ధి రేటును 6.4 శాతంగా రేటింగ్ దిగ్గజం పేర్కొంది. 2023లో దేశ ఎకానమీ ఊహించినదానికన్నా అధికంగా మంచి పురోగతిని సాధించినట్లు తెలిపింది. ప్రభుత్వ మూలధన వ్యయాలు, పటిష్ట తయారీ కార్యకలాపాలు 2023లో భారత్ బలమైన వృద్ధి ఫలితాలకు దోహదపడ్డాయని మూడీస్ తన నివేదికలో పేర్కొంది.

స్లయిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా నయనతార



న్యూఢిల్లీ: శీతల పానీయ బ్రాండ్ స్లయిస్‌కి ప్రచారకర్తగా సినీ నటి నయనతార నియమితులయ్యారు. లేడీ సూపర్‌స్టార్‌గా పేరొందిన నయనతార చేరిక అనేది స్లయిస్ బ్రాండ్ మరింత మందికి చేరువయ్యేందుకు తోడ్పడగలదని పెప్సీకో ఇండియా అసోసియేట్ డైరెక్టర్ అనుజ్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి సీజన్ సందర్భంగా కొత్త ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. స్లయిస్ కుటుంబంలో భాగమవడంపై నయనతార సంతోషం వ్యక్తం చేశారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ ఈఏపీసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024(ఈఏపీసెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్(జేఎన్‌టీయూహెచ్) నిర్వహించనుంది. దీని ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో యూనివర్శిటీలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, అఫిలియేటెడ్ ప్రొఫెషనల్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సుల వివరాలు

» బీఈ, బీటెక్/బీటెక్(బయో–టెక్నాలజీ)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ) /బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీఫార్మసీ/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్/బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ(ఫారెస్ట్రీ/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ; ఫార్మ్–డి; బీఎస్సీ(నర్సింగ్).
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ)లో ఎస్సీ, ఎస్టీలకు 40%, ఇతరులకు 45% మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
» **పరీక్ష కేంద్రాలు:** ఎంసెట్ నిర్వహణకు తెలంగాణలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరితేది:** 06.04.2024.
» **దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం:** 08.04.2024 నుంచి 12.04.2024 వరకు
» **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ తేది:**01.04.2024 నుంచి
» **ఈఏపీసెట్ పరీక్షలు:** 09.05.2024 , 10.05.2024 తేదీల్లో ఇంజనీరింగ్, 11.05.2024, 12.05.2024 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు జరుగుతాయి.
» **వెబ్‌సైట్:** https://eapcet.tsche.ac.in

తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్ఈఎంఎస్)..23ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈఎంఆర్ఎస్ సెలక్షన్ టెస్ట్ (ఈఎంఆర్ఎస్ ఎస్‌టీ)–2024 పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్య, శిక్షణ అందిస్తారు. బోధనా మాధ్యమం ఆంగ్లంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:**23 విద్యాలయాల్లో 1380(690బాలురు,690బాలికలు)సీట్లు ఉన్నాయి.
» **అర్హత:** గిరిజన, ఆదివాసీ గిరిజన, సంచార గిరిజన, పాక్షిక సంచార గిరిజన, డీనోటిఫైడ్ ట్రైబ్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు అర్హులు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష(పట్టణ ప్రాంతం), రూ.లక్షన్నర(గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
» **వయసు:** 31.03.2024 నాటికి ఆరో తరగతికి 10 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం 100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ(50 ప్రశ్నలు)–50 మార్కులు, అర్థమేటిక్(25 ప్రశ్నలు)–25 మార్కులు, లాంగ్వేజ్(25 ప్రశ్నలు)–25 మార్కులు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.03.2024
» **హాల్‌టిక్కెట్‌ల డౌన్‌లోడ్ తేది:** పరీక్షకు ఒక వారం ముందు
» **పరీక్ష తేది:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** https://tsemrs.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్‌లో బీఎస్-ఎంఎస్, బీఎస్ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్–ఎంఎస్(డ్యూయల్ డిగ్రీ), బీఎస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్–2024 పరీక్ష నిర్వహిస్తుంది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు:** బెర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతి.

కోర్సులు

» **బీఎస్–ఎంఎస్(డ్యూయల్ డిగ్రీ):** కోర్సు వ్యవధి–ఐదేళ్లు.
» **బీఎస్ డిగ్రీ:** కోర్సు వ్యవధి–నాలుగేళ్లు.
» **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియట్(సైన్స్ స్ట్రీమ్) 2022, 2023, 2024 లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 01.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.05.2024
» **ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ):** 09.06.2024
» **వెబ్‌సైట్:** https://iiseradmission.in

సత్వర ఉపాధికి మార్గం.. పాలిటెక్నిక్స్

పదో తరగతి తర్వాత సత్వర ఉపాధికి మార్గం.. పాలిటెక్నిక్ కోర్సులు!! పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్నాక.. ఉద్యోగాలతోపాటు ఉన్నత విద్య కోసం బీటెక్‌లో చేరే అవకాశం కూడా ఉంది. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి మార్గం.. పాలిసెట్. రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ పాలిసెట్-2024, టీఎస్ పాలిసెట్-2024లకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. పాలిసెట్‌ల వివరాలు, పరీక్ష విధానం, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

» 2024కు ఏపీ, టీఎస్‌లో పాలిసెట్ నోటిఫికేషన్స్ విడుదల
» డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్స్ నిర్వహణ
» కోర్సులు పూర్తి చేసుకుంటే సత్వర ఉపాధి, ఉన్నత విద్య
» బీటెక్‌లో నేరుగా రెండో ఏడాదిలో అడుగు పెట్టే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో 267 పాలిటెక్నిక్ కళాశాలల్లో 31 బ్రాంచ్‌ల్లో మొత్తం 82,870 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా తెలంగాణలో 118 పాలిటెక్నిక్ కళాశాలల్లో 32 బ్రాంచ్‌లలో మొత్తం 29,790 సీట్లు ఉన్నాయి. వీటితోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని 11 అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్‌లో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో 280 సీట్లు, రెండేళ్ల వ్యవధిలోని అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సుల్లో 450 సీట్లు; అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డిప్లొమా (ఇంగ్లిష్ మీడియం)లో 90 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

పాలిటెస్‌లో ర్యాంకుతో సీట్ల భర్తీ

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాలిటెక్నిక్ కాలేజీలు అందించే డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)ను నిర్వహిస్తున్నారు.

ఏపీ, టీఎస్ పాలిసెట్‌కు అర్హతలు

పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. 2024లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం ఇలా

- ఏపీ పాలిసెట్‌ను మూడు సబ్జెక్ట్‌లలో 120 మార్కులకు నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఫిజిక్స్ 40 ప్రశ్నలు–40 మార్కులు; కెమిస్ట్రీ 30 ప్రశ్నలు–30 మార్కులకు ప్రశ్నా పత్రం ఉంటుంది. రెండు గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.
- టీఎస్ పాలిసెట్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ 60 ప్రశ్నలు –60 మార్కులు; ఫిజిక్స్ 30 ప్రశ్నలు–30 మార్కులు; కెమిస్ట్రీ 30ప్రశ్నలు–30 మార్కులు; బయాలజీ 30 ప్రశ్నలు–30 మార్కులకు ప్రశ్నా పత్రం ఉంటుంది. రెండున్నర గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.

ఉమ్మడి కౌన్సెలింగ్

పాలిసెట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహించి.. అభ్యర్థులు పొందిన మార్కులు, అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకొని ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు సంబంధిత పాలిటెక్నిక్ కళాశాలలో నిర్దేశిత తేదీలోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

డిప్లొమా కోర్సులు ఇవే

రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సుల వివరాలు.. సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్; ఎలక్ట్రికల్ వెహికిల్ టెక్నాలజీ; ఈసీఈ; ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్); ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్; అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్; కంప్యూటర్ ఇంజనీరింగ్; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్; 3–డి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్; కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్); క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా; కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్; మైనింగ్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్; అపరెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ; మెటలర్జికల్ ఇంజనీరింగ్; టెక్స్‌టైల్ ఇంజనీరింగ్; బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ (ఆయిల్ టెక్నాలజీ); కెమికల్ ఇంజనీరింగ్ (పెట్రో కెమికల్స్), కెమికల్ ఇంజనీరింగ్ (ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్); కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ); సెరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ; ప్యాకేజింగ్ టెక్నాలజీ, లెదర్ అండ్ గూడ్స్ టెక్నాలజీ; ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్; సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా; ప్రింటింగ్ టెక్నాలజీ; హోమ్ సైన్స్; మైనింగ్ ఇంజనీరింగ్.

ఉన్నత విద్య.. ఉద్యోగాలు



టీఎస్/ఏపీ పాలిసెట్-2024

- పాలిసెట్ ర్యాంకు ఆధారంగా ఆయా డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వీరు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. నెలకు రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. అదే విధంగా.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు, రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు పోటీ పడొచ్చు.
- ఉన్నత విద్య: పాలిటెక్నిక్ డిప్లొమా అర్హతతో నిర్వహించే ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈ–సెట్)లో ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టే అవకాశం ఉంది.

స్కాలర్‌షిప్ సదుపాయం

- పాలిసెట్ ర్యాంకుతో డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఏఐసీటీఈ–ప్రగతి స్కాలర్‌షిప్ పేరుతో.. దేశ వ్యాప్తంగా అయిదు వేల మంది మహిళా విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్ మొత్తాన్ని అందిస్తారు.
- అదే విధంగా సాక్షమ్ స్కాలర్‌షిప్ పేరుతో దివ్యాంగ విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల మొత్తాన్ని స్కాలర్‌షిప్‌గా అందిస్తారు.

పరీక్షలో రాణించేలా

మ్యాథమెటిక్స్

పదో తరగతి పాఠ్య పుస్తకంలోని ప్రతి చాప్టర్‌ను చదివి.. వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ; బీజగణితం; నిరూపక రేఖాగణితం; క్షేత్రమితి;త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించాలి. అదేవిధంగా ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలోని ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం ; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి.

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి.. ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు –ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం , కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలను శ్రద్ధతో చదవాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ

ఆమ్లాలు, క్షారాలు; లవణాలు, పరమాణు నిర్మాణం, పి–బ్లాక్ ఎలిమెంట్స్, పిరియాడిక్ టేబుల్, మూలకాల వర్గీకరణ, అయోనైజేషన్ ఎనర్జీ, ఎలక్ట్రోనెగెటివిటీ, మెటాలిక్, నాన్–మెటాలిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ మెటలర్జీ, కార్బన్ కాంపౌండ్స్ తదితర ముఖ్యమైన యూనిట్లలోని అన్ని అంశాలను అధ్యయనం చేయాలి.

బయాలజీ

ఈ సబ్జెక్ట్‌లో మంచి స్కోర్ కోసం ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత.. దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేసి.. భాగాలను గుర్తించడమే కాకుండా..వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా పదో తరగతి చాప్టర్స్‌లోని ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, భేదాలు తెలుసుకుంటూ చదవాలి.

ముఖ్య సమాచారం

ఏపీ పాలిసెట్ ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 5
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** 2024, ఏప్రిల్ 20 నుంచి
- **పాలిసెట్ పరీక్ష తేదీ:** 2024, ఏప్రిల్ 27 (ఉదయం 11 నుంచి 1 వరకు)
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://polycetap.nic.in/Default.aspx

టీఎస్ పాలిసెట్ ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 22
- **పాలిసెట్ తేదీ:** 2024, మే 17
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://polycet.sbtet.telangana.gov.in/#!/index



జాస్మిన్ కూడా తొలి రౌండ్‌లోనే...

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లకు నిరాశాజనక ఫలితాలు ఎదురవుతున్నాయి. మహిళల 60 కేజీల విభాగంలో భారత బాక్సర్ జాస్మిన్ లంబోరియా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో జాస్మిన్ 0-5తో అయాక తగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. పురుషుల విభాగంలో దీపక్ (51 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో మరో ఆరుగురు భారత బాక్సర్ల బౌట్‌లు జరగాల్సి ఉన్నాయి.

భారత చెస్ నంబర్‌వన్‌గా అర్జున్!

షెన్‌జెన్ మాస్టర్స్ క్లాసిక్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో విజయం చేరింది. మా కున్ (చైనా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 70 ఎత్తుల్లో నెగ్గాడు. ప్రస్తుతం మరో ఇద్దరితో కలిసి అర్జున్ ఉమ్మడిగా 'టాప్'లో ఉన్నాడు. ఈ విజయంతో క్లాసికల్ చెస్ లైవ్ రేటింగ్స్ లో అర్జున్ 2754.6 పాయింట్లతో భారత నంబర్‌వన్‌గా అవతరించాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 2751 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు.



సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్‌గా కమిన్స్



హైదరాబాద్: ఐపీఎల్ 17వ సీజన్‌లో ప్యాట్ కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బరిలోకి దిగనుంది. హైదరాబాద్ ఫ్రాంచైజీకి గత మూడేళ్లలో మారిన నాలుగో కెప్టెన్ కమిన్స్! ఈ మూడేళ్లలో మార్క్‌రమ్ (దక్షిణాఫ్రికా), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా)లు సన్‌రైజర్స్‌ను నడిపించారు. 30 ఏళ్ల స్పీడ్‌స్టర్ కమిన్స్ నాయకత్వంలో ఆస్ట్రేలియా 2023 వన్డే ప్రపంచకప్, 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్స్‌ను సాధించింది. 2021 టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టులోనూ కమిన్స్ సభ్యుడిగా ఉన్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన వేలంలో కమిన్స్‌పై సన్‌రైజర్స్ రూ. 20 కోట్ల 50 లక్షలు వెచ్చించి జట్టులోకి తీసుకుంది. తాజాగా మార్క్‌రమ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి కమిన్స్‌కు సన్‌రైజర్స్ పగ్గాలు అప్పగించింది. గతంలో కమిన్స్ కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు కానీ... కెప్టెన్‌గా మొదటిసారి ఐపీఎల్‌లో జట్టును నడిపించబోతున్నాడు. గత సీజన్‌లో మార్క్‌రమ్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌లు ఆడి నాలుగే మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.

సూపర్ స్మృతి...

- బెంగళూరు కెప్టెన్ మెరుపు ఇన్నింగ్స్
- రాణించిన ఎలీస్ పెరీ
- ఆర్‌సీబీకి మూడో విజయం
- 23 పరుగులతో ఓడిన వారియర్స్


స్మృతి మంధాన


ఎలీస్ పెరీ

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో తొలి అంచెపోటీలను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయంతో ముగించింది. ఓపెనర్, కెప్టెన్ స్మృతి మంధాన (50 బంతుల్లో 80; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), టాపార్డర్ బ్యాటర్ ఎలీస్ పెరీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగడంతో బెంగళూరు 23 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలుపొందింది. ఈ లీగ్‌లో ఆర్‌సీబీకిది మూడో విజయం. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఆంధ్ర అమ్మాయి సబ్బినేని మేఘన (21 బంతుల్లో 28; 5 ఫోర్లు)తో ఓపెనింగ్ వికెట్‌కు చకచకా 51 పరుగులు జతచేసిన స్మృతి ఆ తర్వాత పెరీ అండతో దూకుడు పెంచింది. ఇద్దరు ధనాధన్ ఆటతీరు కనబరచడంతో యూపీ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. రెండో వికెట్‌కు 10.4 ఓవర్లలో 95 పరుగులు జతచేశారు. మంధాన 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. 146 పరుగుల వద్ద స్మృతి నిష్క్రమించగా, 33 బంతుల్లో అర్ధశతకం సాధించిన పెరీ ఆఖరి ఓవర్లో అవుటైంది. రిచా ఘోష్ (10 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించింది. ఆంధ్ర అమ్మాయి అంజలి శర్వాణి, దీప్తి శర్మ, సోఫీ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేయగలిగింది. కెప్టెన్, ఓపెనర్ అలీసా హీలీ (38 బంతుల్లో 55; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పవర్‌ప్లేలో దంచేసింది. మరో ఓపెనర్ కిరణ్ నవ్‌గిరే (18) సహా చమరి ఆటపట్టు (8), గ్రేస్ హారిస్ (5), శ్వేత సెహ్రావత్ (1) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో యూపీ లక్ష్యానికి దూరమైంది. దీప్తి శర్మ (22 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్), పూనమ్ (24 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు పోరాడారు. నేటి నుంచి ఢిల్లీ వేదికపై రెండో అంచె పోటీలు జరుగుతాయి. మంగళవారం జరిగే పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.

చరిత్ర సృష్టించిన భారత టీటీ జట్లు

తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు కొత్త చరిత్ర సృష్టించాయి. ఎవరూ ఊహించని విధంగా టీమ్ విభాగంలో తొలిసారి భారత మహిళల, పురుషుల జట్లు ఒలింపిక్స్‌కు అర్హత పొందాయి. గతంలో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పోటీపడ్డా... టీమ్ విభాగంలో మాత్రం తొలిసారి భారత బృందాలు ఒలింపిక్స్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. అత్యున్నత వేదికపై రాణిస్తే తగిన ఫలితం ఉంటుందని భారత పురుషుల, మహిళల టీటీ జట్లు నిరూపించాయి. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా, ఐహిక ముఖర్జీ, దియా, అర్చన కామత్‌లతో కూడిన భారత మహిళల జట్టు... ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్, మనుష్ షాలతో కూడిన భారత పురుషుల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. దాంతో తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్లు తమ ర్యాంక్‌ను మెరుగుపర్చుకున్నాయి. ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన ఎనిమిది జట్లకు నేరుగా ఒలింపిక్స్ బెర్త్‌లు సంపాదించగా... అర్హత పొందని జట్లు సోమవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య టీమ్ ర్యాంకింగ్స్ ఆధారంగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. మహిళల విభాగంలో 13వ ర్యాంక్‌లో నిలవడంద్వారా... పురుషుల విభాగంలో 15వ ర్యాంక్‌లో నిలవడం ద్వారా భారత జట్లు పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాయి. టీమ్ ఈవెంట్‌లో అర్హత పొందడంతో భారత జట్ల నుంచి సింగిల్స్ విభాగాల్లో ఇద్దరేసి ఆటగాళ్లు పోటీపడే అవకాశం లభించనుంది. పారిస్ ఒలింపిక్స్ ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

ఫైనల్లో ముంబై



ముంబై: రంజీ ట్రోఫీలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ 41 సార్లు చాంపియన్ ముంబై జట్టు 47వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. తమిళనాడుతో జరిగిన తొలి సెమీఫైనల్లో ముంబై ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 353/9తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 106.5 ఓవర్లలో 378 పరుగులకు ఆలౌటైంది. తమిళనాడు బౌలర్లలో కెప్టెన్ సాయికిశోర్ 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 232 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తమిళనాడు షమ్స్ ములానీ (4/53), శార్దుల్ ఠాకూర్ (2/16), మోహిత్ (2/26), తనుష్ (2/18) ధాటికి 162 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. శార్దుల్ ఠాకూర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు నాగ్‌పూర్‌లో మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో విదర్భ ఆధిక్యం 261 పరుగులకు చేరుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 6 వికెట్లకు 343 పరుగులు చేసింది.

ఐపీఎల్‌కు కాన్వే దూరం!



వెల్లింగ్టన్: ఐపీఎల్ టి20 టోర్నీ డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు పెద్ద దెబ్బ. ఆ జట్టు కీలక బ్యాటర్, న్యూజిలాండ్‌కు చెందిన డెవాన్ కాన్వే ఐపీఎల్ టోర్నీకి దూరం కానున్నాడు. ఇటీవల కాన్వే ఎడమ బొటన వేలికి గాయంకాగా, ఈ వారంలో అతనికి శస్త్ర చికిత్స జరగనుంది. కాన్వే కోలుకోవడానికి కనీసం ఎనిమిది వారాల సమయం పడుతుందని సమాచారం. మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ మొదలుకానుంది. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 23 మ్యాచ్‌లు ఆడిన కాన్వే 9 అర్ధ సెంచరీలతో కలిపి 141.28 స్ట్రయిక్‌రేట్‌తో 924 పరుగులు సాధించాడు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు నిరాశ

సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. శ్రీనిధి జట్టు తరఫున రిల్వాన్ హసన్ (58వ ని.లో), ఎలీ సాబియా (61వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రియల్ కశ్మీర్ జట్టుకు క్రిజో (45+4వ ని.లో; 90+2వ ని.లో) రెండు గోల్స్ అందించగా... తారిఖ్ మీర్ (87వ ని.లో) ఒక గోల్ సాధించాడు. ప్రస్తుతం రియల్ కశ్మీర్, శ్రీనిధి జట్లు 33 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి.


ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతకంతో సాయిప్రణీత్

సాయిప్రణీత్ రిటైర్మెంట్

అమెరికాలో ప్రైవేట్ అకాడమీకి హెడ్ కోచ్‌గా వెళ్లనున్న భారత స్టార్ షట్లర్

సాక్షి, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారుల్లో ఒకడైన భమిడిపాటి సాయిప్రణీత్ ఆట నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. త్వరలో హెడ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. వచ్చే నెలలో అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉన్న ట్రయాంగిల్ బ్యాడ్మింటన్ అకాడమీ హెడ్ కోచ్‌గా 31 ఏళ్ల సాయిప్రణీత్ బాధ్యతలు తీసుకోనున్నాడు. 2008 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సాయిప్రణీత్ చివరిసారి గత ఏడాది డిసెంబర్‌లో గువాహటి మాస్టర్స్ టోర్నీలో పోటీపడి రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. పుల్లెల గోపీచంద్ వద్ద శిక్షణ తీసుకున్న సాయిప్రణీత్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి లీగ్ దశలో నిష్క్రమించాడు. 2019లో కేంద్ర ప్రభుత్వం నుంచి సాయిప్రణీత్ 'అర్జున అవార్డు' అందుకున్నాడు.

- కెరీర్ మొత్తంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కలిపి సాయిప్రణీత్ 417 మ్యాచ్‌లు ఆడాడు. 243 మ్యాచ్‌ల్లో నెగ్గి, 174 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు.
- 2020లో కెరీర్ బెస్ట్ 10వ ర్యాంక్‌ను అందుకున్న సాయిప్రణీత్ ప్రస్తుతం 106వ ర్యాంక్‌లో ఉన్నాడు.
- 2019లో స్విట్జర్లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గడం సాయిప్రణీత్ కెరీర్‌లో హైలైట్. 2017లో సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ కూడా సాధించాడు. 2016లో కెనడా గ్రాండ్‌ప్రి, 2017లో థాయ్‌లాండ్ గ్రాండ్‌ప్రి టోర్నీల్లోనూ విజేతగా నిలిచాడు.
- 2016, 2020లలో జరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు నెగ్గిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.
- 2010లో మెక్సికోలో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో, 2008లో కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో సాయిప్రణీత్ కాంస్య పతకాలు గెలిచాడు.
- బ్యాడ్మింటన్‌లో మేటి క్రీడాకారులైన లిన్ డాన్, చెన్ లాంగ్ (చైనా), లీ చోంగ్ వె (మలేసియా), తౌఫిక్ హిదాయత్ (ఇండోనేసియా), కెంటో మొమోటా (జపాన్), టామీ సుగియార్తో (ఇండోనేసియా), ఆంథోని జిన్‌టింగ్ (ఇండోనేసియా)లపై సాయిప్రణీత్ విజయాలు నమోదు చేశాడు.

గోపీచంద్ అకాడమీని వీడనున్న కోచ్ సియాదతుల్లా



రెండు దశాబ్దాలుగా పుల్లెల గోపీచంద్ అకాడమీలో కోచ్‌గా పని చేస్తున్న మొహమ్మద్ సియాదతుల్లా సిద్దిఖీ అకాడమీని వీడనున్నాడు. అమెరికాలోని ఒరెగాన్ బ్యాడ్మింటన్ అకాడమీలో సియాదతుల్లా కోచ్‌గా చేరనున్నాడు. 40 ఏళ్ల సియదతుల్లా భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్ తదితరుల వెంట పలు అంతర్జాతీయ టోర్నీల్లో కోచ్‌గా వెళ్లాడు. 'నా బావ మరిది అమెరికాలో ఉంటున్నాడు. అతను ఈ ప్రతిపాదన తెచ్చాడు. ప్రతిపాదన బాగుండటంతో అంగీకరించాను. ఈనెల 7వ తేదీన అమెరికాకు వెళుతున్నాను. జూన్‌లో కుటుంబసభ్యులు అమెరికాకు వస్తారు' అని సియాదతుల్లా తెలిపాడు.

సినిమా

వేట్టయాన్‌లో ఎంట్రీ


రజనీకాంత్


రానా

'వేట్టయాన్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు రానా. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'వేట్టయాన్' లేటెస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. రజనీకాంత్– అమితాబ్ బచ్చన్‌ల మధ్య కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో తొలిసారి సోమవారం రానా జాయిన్ అయ్యారు. రజనీకాంత్–రానా కాంబినేషన్ సీన్స్‌ని ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారట జ్ఞానవేల్. ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని, బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ మూవీ కథనం సాగుతుందని తెలిసింది. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

తెలుగు పలుకులు?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోన్ తెలుగులో చేస్తున్న తొలి స్ట్రయిట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షనల్ మూవీకి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశాపటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో పద్మ అనే పాత్రలో దీపికా పదుకోన్ నటిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'కల్కి 2898 ఏడీ'కి సంబంధించి ఇప్పటికే దీపిక పాత్ర చిత్రీకరణ మొత్తం పూర్తయిందని తెలిసింది. అయితే ఈ సినిమాలోని తన పాత్రకు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవాలని దీపిక అనుకుంటున్నారని టాక్. సొంత డబ్బింగ్ అయితే తన పాత్రకు మరింత బలం వచ్చినట్లు అవుతుందని ఆమె భావిస్తున్నారట. అతి త్వరలోనే దీపిక వాయిస్‌కు ప్రాథమిక డబ్బింగ్ టెస్ట్ నిర్వహించి, తుది నిర్ణయం తీసుకోనున్నారట నాగ్ అశ్విన్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఇటలీలో జరుగుతోందని తెలిసింది. ప్రభాస్, దిశాపటానీలపై ఓ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' మే 9న విడుదల కానుంది.


దీపికా పదుకోన్

పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా


మృణాళ్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

'గీతగోవిందం' (2018) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబోలో రూపొందుతున్న తాజా సినిమా 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఏమండి.. నేను కాలేజీకి వెళ్లాలి... కొంచెం దించేస్తారా? (మృణాల్ ఠాకూర్), 'ఒక లీటర్ పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా..'(విజయ్ దేవరకొండ)' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం గోపీ సుందర్, కెమెరా: కేయూ మోహనన్.

బాలీవుడ్ గూఢచారి?


రణ్‌వీర్ సింగ్

హీరో రణ్‌వీర్ సింగ్, 'ఉరి' ఫేమ్ ఆదిత్యాధార్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం అజయ్ దేవగన్ హీరోగా చేస్తున్న 'సింగమ్ ఎగైన్' సినిమాలో ఓ లీడ్ రోల్ చేస్తున్నారు రణ్‌వీర్ సింగ్. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. 'సింగమ్ ఎగైన్' లో తన పాత్ర షూటింగ్ పూర్తి కాగానే ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్‌లో 'డాన్ 3' సెట్స్‌లో రణ్‌వీర్ జాయిన్ అవుతారు. ఆ సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి రాగానే సూపర్ హీరో ఫిల్మ్ 'శక్తిమాన్'ను రణ్‌వీర్ ప్రారంభించాలనుకున్నారు. కానీ 'డాన్ 3' సెట్స్‌కి వెళ్లేందుకు సమయం పడుతుందట. దీంతో ఈ లోపు ఆదిత్యాధార్ చెప్పిన ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట రణ్‌వీర్. ఇండియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీస్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో రణ్‌వీర్ రోల్ కొత్తగా ఉంటుందని బీ టౌన్ టాక్. ఈ చిత్రంలో రణ్‌వీర్ గూఢచారిగా కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. వేసవి నుంచి చిత్రీకరణను ప్లాన్ చేస్తున్నారట.

భీమా సరికొత్త అనుభూతిని పంచుతుంది

- కేకే రాధామోహన్



''గోపీచంద్ ఇంతకుముందు పోలీస్ పాత్రలు చేశారు. కానీ, కొత్త జోనర్‌లో ఉండే 'భీమా' కథలో తన పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రేక్షకులు ఇలాంటి కథలని గొప్పగా ఆదరిస్తున్నారు. మా సినిమా కూడా వారికి సరికొత్త అనుభూతిని పంచుతుంది'' అని నిర్మాత కేకే రాధామోహన్ అన్నారు. గోపీచంద్ హీరోగా, ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భీమా'. ఎ.హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న విడుదలవుతోంది. కేకే రాధామోహన్ మాట్లాడుతూ–''ప్రతి ప్రాజెక్ట్ నిర్మాతకు రిస్కే. అయితే ఆ చిత్ర కథ ప్రేక్షకుల అభిరుచి తగ్గట్టు ఉందా? లేదా? అని ఆలోచించి, కథకి సరిపడా నటీనటులు? సాంకేతిక నిపుణులను ఎంచుకొని ముందుకు వెళ్లడమే. హర్షకి తెలుగులో 'భీమా' మొదటి చిత్రమైనా చాలా స్పష్టతతో తీశాడు. ప్రియా భవానీ, మాళవిక శర్మ పాత్రలు కూడా వైవిధ్యంగా ఉంటాయి. రవి బస్రూర్ అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారు. భీమాలో వీఎఫ్‌ఎక్స్‌కి చాలా ప్రాధాన్యత ఉంది. ఆయుష్ శర్మ హీరోగా హిందీలో ఓ సినిమా నిర్మిస్తున్నా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్–డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో ఓ సినిమా నిర్మిస్తాను'' అన్నారు.

కన్నీళ్లు వచ్చాయి

- చాందినీ చౌదరి



''కలర్ ఫోటో' సినిమా తర్వాత సీరియస్ యాక్ట్రెస్‌గా నాకు గుర్తింపు వచ్చింది. ఆ మూవీ తర్వాత నా పనిని ఇంకా ఎలా మెరుగుపరచుకోవచ్చు అనే దానిపైనే దృష్టి పెడుతున్నాను. 'గామి' కథ విన్నప్పుడు కచ్చితంగా భాగం కావాలనిపించింది. నా మనసుకి చాలా తృప్తి ఇచ్చిన సినిమా 'గామి'' అని హీరోయిన్ చాందినీ చౌదరి అన్నారు. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా చాందినీ చౌదరి మాట్లాడుతూ–''వారణాసి, కుంభమేళా, కాశ్మీర్, హిమాలయాలు.. ఇలా రియల్ లొకేషన్స్‌లో 'గామి'ని చిత్రీకరించాం. షూటింగ్‌లో చాలా సవాల్‌తో కూడిన పరిస్థితులు ఎదుర్కొన్నాం. ఈ సినిమా ప్రయాణం ఒక సాహస యాత్రలా జరిగింది. ఈ మూవీకి ఐదేళ్లు పట్టింది. అంత సమయం తీసుకున్నాం కాబట్టే విజువల్స్ ఇంత అద్భుతంగా వచ్చాయి. ఐమ్యాక్స్ స్క్రీన్‌లో మా మూవీ ట్రైలర్ చూసినప్పుడు మా కష్టానికి ప్రతిఫలం లభించిందనే ఆనందంతో నాకు కన్నీళ్లు వచ్చాయి. 'గామి' లాంటి సినిమా తెలుగులో ఇప్పటివరకూ రాలేదు. నేను నటించిన 4 చిత్రాలు ఈ ఏడాది విడుదల కానున్నాయి. 'యూన్నీస్' వెబ్ సిరీస్‌లోనూ నటించా'' అన్నారు.

ఆ ప్రయాణం అలరిస్తుంది

- నిహార్ కపూర్



''కవలలైన ఇద్దరు అనాథ సోదరులు అడవిలో కుస్తీ పోటీలు నేర్చుకుంటారు. సిటీకి వచ్చిన వారు అంతర్జాతీయ స్థాయిలో డబ్ల్యూ డబ్ల్యూ ఈ పోటీల దాకా ఎలా వెళ్లారు? అనే ప్రయాణాన్ని దేశభక్తి రూపంలో 'రికార్డ్ బ్రేక్' సినిమాలో చూపించారు చదలవాడ శ్రీనివాసరావుగారు. ఈ మూవీ తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో నిహార్ కపూర్ అన్నారు. నటి జయసుధ తనయుడు నిహార్ కపూర్ హీరోగా నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న రిలీజవుతోంది. నిహార్ కపూర్ మాట్లాడుతూ– ''దంగల్' మూవీ కథ కూడా కుస్తీ నేపథ్యంలో ఉంటుంది. అయితే ఆ చిత్రంతో మా 'రికార్డ్ బ్రేక్'కి ఎలాంటి పోలిక లేదు. ఇది తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు చూసి గర్వించదగ్గ సినిమా.. అందుకే ఎనిమిది భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. మా అమ్మ(జయసుధ) 'రికార్డ్ బ్రేక్' ట్రైలర్ చూసి, యునిక్ కాన్సెప్ట్ తీసుకున్నావ్ అని మెచ్చుకున్నారు. డైరెక్షన్ కోర్స్ నేర్చుకున్న నేను భవిష్యత్‌లో కచ్చితంగా డైరెక్షన్ చేస్తాను'' అన్నారు.

రంగ్ రంగ్ రంగీలా...


శ్రద్ధా దాస్

సునీల్, చైతన్య రావు, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'పారిజాత పర్వం'. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో వనమాలి క్రియేషన్స్‌పై మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రీ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'రంగ్ రంగ్ రంగీలా...' అంటూ సాగే పాటని విడుదల చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటని శ్రద్ధా దాస్ స్వయంగా పాడటంతో పాటు నర్తించారు. ''హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'పారిజాత పర్వం' రూపొందుతోంది. శ్రద్ధాదాస్ అందం, గానం 'రంగ్ రంగ్ రంగీలా...' పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: అనంత సాయి, కెమెరా: బాల సరస్వతి

వినోదాల ఆయ్

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన వినోదాత్మక చిత్రానికి 'ఆయ్' టైటిల్‌ను ఖరారు చేశారు. 'మేం ఫ్రెండ్సండి' అన్నది ఉపశీర్షిక. అంజి కంచిపల్లి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్, విద్యా కొప్పినీడి ఈ సినిమాను నిర్మించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా 'ఆయ్' రూపొందింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 7న ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: రామ్ మిర్యాల, సహ నిర్మాతలు: భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.


నార్నే నితిన్